ప్రపంచానిక ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154
నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

మోదీ స్మార్ట్ సిటీ మిషన్ విఫలం

బిహార్ గుడిలో తొక్కిసలాట
8 మంది భక్తులు మృతి

బెంగాల్‌లో ఓటర్లకు ముప్పు 05

సంపుటి 09, సంచిక: 121 | బుధవారం | 01-04-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## ఇద్దరు కుమారులకు ఉరేసి తల్లి ఆత్మహత్య

హైదరాబాద్‌లో దారుణం..

**మూసాపేట:** భర్త రెండో పెళ్లి చేసుకుని తనను వేధిస్తున్నాడనే కారణంతో ఓ ఇల్లాలు ఇద్దరు కుమారులకు ఉరివేసి, ఆపై తాను కూడా ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. హైదరాబాద్ కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన ఈ ఘటన మంగళవారం మధ్యాహ్నం వెలుగు చూసింది. వరంగల్ జిల్లా ఎల్లయ్యగూడెం పంచాయతీలోని మాణిక్యం తండాకి చెందిన బోడ ప్రవీణ్ అదే పంచాయతీలోని పదహారు చింతల తాండాకు చెందిన స్రవంతి (30)ని పదిహేనేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరు ప్రస్తుతం మూసాపేట పరిధి రాఘవేంద్ర సొసైటీలో నివాసముంటున్నారు. ప్రవీణ్ భవన నిర్మాణ రంగంలో పనిచేస్తుండగా స్రవంతి హౌస్ కీపింగ్ పనులు చేస్తోంది. వీరికి కార్తిక్ (12), కౌశిక్ (10) తరువాయి 12లో



బెంగళూరులో తెలంగాణ టెకీ

## దంపతుల ఆత్మహత్య

**బెంగళూరు:** బెంగళూరులో మహావిషాదం చోటు చేసుకుంది. తెలంగాణకు చెందిన యువ టెకీ దంపతులు బెంగళూరులో విషాదకరమైన స్థితిలో ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. తెలంగాణలోని సిద్దిపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ భానుచందర్ రెడ్డి కుంట (32) సోమవారం తన అపార్ట్‌మెంట్‌లోని ఒక గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భానుచందర్ ప్రముఖ టెక్ కంపెనీ ఐబీఎంలో పనిచేస్తున్నాడు. అతని భార్య బీబీ షాజియా సిరాజ్ (31) తమ ఇంటి తలుపు తాళం వేసి తరువాయి 12లో



విమాన ఇంధనంపై

## వ్యాట్ తగ్గించండి

సీఎంలకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు లేఖ

**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో యుద్ధంతో దేశంలో ఇంధన కొరత ఆందోళనలు నానాటికీ పెరుగుతున్నాయి. దీంతో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు రాష్ట్రాలకు కీలక అభ్యర్థన చేశారు. విమాన ఇంధనంపై వ్యాట్ తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ మేరకు రాష్ట్రాల సీఎంలకు ఆయన లేఖ రాసినట్లు జాతీయ మీడియా తరువాయి 12లో



## కోలుకున్న సోనియా...

ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్

**న్యూఢిల్లీ:** తీవ్ర అస్వస్థతకు గురై ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రిలో చికిత్స పొందిన కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు సోనియా గాంధీ మంగళవారం డిశ్చార్జ్ అయ్యారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ నెల 24న అస్వస్థత కారణంగా ఆమెను ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు కొన్ని రోజుల పాటు ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచి చికిత్స అందించారు. చికిత్సకు ఆమె శరీరం సానుకూలంగా స్పందించడంతో ఆరోగ్యం క్రమంగా మెరుగుపడింది. సోనియా పూర్తి విశ్రాంతి తరువాయి 12లో



## చేతికందిన పంట

# నేలపాలు



### రాష్ట్రవ్యాప్తంగా కురిసిన అకాల వర్షాలు

- నిజామాబాద్, నిర్మల్, జగిత్యాలలో కుదేలైన అన్నదాత
- మరో ఐదురోజులపాటు రాష్ట్రంలో వర్షాలు

ప్రజాపక్షం న్యూస్‌నెట్‌వర్క్

రాష్ట్రవ్యాప్తంగా రాత్రి కురిసిన అకాల వర్షం రైతులను నిండాముంచింది. కళ్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ఈదురుగాలులకు వరి, మొక్కజొన్న పంటలు నేల కొరిగాయి. చేతికందొచ్చిన మామిడి పంట సైతం నేల పాలయింది. ఆరుగాలం ఎండనకా వాననకా పడిన కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరయ్యిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు. సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి అన్నదాతలు కుదేలయ్యారు. నిజామాబాద్ జిల్లాలో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం అన్నదాతను ఆగమాగం చేసింది. కళ్లాల్లో ఆరబోసిన పసుపు, ఎర్ర జొన్న, జొన్న, మొక్కజొన్న తడిసి ముద్దయ్యాయి. ధర్పల్లి, సిరికొండ మండలాలలో కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. ఈదురుగాలులకు మొక్కజొన్న, వరి పంటలు నేలకొరిగాయి. చేతికొచ్చిన మామిడికాయ పంట తరువాయి 2లో

### పసుపు రైతులను ఆదుకుంటాం

మంత్రి తుమ్మల

అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన పసుపు రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టింది. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తేమకు గురైన పసుపును కూడా ఎటువంటి కోతలు లేకుండా పూర్తి తూకంతో తరువాయి 2లో

## అమిత్‌షాది అజ్ఞానం

- సిపిఐ రష్యా కమ్యూనిస్టు పార్టీ శాఖ అనడమేమిటి?
- లోక్‌సభలో చరిత్ర వక్రీకరణపై డి.రాజా మండిపాటు
- ఆర్‌ఎస్‌ఎస్ మూలాలే విదేశీవి
- విసిగిపోయి దాని తొలి ప్రధాన కార్యదర్శి సిపిఐలో చేరారు



**న్యూఢిల్లీ :** చరిత్రను వక్రీకరించే ముందు హోం మంత్రి దానిని అధ్యయనం చేయడం మంచిదని, పార్లమెంటుకు వాస్తవాలు కావాలే తప్ప ప్రచారం కాదని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. లోక్‌సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన ప్రకటన వాట్సాప్‌లో ఫార్వర్డ్ అయ్యే చరిత్రను స్థాయికి దిగజార్చిందని విమర్శించారు. భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ)ని రష్యన్ కమ్యూనిస్ట్ పార్టీ 'శాఖ' అని చెప్పడం అవాస్తం మాత్రమే కాదు, సిగ్గుచేటుతో కూడిన అజ్ఞానం అని మండిపడ్డారు. బ్రిటిష్ వలసవాదానికి వ్యతిరేకంగా పోరాడిన కార్మికులు, రైతులు, విప్లవకారుల ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న భారతదేశ సొంత వలస వ్యతిరేక ఉద్యమం నుండి 1925లో కాన్పూర్‌లో సిపిఐ ఆవిర్భవించిందని రాజా మంగళవారం ఒక ప్రకటనలో గుర్తు చేశారు. దాని అధికారికంగా స్థాపించక ముందే, 'రాచరికానికి వ్యతిరేకంగా యుద్ధం చేస్తున్నారనే' కుట్ర కేసులను కమ్యూనిస్టు విప్లవకారులపై బనాయించి జైలులో పెట్టేవారు అని తెలిపారు. బ్రిటీష్ వలస వర్గాలలో కమ్యూనిజం పట్ల అంతటి భయం ఉండేదని, అలాంటి ఒక్క ఉదాహరణనైనా ఆర్‌ఎస్‌ఎస్ చూపగలదా? అని నిలదీశారు. లెక్కలేనన్ని విమోచన ఉద్యమాల తరహాలోనే రష్యన్ విప్లవం నుండి సిపిఐ మేధోపరమైన స్ఫూర్తిని పొందింది, కానీ దాని ఆచరణ మాత్రం భారతీయ వాస్తవాలలోనే పాతుకుపోయిందని వివరించారు. భగత్ సింగ్, సూర్య సేన్ వంటి అమరవీరులను, విప్లవకారులను, సోహన్ సింగ్ బాఖ్నా వంటి వలస వ్యతిరేక యోధులను, ఎం. సింగరవేలు వంటి కార్మిక మార్గదర్శకులను, స్వామి సహజానంద్ సరస్వతి వంటి రైతు నాయకులను, వీర్ చంద్ర సింగ్ గఢ్వాలీ వంటి ధైర్యవంతులైన దేశభక్తులను కమ్యూనిస్టు భావజాలమే అందించిందని అన్నారు. సిపిఐని లక్ష్యంగా చేసుకునే తన నిస్సారమైన ప్రయత్నంలో తరువాయి 2లో



## ప్రజాస్వామ్య పద్ధతిలో మూసీ పునరుజ్జీవం

- 15 రోజులపాటు ప్రజల అభిప్రాయాలను ఆన్‌లైన్‌లో నమోదు
- విలువైన సూచనలు చేసిన వారితో భేటీ కానున్న సబ్ కమిటీ
- అధికారులకు 24 గంటలూ మూసీ సబ్ కమిటీ సభ్యులు అందుబాటులో
- మూసీ మంత్రివర్గ ఉప సంఘం సమీక్షలో డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాపక్షం/హైదరాబాద్

మూసీ పునర్జీవనం పనులు ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగుతాయని, మార్చి 31 నుంచి ఏప్రిల్ 15 వరకు ఆన్‌లైన్‌లో musrirdc@gmail.com మెయిల్ ఐడి ద్వారా మూసీ పునర్జీవనంపై ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మూసీ మంత్రివర్గ ఉప సంఘం చైర్మన్ మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సచివాలయంలో మంగళవారం రాష్ట్ర మంత్రి, మూసీ మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు పొన్నం ప్రభాకర్‌తో కలిసి మూసీ పునర్జీవనం పనుల ప్రగతిపై సవివరంగా అధికారులతో చర్చించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన విలువైన సలహాలు, సూచనలను అన్నింటిని అధికారులతో కూర్చుని విశ్లేషణ చేసి అభిప్రాయాలు వెల్లడించిన వారితో నేరుగా దశలవారీగా సబ్ కమిటీ సభ్యులు సంప్రదింపులు చేస్తారని డిప్యూటీ సిఎం తెలిపారు. మూసీ నది ఒడ్డున ఓంకారేశ్వర ఆలయం పనులకు మార్చి 28న శంకుస్థాపన జరిగిందని, ఆ రోజు నుంచి మూసీ ఫేజ్1, ఫేజ్ 2 వరకు చేయాల్సిన పనులకు సంబంధించిన రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసుకోవాలని డిప్యూటీ సిఎం అధికారులను ఆదేశించారు. డిఫెన్స్ భూములు, తరువాయి 12లో

## రూ. 313 కోట్లు ప్రజాధనం పక్కదారి !

- జిహెచ్‌ఎంసి చెత్త నిర్వహణలో భారీ అవినీతి
- కాగ్ నివేదికలో సంచలన విషయాలు



ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రేటర్ హైదరాబాద్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ (ఎస్‌డబ్ల్యూఎం) పేరుతో వందల కోట్ల రూపాయల కుంభకోణం జరిగినట్లు కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక సంచలన విషయాలను బయటపెట్టింది. చెత్తను సరిగ్గా శుద్ధి చేయకపోయినా, నిబంధనల ప్రకారం వేరు చేయకపోయినా ప్రైవేట్ సంస్థలకు రూ. 313.20 కోట్ల మేర అదనపు చెల్లింపులు జరిగాయని కాగ్ తీవ్రంగా ఆక్షేపించింది. చెత్త సేకరణ, నిర్వహణ వ్యవస్థలో ప్రణాళిక లోపాలు, పర్యవేక్షణ లోపం, ఆర్థిక అసమర్థత స్పష్టంగా కనిపిస్తున్నాయని కాగ్ నివేదిక స్పష్టం చేసింది.

**నిర్వహణ లేదు.. కానీ బిల్లులు ఫుల్ !**

2012 ఫిబ్రవరి నుంచి 2020 జూలై వరకు సుమారు 44.16 లక్షల తరువాయి 2లో



## ఉత్తమ కమ్యూనిస్టు కొండిగారి రాములు

- ఎంతో మందికి స్ఫూర్తి
- సంస్మరణ సభలో వక్తలు 12



ఇరాన్ దాడులతో

## గల్ఫ్‌లో అగ్నిజ్వాల

### ఇరాన్ నగరాలపై అమెరికా-ఇజ్రాయెల్ క్షిపణి వర్షం

- ఇరాక్‌లో అమెరికా యూనివర్సిటీపై క్షిపణి దాడి
- ధ్వంసమైన కువైట్ చమురు ట్యాంకర్ : 24 మంది సేఫ్
- లెబనాన్‌లో నలుగురు ఇజ్రాయెల్ సైనికులు మృతి
- మరో ఇద్దరు ఐ.రా.స శాంతి సైనికులు మరణం
- అమెరికాకు ఎదురుతిరిగిన స్పెయిన్, ఇటలీ
- హోర్ముజ్ వెళ్లి ఆయిల్ తెచ్చుకోవాలని మిత్ర దేశాలకు ట్రంప్ సలహా

**దుబాయ్:** త్వరగా ఒక ఒప్పందానికి రాకపోతే ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలను నేలమట్టం చేస్తామని, ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటామని ట్రంప్ మరోసారి హెచ్చరికలు చేసిన మరునాడే మంగళవారం 32వ రోజు యుద్ధంలో ఇరాన్ గల్ఫ్ వ్యాప్తంగా క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. అగ్నికీలలు,పొగలతో యుద్ధ జ్వాల ప్రజ్వరిల్లింది. స్టాక్‌మార్కెట్‌లో ప్రకంపనలు పుట్టాయి. ముడి చమురు ధర బ్యారెల్‌కు 106 డాలర్లకు చేరింది. యుద్ధం మొదలైన తర్వాత ఇప్పటివరకూ 45 శాతం మేరకు ఈ ధర పెరిగింది. దీంతో గల్ఫ్‌లోని అనేక ప్రాంతాలు బాంబు పేలుళ్ళతో దద్దరిల్లాయి. ఇరాన్‌లో ప్రధాన అణుస్థావరాలపై అమెరికా దాడులు చేయడంతో పెద్ద అగ్నిగోళం తరమాలో మంటలు గాల్లోకి లేచాయి. ఇస్ఫహాన్ సహా ఇరాన్‌లోని అనేక నగరాలు పట్టణాలపై అమెరికా,ఇజ్రాయెల్ క్షిపణి వర్షం కురిపించాయి. దుబాయ్ ఓడరేవులో పూర్తిగా లోడ్ చేసిన కువైట్ చమురు ట్యాంకర్‌ను ఇరాన్ క్షిపణులు తరువాయి 2లో

## ఆయుధం వీడిన 35 మంది నక్సలైట్లు

12 మంది మహిళలతో పాటు 25 మంది లొంగుబాటు



**రాయ్‌పూర్:** ఛత్తీస్‌గఢ్‌లో 35 మంది నక్సలైట్లు లొంగిపోయారు. వీరిలో 12 మంది మహిళలతోపాటు 25 మంది మావోయిస్టు కార్యకర్తలు ఉన్నారు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డికెఎస్‌జెడ్‌సి)కి చెందిన ఈ మావోయిస్టులందరూ బిజాపూర్‌జిల్లాలో లొంగిపోయారు. బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్‌రాజ్ పట్టలింగం చొరవతో వీరంతా జనజీవన స్రవంతిలోకి వచ్చారు. ఈ 25 మంది మావోయిస్టు కార్యకర్తల ఆచూకీ తెలియజేస్తే మొత్తంగా రూ.1.47 కోట్లు ఇస్తామని ప్రభుత్వం గతంలో రివార్డు ప్రకటించింది. దేశంలో మావోయిస్టు తీవ్రవాదాన్ని నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం విధించిన మార్చి 31వ తేదీ గడువు ముగిసిపోవడానికి కొద్ది గంటల ముందుగా ఈ పరిణామం సంభవించింది. దేశంలోని రెడ్ కారిడార్‌లో మావోయిస్టు తీవ్రవాదాన్ని గడువులోపు పూర్తిగా నిర్మూలించామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తరువాయి 2లో

## రేపు నాసా వ్యోమగాముల 'చంద్ర'దర్శన యాత్ర



### పరిభ్రమణంతో చరిత్ర సృష్టించనున్న 'ఆ నలుగురు'

### 48 గంటల కౌంట్ డౌన్ షురూ

**కెన్నడీస్పేస్ సెంటర్:** చంద్రుణ్ణి చుట్టి వచ్చేందుకు నలుగురు వ్యోమగాములతో అమెరికా నాసా తలపెట్టిన ప్రతిష్ఠాత్మకమైన ఆర్టెమిస్–2 ప్రయోగానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఫ్లోరిడా రాష్ట్రం కెన్నడీ స్పేస్ సెంటర్ నుండి భారత కాలమానం ప్రకారం గురువారం తెల్లవారుజామున 3.54 గంటలకు ఆర్టెమిస్–2 బయలుదేరుతుంది. ఈ మిషన్ ద్వారా వెన్నెల కురిపించే చంద్రుడి దగ్గరకు నాసా తరపున ప్రయాణం చేసే మొదటి మహిళా వ్యోమగామిగా క్రిస్టినా కోచ్ చరిత్ర సృష్టించడానికి సిద్ధంగా ఉన్నారు. ఐదు దశాబ్దాల తర్వాత నాసా ఈ సాహసాన్వేషణ చేపట్టింది. పది రోజుల పాటు కొనసాగే ఆర్టెమిస్–2 యాత్రలో ఈ నౌక తన వ్యోమగాములను గతంలో మునుపు ఎన్నడూ లేనివిధంగా అంతరిక్షంలోకి ఎవ్వరూ వెళ్ళనంత దూరం తీసుకువెళుతుంది. ఈ ప్రయోగంలో ఊహించని పరిమాణంలో ఉండే స్పేస్ లాంచ్ రాకెట్ దానికి కొసభాగంలో వ్యోమగాములు ప్రయాణించే ఓరియన్ స్పేస్ క్యాప్సూల్ ఉంటాయి. అపోలో తర్వాత ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు, శాస్త్రవేత్తలు,ప్రజలు ఎంతో ఆసక్తిగా గమనిస్తున్న నాసా ప్రయోగం ఇదే. మహిళా వ్యోమగామి క్రిస్టినా కోచ్‌తోపాటు మరో ముగ్గురు వ్యోమగాములలో కమాండర్ రీడ్ వైస్‌మాన్, విక్టర్ గ్రోవర్, కెన్నెడీ స్పేస్ సెంటర్‌కు చెందిన జెరెమీ హాన్సెన్‌లు నిష్ణాతులైన పైలట్లు, ఇంజనీర్లు,శాస్త్రవేత్తలుగా శిక్షణపొంది చంద్రుడిచుట్టూ మొదటిసారి పరిభ్రమించబోతున్నారు. గడచిన 50 ఏళ్ళకాలంలో చంద్రుడి చుట్టూ ఏకకాలంలో పరిభ్రమించబోతున్న ప్రముఖ వ్యోమగాములుగా ఈ నలుగురూ చరిత్ర సృష్టించబోతున్నారు.

ఆర్టెమిస్–2కు సారథ్యం వహించనున్న రీడ్ వైస్‌మాన్ నేవీ టెస్ట్ పైలట్. మేరీల్యాండ్‌లోని బాల్టిమోర్‌లో జన్మించిన వైస్‌మాన్ కేన్సర్ వ్యాధి బారిన పడిన భార్యను కోల్పోయారు. టీనేజ్‌లో ఉన్న ఇద్దరు కుమార్తెలను పెంచుకుంటూ ఎంతో గౌరవప్రదమైన జీవనం సాగిస్తున్నారు. ఇక ఈ మిషన్‌లో చంద్రుడిచుట్టూ పరిభ్రమించేందుకు ఉవ్విళ్ళూరుతున్న ఏకైక మహిళా వ్యోమగామి క్రిస్టినా కోచ్ భౌతికశాస్త్రవేత్త, ఇంజనీరు. 2019లో సుదీర్ఘంగా 328 రోజులపాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో గడిపి గొప్ప రికార్డు సృష్టించారు. మిచిగాన్‌లోని గ్రాండ్ రాపిడ్స్‌లో జన్మించి నార్త్ కరోలినాలో ఎదిగిన కోచ్ పూర్తిస్థాయిలో స్పేస్‌వాక్ చేసిన మహిళగా రికార్డు సృష్టించారు. ఇక 2009లో కెన్నడీ స్పేస్ సెంటర్‌లో చేరిన జెరెమీ హాన్సెన్ రాయల్ కెనడియన్ ఎయిర్‌ఫోర్స్ మాజీ ఫైటర్ పైలట్. ఆయన ఇంతవరకూ అంతరిక్షంలోకి వెళ్ళకపోయినాగానీ అనేకమంది వ్యోమగాములకు శిక్షణ ఇవ్వడంలో పాల్గొన్నారు. ఆయన వివాహితుడు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. 2013లో నాసా వ్యోమగామిగా ఎంపికైన విక్టర్ గ్రోవర్ నాసా స్పేస్ ఎక్స్ క్రూ–1 మిషన్ పైలట్‌గా పనిచేశారు. కాలిఫోర్నియాలోని పోనోమాలో జన్మించిన గ్రోవర్ వివాహితుడు. నలుగురు పిల్లలు ఉన్న తండ్రి. చంద్రుడిపైకి వెళ్ళిన మొదటి నల్లజాతీయుడుగా రికార్డు సృష్టించేందుకు ఆయన సిద్ధమవుతున్నారు.

## యుద్ధ ముగింపు వ్యూహ రచనలో ట్రంప్?

హోర్ముజ్ తెరవకపోయినా పట్టించుకోకూడదనే...!

ఆరు రోజుల్లో ఏదో ఒకటి తేల్చాల్సిందే


వాల్‌స్ట్రీట్ జర్నల్ తాజా కథనం

యావత్ ప్రపంచం ఇరాన్ పక్షానే... సర్వత్రా వ్యతిరేకత

గగనతలం ఇచ్చేందుకు తిరస్కరించిన ఇటలీ, స్పెయిన్

**టెహ్రాన్:** యుద్ధం ఒక నెలరోజులు పూర్తిచేసుకుని రెండోనెలలోకి ప్రవేశించిన తరుణంలో యావత్ ప్రపంచం యుద్ధానికి వ్యతిరేకంగా మారుతోంది. అది పరోక్షంగా ఇరాన్ అనుకూల వాతావరణమే. ఇంటా,బయటా దౌత్యపరంగా, సర్వత్రా ట్రంప్‌కు తీవ్ర వ్యతిరేకత రోజు రోజుకూ పెరుగుతున్న పరిస్థితుల్లో యుద్ధాన్ని ముగించేందుకు ట్రంప్ కొత్త వ్యూహాలు పన్నుతున్నారని వాల్ స్ట్రీట్ జర్నల్ (డబ్ల్యుఎస్‌జె) మంగళవారం సరికొత్త కథనం ప్రచురించింది. యుద్ధం ముగించాలంటే హోర్ముజ్ జలసంధిని తెరపించాల్సిందేనని ట్రంప్ ఇప్పటివరకూ పట్టుదలతో ఉన్నారు. హోర్ముజ్‌ను తెరిపించినప్పుడే అమెరికా పరువు దక్కుతుందన్న ఆలోచనలో ఉన్నారు. కానీ తాజాగా ట్రంప్ కొత్త బాట పట్టారు. ప్రపంచ వాణిజ్యానికి అతిముఖ్యమైన హోర్ముజ్ జలసంధిని తెరిపించడం యుద్ధ ముగింపునకు ఇంకెంతోకాలం ముఖ్యమైన విషయం కాదని తన సహాయకులకు ట్రంప్ చెప్పారని డబ్ల్యుస్‌జె పేర్కొంది. కాదూ...కూడదని హోర్ముజ్‌ను తెరిపించేందుకే ముందుకు వెళితే యుద్ధం అనుకున్నదానికంటే చాలా ఎక్కువకాలం కొనసాగుతుందని కూడా పెంటగాన్ అధికారులు అంచనావేశారు. ఇప్పటికే అమెరికా ఉభయచర నైపుణ్య దళాలు పశ్చిమాసియాకు చేరి కయ్యానికి కాలుదువ్వేందుకు ఉత్తర్వులకోసం ఎదురుచూస్తున్నాయి. తమ విద్యుత్ వ్యవస్థలను ధ్వంసం చేసినా, ఖర్గ్ ద్వీపం జోలికి వెళ్ళినా అంతమవుతారని ఇరాన్ ఇప్పటికే హెచ్చరించింది. ఇప్పటివరకూ ట్రంప్ మూడు విడతలుగా ఇచ్చిన గడువు ఏప్రిల్ ఆరో తేదీనాటికి ముగిసిపోతుంది. అందువల్ల ఆనాటికి ట్రంప్ ఏదో ఒక కీలక నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఆ ఆరు రోజులే అమెరికాను, ప్రపంచాన్ని మలుపుతిప్పే కాలం కాగలదని నిపుణులు అంచనావేస్తున్నారు. దీనికి భిన్నంగా ఈ లోపు ఇరాన్‌ను అనివార్యంగా దౌత్యమార్గం పట్టించేందుకు ఆ దేశ నౌకాదళ, క్షిపణి సామర్థ్యాలను తీవ్రస్థాయిలో బలహీనపరచే ఎత్తుగడలు కూడా కొనసాగుతున్నాయి. ఒకవేళ విఫలమైతే ఈ విషయంలో నాయకత్వం వహించాల్సిందిగా యూరప్, గల్ఫ్‌దేశాల్లో మిత్రదేశాలపై అమెరికా మరింత తీవ్రంగా ఒత్తిడి పెంచే అవకాశాలు ఉన్నాయి. శత్రుదేశాలకు హోర్ముజ్ జలసంధిలో అనుమతి లేదని ఇరాన్ గడచిన నెలరోజుల్లో అనేకసార్లు ప్రకటించింది. కొత్తగా టోల్ వసూలు చేసేందుకు ఇరాన్ పార్లమెంటులో చట్టం తీసుకువచ్చేందుకు కూడా ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. అంతకుమించిన స్థాయిలో అమెరికాలో ట్రంప్ రేటింగ్ కనిష్ఠస్థాయికి పడిపోయింది. చర్చల పేరుతో బెదిరింపులు బెడిసికొట్టాయి. ఇరాన్ విషయంలో తప్పుడు అంచనాలు వేశారని పెంటగాన్ చెప్పినా వినలేదనే కథనాలు పుంఖాను పుంఖాలుగా వస్తున్నాయి.

ఈ ఏడాది నవంబరులో ద్వైవార్షిక ఎన్నికలున్నాయి. ఈ ఎన్నికల్లో ఓడిపోతే ఇక రాబోయే రెండు సంవత్సరాల్లో ట్రంప్ కుక్కిన పేనులా పడి నరకం చూసే పరిస్థితులు ఎదురుకావచ్చు.గడచిన ఆదివారమే ట్రంప్‌కు దేశంలో అతిపెద్ద షాక్ ఎదురైంది. అమెరికాలోని అన్ని రాష్ట్రాలలో, చిన్న చిన్న పట్టణాలలో,రూరల్ ప్రాంతాలలో అనేకలక్షల మంది ఉప్పెనలా ట్రంప్ వ్యతరేక ప్రదర్శనలు చేశారు. "నో కింగ్స్..." నినాదాన్ని ప్రజలు మళ్ళీ మూడోసారి తెరమీదకు తీసుకువచ్చారు. యూరప్, ఇజ్రాయెల్‌లో కూడా ఏకకాలంలో ఇదే పరిస్థితి ఎదురైంది. ఈసారి జరిగిన ప్రదర్శనలు, నిరసనలు నభూతో...అన్న స్థాయిలో జరిగాయి. అమెరికా సుప్రీంకోర్టు తీర్పులు, అన్ని దేశాలలో పెరుగుతున్న వ్యతిరేకత, మిత్రదేశాల అసహనం, నాటో దేశాలు యుద్ధానికి దూరంగా జరిగిపోవడం, గగనతల దాడులకు కలిసిరాకపోవడం, పదే పదే విజ్ఞప్తులు చేసినాగానీ తమ ఆర్థిక వ్యవస్థలను బలిపెట్టి ముందుకు వచ్చేందుకు యూరప్ దేశాలు సిద్ధం కాకపోవడం,ముఖ్యంగా బ్రిటన్ ప్రధాన మంత్రి స్టార్‌మర్‌తో తీవ్రస్థాయిలో సంబంధాలు చెడిపోవడం, ఫ్రాన్స్ వ్యతిరేకత, స్పెయిన్, ఇటలీ దేశాలు బాహాటంగా అమెరికా యుద్ధ విమానాలకు తమ తమ గగనతల వ్యవస్థలను వాడుకోవడానికి తిరస్కరించడం, ఐక్యరాజ్యసమితిలో తీవ్ర వ్యతిరేకత కొట్టొచ్చినట్టు కనిపించడం, ఇజ్రాయెల్ దేశమే అమెరికాను యుద్ధంలో ఇరికించిందని, ట్రంప్ కంటే గతంలో ఉన్న అమెరికా అధ్యక్షులే ఇజ్రాయెల్ వలకు చిక్కకుండా ఎంతో విజ్ఞతతో వ్యవహరించారని సర్వత్రా అభిప్రాయాలు వ్యక్తం కావడం వంటి అనేక పరిణామాలు ట్రంప్‌ను తీవ్ర ఒత్తిడి గురిచేస్తున్నాయి. ఆయను ఈ ఒత్తిడితో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లు స్తంభించిపోతున్నాయి. అమెరికా ప్రతిష్ఠ చరిత్రలో ఎన్నడూలేనివిధంగా దిగజారుతోంది. చమురు ధర బ్యారెల్‌కు 115 డాలర్లకు తగ్గి కిందకు రావడంలేదు. జపాన్, దక్షిణ కొరియా వంటి అమెరికా మిత్రదేశాలతోపాటు అనేక దేశాలలో చమురు సంక్షోభం నెలకుంది.



**యుద్ధం కొనసాగించమంటున్న గల్ఫ్ దేశాలు!**


వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనానికి భిన్నంగా మరో కథనం వెలుగులోకి వచ్చింది. ఇరాన్‌లో యుద్ధం కొనసాగించాలని సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నాయకత్వానగల గల్ఫ్‌లోని పలు దేశాలు అమెరికాకు విజ్ఞప్తి చేశాయట! ఇరాన్‌పై సైనిక కొనసాగించాలని పలు గల్ఫ్ దేశాలు కోరుతున్నాయని అమెరికా,ఇజ్రాయెల్, పర్షియన్ గల్ఫ్ దేశాలకు చెందిన పేరుచెప్పడానికి ఇష్టపడని అధికారులు ప్రకటించారని అసోసియేటెడ్ ప్రెస్ తెలియజేసింది. ఇస్లామిక్ రిపబ్లిక్ దేశంలో సమూల మార్పులు వచ్చేవరకూ, లేదా ఆ దేశ నాయకత్వ వైఖరిలో మార్పు వచ్చేవరకూ సైనిక చర్య కొనసాగించాలని ఆ దేశాలు కోరుతున్నాయట! యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, బహ్రైన్ అధికారులు ప్రైవేటు సంభాషణల్లో ఈ విషయం చెప్పారని ఎ.పి తెలియజేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియాలపై ఇరాన్ ఎక్కువగా దాడులు చేస్తోంది. వారు ఇరాన్‌పై ఆగ్రహంతో ఉన్నారు. కానీ ఒమన్,ఖతార్ దేశాలు మాత్రం దౌత్య చర్చల వైపు మొగ్గుచూపుతున్నాయి.

## ఉక్రేన్‌లో 12 మంది యూరప్ విదేశాంగమంత్రుల సమావేశం

**కీవ్:** యూరప్‌కు చెందిన 12 దేశాల విదేశాంగ మంత్రులు మంగళవారం ఉక్రేన్‌లో సమావేశం జరిపారు. ఉక్రేన్ రాజధాని కీవ్ సమీపంలోని పట్టణంలో రష్యా దళాలు అరాచకాలకు పాల్పడి నారలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మిత్రదేశానికి సంఘీభావం ప్రకటించేందుకు యూరప్ విదేశీ మంత్రులు కీవ్ చేరుకున్నారు. 2022 ఫిబ్రవరి 24న ఉక్రేన్‌పై రష్యా పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభించింది. రష్యా బృందాలు ఉక్రేన్ ప్రాంతాలను ఆక్రమించి నెలరోజులపాటు బుచాలో ఉన్నాయి. ఆ తర్వాత రష్యా దళాలు వెళ్ళిపోయాయి. ఆ ప్రాంతం నుండి 400 మంది మృతదేహాలను ఉక్రేన్ క్లీనింగ్ ఆపరేషన్‌లో స్వాధీనం చేసుకుంది. అప్పటినుండీ పరస్పర దాడులతో యూరప్‌లో తీవ్ర ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల ఉక్రేన్‌లో శాంతి ప్రయత్నాలు పూర్తిగా మూలనపడ్డాయి. ఈ సందట్లో ఇరు దేశాలు చేసుకుంటున్న పరస్పర దాడులు కూడా ప్రపంచవార్తల్లో అందరి దృష్టికీ రావడంలేదు. 12 మంది మంత్రులతోపాటు కిందిస్థాయి అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఉక్రేన్ విదేవీమంత్రి ఆంద్రీ సైబిహా వారికి స్వాగతం పలికారు.



## వెనిజులాలో అమెరికా ఎంబసీ పునఃప్రారంభం



**కారకస్:** వెనిజులాలో అమెరికా దౌత్య కార్యాలయం తిరిగి ప్రారంభమైంది. కారకస్‌లో తమ దౌత్య కార్యాలయం తిరిగి తన కార్యకలాపాలు ప్రారంభిస్తుందని అమెరికా ప్రకటించింది. జనవరి ఐదో తేదీన వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో, ఆయన సతీమణిని కిడ్నాప్‌చేసి అమెరికాకు తరలించిన మూడు నెలల తర్వాత వైట్‌హౌస్ యంత్రాంగం ఈ ప్రకటన చేసింది. వెనిజులాలో మా దౌత్య ఉనికి కొత్త అధ్యాయానికి నాంది పలికిందని ఒక అధికారి వ్యాఖ్యానించారు. పదవీచ్యుతుడైన మదురోస్థానంలో దేశాధ్యక్ష బాధ్యతలు తీసుకున్న డెల్సీ రోడ్రిగ్జ్ అమెరికా అనుకూలంగా పనిచేస్తున్నారని ట్రంప్ అనేకసార్లు ప్రకటించారు. 2019 మార్చి నుండి వెనిజులాలో అమెరికా దౌత్య కార్యాలయం మూతపడింది. నికొలస్ మదురో అనుసరించిన సామ్రాజ్యవాద వ్యతిరేక, చమురు దోపిడీ వ్యతిరేక విధానాల కారణంగా వెనిజులాపై అమెరికా ఆగ్రహం పెంచుకుంది. 2010 నుండి వెనిజులాలో అమెరికా రాయబారి లేరు. కారకస్‌లో ఉన్న చార్జి డి.అఫైర్స్‌ను 2018లో మదురో బహిష్కరించారు. ఆ తర్వాత అక్కడి నుండి తన దౌత్య సిబ్బందిని అమెరికా ఉపసంహరించుకుంది. ప్రస్తుతం మదురో, ఆయన సతీమణి న్యూయార్క్ జైలులో కోర్టు విచారణ కోసం ఎదురుచూస్తున్నారు.

## ప్రజాధనం పక్కదారి !

(మొదటి పేజీ తరువాయి)

మెట్రిక్ టన్నుల పొడి చెత్తను శాస్త్రీయంగా నిర్మూలించాల్సి ఉంది. ఒప్పందం ప్రకారం జవహర్ నగర్ యార్డులో తడి చెత్తతో ఎరువులు, పొడి చెత్తతో విద్యుత్ ఉత్పత్తి చేయాలి. అయితే, ఎనిమిదేళ్ల పాటు పొడి చెత్తను కేవలం గుట్టలుగా నిల్వ చేసి, ఎలాంటి శుద్ధి చేయకుండానే 'టిప్పింగ్ రుసుము' పేరుతో రాంకీ సంస్థకు భారీగా నిధులు చెల్లించినట్లు కాగ్ నిర్ధారించింది. అధికారులు ఉద్దేశపూర్వకంగానే ప్రైవేట్ ఏజెన్సీకి లబ్ధి చేకూర్చారని నివేదిక స్పష్టం చేస్తోంది.

**కాగ్ నివేదికలోని ముఖ్యాంశాలు..**

✻ సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు, ఇతర స్థానిక సంస్థల నుంచి రావాల్సిన రూ. 47.77 కోట్ల టిప్పింగ్ రుసుమును వసూలు చేయడంలో జిహెచ్ఎంసి విఫలమైంది.

✻ రోజుకు 100 కిలోల కంటే ఎక్కువ చెత్త ఉత్పత్తి చేసే రైల్వే స్టేషన్‌ల వంటి సంస్థల నుంచి సాధారణ రుసుములే వసూలు చేస్తూ ఆదాయానికి గండి కొట్టారు.

✻ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయాల్సిన ప్రత్యేక పర్యావరణ నిధిని ఏర్పాటు చేయకపోవడం వల్ల రూ. 2.29 కోట్ల ఆదాయ నష్టం వాటిల్లింది.

✻ నిర్మాణ వ్యర్థాల (సి అండ్ టి ) నిర్వహణకు సరైన చట్ట సవరణలు చేయకపోవడంతో జీడిమెట్ల, ఫతుల్లాగూడ కేంద్రాల్లో సుమారు 10 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వ్యర్థాలు పేరుకుపోయాయి.

**వేరు చేయని చెత్త – వీడని తిప్పలు**

నగరంలో తడి, పొడి చెత్త వేరు చేయడం అనేది కాగితాలకే పరిమితమైంది. ఇళ్ల వద్ద తడి, పొడి చెత్తను వేరు చేయాలని నిబంధనలు ఉన్నా, క్షేత్రస్థాయిలో అవి అమలు కావడం లేదు. ప్రజలు వేరు చేసి ఇచ్చినా, రవాణా వాహనాల్లో మళ్ళీ కలిపి వేస్తున్నారని, దీనివల్ల డంపింగ్ యార్డుల వద్ద నిర్వహణ భారంగా మారుతోందని కాగ్ ఆక్షేపించింది. ఇప్పటికైనా జిహెచ్ఎంసి తన నిర్వహణ తీరును మార్చుకోవాలని, వినియోగదారుల ఛార్జీల వసూలుపై సమీక్ష చేపట్టాలని నివేదిక స్పష్టం చేసింది.

**ప్రాసెస్ చేయకుండానే బహిరంగ ప్రదేశాల్లోకి..**

రాష్ట్రంలోని ఇతర మున్సిపాలిటీల్లోనూ పరిస్థితి దారుణంగా ఉందని కాగ్ ఎత్తిచూపింది. డంపింగ్ యార్డులకు భూములు కేటాయించకపోవడంతో, 50 శాతానికి పైగా చెత్తను ప్రాసెస్ చేయకుండానే బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తున్నారు. ఇది ప్రజల ఆరోగ్యం, పర్యావరణానికి తీవ్ర ముప్పుగా పరిణమిస్తోంది.

## గల్ఫ్‌లో అగ్నిజ్వాల

(మొదటి పేజీ తరువాయి)

ధ్వంసం చేశాయి. దీంతో ట్యాంకర్ మంటల్లో దగ్ధమైంది. కానీ అందులో ఉన్న 24 మంది సిబ్బంది మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు. అదేవిధంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో అమెరికా రాడార్ కేంద్రంపై ఇరాన్ దాడులు చేసింది. అనేక ప్రాంతాలపై క్లస్టర్ బాంబు దాడులతో ఇజ్రాయెల్‌ను గడ గడ లాడించింది. టెల్‌అవీవ్‌పై చేసిన క్షిపణి దాడిలో తొమ్మిదిమంది గాయపడ్డారు. ఇరాక్ సులేమానియాలో ఉన్న అమెరికా విశ్వవిద్యాలయంపై ఇరాన్ క్షిపణులు మంగళవారం పూర్తిస్థాయిలో దాడులకు దిగాయి. దీంతో యూనివర్సిటీలో ఉన్న విద్యార్థులు, సిబ్బంది ప్రాణభయంతో గడగడలాడిపోయారు. యూనివర్సిటీ ప్రాంగణంలో భారీపేలుళ్ళు సంభవించాయి. ఇటీవల టెహ్రాన్‌లో ఉన్న సైన్స్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీ, ఇస్ఫహాన్ టెక్నలాజికల్ యూనివర్సిటీలపై ఇటీవల అమెరికా,ఇజ్రాయెల్ గగనతల దాడులు చేసిన తర్వాత, గల్ఫ్‌వ్యాప్తంగా ఉన్న అమెరికా విశ్వవిద్యాలయాలు, విద్యుత్ వ్యవస్థలపై దాడులు చేస్తామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ హెచ్చరిక చేసిన నేపథ్యంలో ఈ దాడి జరిగింది. మరోవైపు ఇజ్రాయెల్ కూడా ఇరాన్ వ్యాప్తంగా బాంబుదాడులు చేసింది. ఈ నేపథ్యంలో ఇరాన్‌లో అనేక వారాలపాటు యుద్ధానికి తాము సిద్ధంగా ఉన్నామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది.

మరోవైపు దక్షిణ లెబనాన్‌లో హెజ్బొల్లా చేసిన దాడుల్లో నలుగురు ఇజ్రాయెల్ సైనికులు మరణించారు. అదేవిధంగా ఐక్యరాజ్యసమితి తరపున పనిచేస్తున్న శాంతి దళాలకు చెందిన మరో ఇద్దరు సైనికులు మరణించారు. అదేసమయంలో ఇరాన్‌పై దాడులు చేసేందుకు అమెరికా తమ తమ గగనతల వ్యవస్థలను ఉపయోగించుకోవడానికి స్పెయన్, ఇటలీ దేశాలు తిరస్కరించాయి. దీంతో నాటో కూటమిలో పెద్ద చీలిక వచ్చినట్టుగా ఇరాన్ భావిస్తోంది. మిత్రదేశాలే అమెరికాకు సహాయం చేసేందుకు తిరస్కరించడంతో ఇరాన్ శిబిరంలో తమ వైఖరి సరైనదేనని మరింత ఆత్మవిశ్వాసం తొణకిసలాడుతోంది. కాగా నెలరోజులుగా జరిగిన యుద్ధంవల్ల ఇరాన్‌లో 3,492 మరణించారు. వీరిలో 1,574 మంది సామాన్య ప్రజలు కాగా, 236 మంది పిల్లలు ఉన్నారు. ఇజ్రాయెల్‌లో 19 మంది మరణించగా, లెబనాన్‌లో, 1,247 మంది మరణించారు. 10 లక్షలమంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. గల్ఫ్‌దేశాలపై ఇరాన్ చేసిన దాడుల్లో నెలరోజుల్లో 24 మంది మరణించారు. వీరిలో 11 మంది యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో మరణించారు. గల్ఫ్ మృతుల్లో ఎనిమిదిమంది భారతీయులు ఉన్నారు.

**హోర్ముజ్ వెళ్ళి.. ఆయిల్ తెచ్చుకోండి!**

**మిత్ర దేశాలకు ట్రంప్ సలహా**

హోర్ముజ్ జలసంధికి వెళ్ళి మీ ఆయిల్‌ను మీరే తెచ్చుకోవాలని డోనాల్డ్ ట్రంప్ నాటో మిత్ర దేశాలకు సలహా ఇచ్చారు. "మీకోసం మీరు పోరాటం చేయండి" అని పిలుపు ఇచ్చారు. జెట్ ఇంధనం కూడా లేకుండా తీవ్ర సంక్షోభంలో ఉన్న యూరప్, నాటో మిత్రదేశాలు హోర్ముజ్‌కు వెళ్ళి వారి చమురును వారే తెచ్చుకోవాలని కోరారు. "మీ దగ్గర కనీస అవసరాలకు కూడా జెట్ ఇంధనం లేదు, కానీ మా దగ్గర పుష్కలంగా ఉంది, మేం మీకు ఇస్తాం, మా దగ్గర కొనుక్కుని మీరు హోర్ముజ్‌కు వెళ్ళండి, అక్కడ కదలకుండా నిలిచిపోయిన మీ చమురు నౌకలను మీరే తెచ్చుకోండి, కొంచెం అలస్యమైనా ఫర్వాలేదు, మీరందరూ ధైర్యం తెచ్చుకోండి, మీ కోసం మీరు పోరాడటం నేర్చుకోవాలి,మీరు మాకు కష్టకాలంలో ఎలాగైతే అండగా నిలబడలేదో, అదేవిధంగా ఇకమీదట అమెరికా కూడా మీకు అండగా ఉండదు, మీకు అమెరికా ఉండదు, మీకోసం మీరు ఎలా పోరాటం చేయాలో ఇకమీదట నేర్చుకోండి" అని తన సొంత ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ట్రంప్ పోస్టింగ్ పెట్టారు. అసలు ఫ్రాన్స్ ఎంతమాత్రం సహాయం చేయడంలేదని విమర్శించారు. రాబోయే రోజులు మరింత సంక్లిష్టమైనవని ఈ సందర్భంగా అమెరికా రక్షణమంత్రి పెట్ హెగ్సెత్ వ్యాఖ్యానించారు.

## అమిత్‌షాది అజ్ఞానం

(మొదటి పేజీ తరువాయి)

అమిత్ షా ఈ మహోన్నత త్యాగాలు, పోరాటాల వారసత్వాన్ని మొత్తంగా అవమానించారని మండిపడ్డారు. ఇక ఆర్ఎస్ఎస్, దాని భావజాల, సంస్థాగత మూలాలు విదేశీ, ఆందోళనకరమైనవని రాజా అన్నారు. బి.ఎస్. మూంజే వంటి వ్యక్తులు బెనిటో ముస్సోలినీతో సంబంధాలు పెట్టుకున్నారని, అడాల్ఫ్ హిట్లర్ విధానాలను ఎం.ఎస్. గోల్వాల్కర్ ప్రశంసించారని గుర్తు చేశారు. అంతకంటే ముఖ్యమైనది ఆర్ఎస్ఎస్ మొదటి ప్రధాన కార్యదర్శి బాలాజీ హుద్దార్ ప్రస్థానమని పేర్కొన్నారు. భారతదేశాన్ని బ్రిటీష్ వలస పాలనలో ఉంచడంలో హెడ్గేవార్ విధేయత,భాగస్వామ్యంతో విసిగిపోయిన బాలాజీ సిపిఐలో చేరేందుకు ఆ సంస్థను విడిచిపెట్టారని తెలిపారు. వలసవాద అధికారాన్ని ఎదుర్కొన్నందుకు కమ్యూనిస్టులు జైలు శిక్షలు, బహిష్కరణలు, అణచివేతలను ఎదుర్కొంటుండగా, ఆర్ఎస్ఎస్ మాత్రం వలస వ్యతిరేక పోరాటాలకు దూరంగా ఉంటూ, విధేయతతో, సహకార ధోరణితో వ్యవహరించిందని విమర్శించారు. కాలాపానీ బ్యారక్(జైళ్ళు)లు కమ్యూనిస్టు విప్లవకారులతో నిండిపోగా, మితవాద నాయకులు బ్రిటీష్ వారు ఇచ్చే పెన్షన్లపై ఆధారపడి బతికారని తెలిపారు. నేడు 'విదేశీ సంబంధాల' గురించి మాట్లాడేవారే ప్రపంచ అధికార కేంద్రాలు, కార్పొరేట్ ప్రయోజనాలతో చేతులు కలపడం అత్యంత విడ్డూరమని అన్నారు.

ప్రధాని మోదీ బహిరంగంగా ఇజ్రాయిల్‌ను 'పితృభూమి' అని పేర్కొన్నప్పుడు, డొనాల్ ట్రంప్ వంటి ఎప్‌స్టీన్ వర్గానికి బిజెపి సేవ చేస్తున్నప్పుడు, దేశభక్తిపై ఇచ్చే ఉపన్యాసాలు డొల్లగా వినిపిస్తున్నాయన్నారు. క్షేత్రస్థాయి వాస్తవం మరింత కఠోరమైనదని, గిరిజనుల స్థానభ్రంశం, కార్పొరేట్‌ల ప్రసన్నం కోసం హింస, మూకదాడులు మతపరమైన విభజనలతో కూడిన మితవాద అతివాద వాతావరణం, ఇవే ఆర్ఎస్ఎస్– బిజెపి రాజకీయాల వాస్తవ ఫలితాలు అని విమర్శించారు. భారతదేశంలోని వామపక్షం సహజసిద్ధంగా, ప్రజాస్వామ్యయుతంగా, ప్రజల పోరాటాలలో పాతుకుపోయి ఉన్నదన్నారు.

## పసుపు రైతులను ఆదుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

కొనుగోలు చేయనున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరో సా ఇచ్చారు. ఇందుకు సంబంధించి మంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు సోమవారం నాటికి సుమారు 4,500 పసుపు కుప్పలు (27,400 బస్తాలు) రాగా, సుమారు 500 కుప్పలు బహిరంగ ప్రదేశాల్లో నిల్వ చేయడంతో గత అర్ధరాత్రి సంభవించిన బలమైన గాలులు, వర్షాల ప్రభావంతో సుమారు 35–40 మంది రైతులకు చెందిన 70–80 పసుపు కుప్పలు తేమకు గురయ్యాయి. దీంతో తడిసిన పసుపును కూడా ఎటువంటి కోతలు లేకుండా కొనుగోలు చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని, మేలురకం పసుపుకు ప్రభుత్వం ఖరారు చేసిన ధరల ప్రకారం రైతులకు చెల్లింపులు జరిగే విధంగా చూడాలని మంత్రి ఆదేశించారు.తేమ శాతం, కోతల పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేసే మార్కెట్ యార్డు అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని మార్కెట్ యార్డు సెక్రటరీలు, డైరెక్టర్, సంబంధిత అధికారులకు మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## నేలపాలు

(మొదటి పేజీ తరువాయి)

నేలపాలయ్యింది. 'రాత్రి ఆకాల వర్షంతో పసుపు, మొక్కజొన్న పంట నిర్మల్ నియోజకవర్గంలోనే చాలా ఘోరంగా ఉంది. పసుపును తొమ్మిది నెలలు పండించి, చేతికొచ్చిన పంట అమ్ముకుంటామనే సమయానికి ఇలా అయింది. ఆ పసుపును ఉడకబెట్టి కష్టపడి అంత చేస్తే రాత్రి అనుకోకుండా వర్షం రావడంతో తడిసి ముద్దయింది. దీనికి ఏమైనా ప్రభుత్వం స్పందించి సహాయం చేయగలరని కోరుకుంటున్నాం' ఓ బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

**ఈదురు గాలులతో కూడిన వర్షం**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మార్కెట్ యార్డులో ఆరబెట్టిన మక్కలు తడిసిపోయాయి. నిర్మల్ జిల్లాలో కురిసిన అకాల వర్షానికి అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. చేతికొచ్చిన మామిడి పంట నేలపాలయ్యింది. కళ్లల్లో ఆరబెట్టిన పసుపుకొమ్ములు తడిసి ముద్దయ్యాయి. మంచిర్యాల జిల్లా దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాలలో రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. లక్సెట్టిపేట మండలం ఇటిక్యాల గ్రామంలో 20 ఎకరాల మొక్కజొన్న పంట నేలకొరగడంతో రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికొచ్చిన మామిడి పంట నేలపాలు కావడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

'రాత్రి అనుకోకుండా పెద్ద ఎత్తున గాలి, ధుమారం, పిడుగులు, వర్షాలు వల్ల చేతికొచ్చిన పంటలు మొక్కజొన్న, జొన్న, నువ్వు పంటలకు దాదాపు నష్టం జరిగింది. పసుపును ఉడుకబెట్టి రేపు, ఎల్లుండి రెడీ చేసుకొని అమ్ముకోవాలనుకున్నాం. కానీ ఇప్పుడు తడిసి ముద్దయింది' అని మరో బాధితుడు చెప్పారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి, మల్లాపూర్ , కథలాపూర్, పెగడపల్లి గ్రామాల్లో సోమవారం అర్ధరాత్రి గాలి దుమారంతో కూడిన అకాల వర్షం రైతులను నిలువుగా ముంచింది. మామిడి మొక్కజొన్న రైతులను కోలుకోకుండా చేసింది.కొన్ని గ్రామాల్లో నువ్వు పంట కూడా నేల పాలయింది. సోమవారం రాత్రి వచ్చిన గాలులకు మొక్కజొన్న నేలవాలగా, మామిడికాయలు రాలిపోయాయి. కళ్ళల్లో ఆరబోసిన పసుపు తడిసింది. కోత కోసి అమ్మే దశలో మొక్కజొన్న,అసలే అంతంత మాత్రం కాపుకొచ్చిన మామిడి ఈదురు గాలులకు వర్షార్పణం అయ్యాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. చేతికొచ్చిన మొక్కజొన్న దెబ్బ తినడంతో రైతుల పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది. మంచిర్యాల జిల్లావ్యాప్తంగా సోమవారం అర్ధరాత్రి వీచిన ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం తీవ్ర విషాదాన్ని నింపింది. ఒక్కసారిగా వాతావరణం మారిపోయి గాలివాన విరుచుకుపడటంతో వరి, మొక్కజొన్న, మామిడి, కూరగాయల తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా మందమర్రి, నెన్నెల, భీమారం, జన్నారం, హాజీపూర్ మండలాల పరిసరాల్లో చేతికొచ్చిన మామిడి పంట రాలిపోయి రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు.

**తెలంగాణలో ఐదు రోజుల పాటు వర్షాలు: వాతావరణ శాఖ**

ద్రోణి, గాలి అనిశ్చితితో పాటు ఉపరితల చక్రవాకం ప్రభావంతో తెలంగాణలో ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇవాళ, రేపు ఉరుములు మెరుపులతో కూడిన వడగళ్ల వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారి ధర్మరాజు తెలిపారు.

## 35 మంది నక్సలైట్లు

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం లోక్‌సభలో ప్రకటించిన విషయం తెలిసిందే. అదేవిధంగా ఇటీవలికాలంలో భద్రతాదళాలు బిజాపూర్‌లోని ఒక రహస్య నిల్వ కేంద్రం నుండి రూ.2.90 కోట్లు నగదు, 93 ఆయుధాలు, రూ.11.16 కోట్లు విలువగల 7.20 కేజీల బంగారాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టుల ఉద్యమ చరిత్రలో ఎన్నడూలేనివిధంగా భారీస్థాయిలో ఈ నిల్వలను ఇటీవల స్వాధీనం చేసుకున్నామని సీనియర్ అధికారులు చెప్పారు. కాగా ఈనెలారంభంలో మావోయిస్టులు రహస్యంగా దాచి ఉంచిన ఒక నిల్వ కేంద్రం నుండి రూ.5.37 కోట్లు విలువైన ఆస్తులు స్వాధీనం చేసుకున్నారు. వీటిల్లో రూ.1.64 కోట్లు విలువైన కేజీ బంగారం, రూ. 3.73 కోట్లు నగదు స్వాధీనం చేసుకున్నారు. పైన చెప్పినట్లు కొత్తగా స్వాధీనం చేసుకున్న నిల్వలతో మొత్తం స్వాధీనం చేసుకున్న ఆస్తులు రూ.19.43 కోట్లకు చేరుకోగా ఇందులో రూ.6.63 కోట్లు నగదు, రూ.12.80 కోట్లు విలువైన 8.20 కేజీల బంగారం ఉన్నట్లు అధికారులు చెప్పారు. అదేవిధంగా నాలుగు ఎకె–47 రైఫిళ్ళు, తొమ్మిది ఎస్ఎల్ఆర్ రైఫిళ్ళు, ఒక ఇన్సాస్ ఎల్ఎంజి (లైట్ మెషిన్ గన్), ఏడు ఇన్సాస్ రైఫిళ్ళు, ఒక కార్బన్, 303 రైఫిల్స్ మరో 12, ఎనిమిది ఎంఎం పిస్తోల్, ఏడు సింగిల్ షాట్ వెపన్స్, 23 బ్యారల్ గ్రేడ్ లాంఛర్స్ (బిజిఎల్),మూడు 315 బోర్ రైఫిల్స్, 12–బోర్ గన్స్ మరో పద్నాలుగు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బిజాపూర్‌లో లొంగిపోయిన ప్రముఖులలో కంపెనీ కమాండర్లు మంగళ్ కోర్సా అలియాస్ మోటూ (42), ఆకాశ్ అలియాస్ ఫాగు ఊకే (38), డివిజనల్ కమిటీ సభ్యుడు శంకర్ ముచకి (33) ఉన్నారు. వీరిలో ఒక్కొక్కరిపైన ప్రభుత్వం రూ.8 లక్షలు నగదు బహుమతి ప్రకటించింది. అదేవిధంగా లొంగిపోయిన ఏరియా కమిటీ సభ్యుడు పాలే కుర్సం అలియాస్ కమ్లి కుర్సమ్ (40)ను పట్టిస్తే రూ.5 లక్షలు నగదు బహుమతి ఇస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది.

దంతెవాడ జిల్లాలో డికెఎస్‌జెడ్‌సికి చెందిన ఐదుగురు మావోయిస్టులు లొంగిపోయారు. వీరిపై మొత్తం రూ.తొమ్మిది లక్షల రూపాయలు నగదు రివార్డును ప్రభుత్వం ప్రకటించింది. వీరంతా సిఆర్‌పిఎఫ్ అధికారుల ఎదుట లొంగిపోయారు. వారిని బైరాంఘర్ ఏరియా కమిటీ సభ్యుడు సోమ్ కడ్తి (42) ఉన్నారు. ఆయనను పట్టిస్తే రూ.5 లక్షలు నగదు ఇస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. లఖ్మ ఓయం (19), సరిత (21),జోగి కల్మ(20), మోతీ ఓయం(19)లు ఒక్కొక్కరిపై ప్రభుత్వం లక్ష రూపాయలు రివార్డు ప్రకటించింది. లొంగిపోయిన కార్యకర్తలు ఇచ్చిన సమాచారం ప్రకారం భద్రతాదళాలు ఈ ప్రాంతంలోని మావోయిస్టు నిల్వ కేంద్రం నుండ 40 ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాయి. వీటిల్లో ఎస్ఎల్ఆర్‌లు, ఇన్సాస్ రైఫిళ్ళు, ఒక కార్బన్, 303 రైఫిల్, బిజిఎల్ లాంఛర్స్ ఉన్నాయి. సుక్మా జిల్లాలో జనిల అలియాస్ మడ్కమ్ హిడ్మే (30), సోని అలియాస్ మాధవి కోసి (24) లొంగిపోయారు. వీరిపై ప్రభుత్వం గతంలో రూ.8 లక్షలు రివార్డు ప్రకటించింది. ఈ జిల్లాలో ఒక మావోయిస్టు డంప్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. దీంతోంచి రూ.10 లక్షలు నగదు, ఇన్సాస్ ఎల్ఎంజి, రెండు ఎకె–47 రైఫిల్స్,మూడు 303 రైఫిల్స్, ఆయుధ సామాగ్రి స్వాధీనం చేసుకున్నారు. కాంకెర్ జిల్లాలో శంకర్ అనే ఒక ప్లాటూన్ పార్టీ కమిటీ సభ్యుడు, ప్లటూన్ సభ్యుడు హిడ్మా దోడి లొంగిపోయారు. వారి నుండి ఒక ఎకె–47 రైఫిల్ స్వాధీనం చేసుకున్నారు. నారాయణ్‌పూర్‌లో బిజ్లూ మాధవి (26) లొంగిపోయారు. ఈ ప్రాంతంలో ఆమె ఒక్కరే చిట్టచివరి క్రియాశీల మావోయిస్టు కార్యకర్త. అమెపై ప్రభుత్వం ఒక లక్షరూపాయలు నగదు బహుమతి ప్రకటించింది. జిల్లా రిజర్వు గార్డులు, జిల్లా పోలీసులు, ఛత్తీస్‌గఢ్ సాయుధ బలగాలు, ప్రత్యేక కర్తవ్య నిర్వహణా బృందాలు, కోబ్రా, సిఆర్‌పిఎఫ్, ఇతర యూనిట్ల సమన్వయ చర్యల ద్వారా వీరంతా లొంగిపోయారు.

# మహిళా సాధికారతకు మహాలక్ష్మి కిరీటం

**▫ 290 కోట్ల ఉచిత ప్రయాణాలు.. రూ.10 వేల కోట్ల ఆర్థిక ఆదా ▫ ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు పెద్దపీట : భట్టి విక్రమార్క**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసి ఉచిత బస్సు ప్రయాణం'మహాలక్ష్మి పథకం' పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు పెద్దపీట వేశామని, సంకల్పం ఉంటే ఏదైనా సాధ్యమే అని ప్రజా ప్రభుత్వం చేసి చూపిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' పథకం ద్వారా ఇప్పటి వరకు మహిళలు సుమారు 290 కోట్ల సార్లు ప్రయాణించి, తద్వారా రూ.10 వేల కోట్ల ప్రయాణ ఛార్జీలను ఆదా చేసుకున్నారని ప్రభుత్వం ప్రకటించింది. ఈ చారిత్రాత్మక మైలురాయిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అభినందన సభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు.

### మహిళా ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి : భట్టి

మహిళలు ఆదా చేసుకున్న ఈ రూ. 10 వేల కోట్లు వారి కుటుంబ ఆర్థిక అవసరాలకు, పిల్లల చదువులకు ఉపయోగపడతాయనీ, కేవలం ఉచిత బస్సు ప్రయాణమే కాకుండా, మహిళలను లక్షాధికారులను చేయడమే మా లక్ష్యమని చెప్పారు.

### ఆర్‌టిసి కార్మికులంతా మా కుటుంబ సభ్యులే : పొన్నం

'మహాలక్ష్మి పథకం విజయవంతం కావడంలో ఆర్‌టిసి డ్రైవర్లు, కండక్టర్ల పాత్ర మరువలేనిదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రోజుకు 65 లక్షల మంది ప్రయాణికులలో 40 లక్షల మంది మహిళలే ఉండటం గొప్ప విషయమని, ఆర్‌టిసిని కాపాడుకుంటూనే మహిళలకు ఈ సదుపాయం కల్పిస్తున్నామని స్పష్టం చేశారు.

### రాజకీయ విమర్శలకు మహిళలే సమాధానం చెప్పాలి : సీతక్క

మంత్రి సీతక్క మాట్లాడుతూ ఉచిత ప్రయాణాన్ని విమర్శించే వారికి మహిళలు తమ తిరుగుబాటు ద్వారా సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. 'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మహిళలను ఆర్‌టిసి బస్సులకు యజమానులను చేశాం. అనంతరం మహిళలు పొదుపు చేసుకున్న రూ. 10వేల కోట్ల మెగా చెక్కును మంత్రులు ఆర్‌టిసి ఎండి వై. నాగిరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్, మాజీ మేయర్ గద్వాల విజయ లక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, సెర్ప్ సిఇఓ దివ్య, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, ఆర్‌టిసి ఇడిలు సిహెచ్.వెంకన్న, ఖుస్రో షా ఖాన్ , రాజశేఖర్ పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. వేలాది మంది మహిళలు పాల్గొని ఉత్సాహంగా ఈ వేడుకను జరుపుకున్నారు.

### ఏప్రిల్ 2 నుంచి గ్రామసభలు పెద్ద ఎత్తున నిర్వహించాలి

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గ్రామ సభలను పెద్ద ఎత్తున నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్ నుంచి మంగళవారం సాయంత్రం డిప్యూటీ సిఎం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు. గ్రామ సభలు నిర్వహించే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే తరహాలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను డిప్యూటీ సిఎం ఆదేశించారు. మొదట ముఖ్యమంత్రి సందేశం వినిపించి ఆ తర్వాత ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, వాటి లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించాలని, జూన్ 2 నుంచి అందరికీ జీవిత బీమా అమలు చేయనున్న విషయాన్ని వివరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం, ఇంటర్ కళాశాలల విద్యార్థులకు కొత్తగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న విషయం అందరికీ తెలిసేలా చెప్పాలని, వీటిని వివరించే క్రమంలో సాంస్కృతిక శాఖ, పౌర సంబంధాల శాఖ సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తున్నామని, గ్రామాల వారిగా విడుదలైన నిధుల వివరాలను గ్రామసభ రోజు ఆ గ్రామానికి ఎంత చేరిందో ప్రకటించాలన్నారు. ప్రజా పాలన కార్యక్రమం విజయవంతం అవుతున్న తీరును ఎప్పటికప్పుడు చీఫ్ సెక్రటరీ, ప్రణాళికా శాఖ జిల్లా కలెక్టర్ల నుంచి సమాచారం సేకరిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకే పరిమితం కాకుండా మౌలిక సదుపాయాల అభివృద్ధి, సేవా రంగాన్ని అభివృద్ధి చేస్తూ ముందుకు పోతున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని డిప్యూటీ సిఎం తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లండి

**▫ రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గిస్తూ, నానో యూరియా, నానో డిఎపి వినియోగం వైపు మొగ్గు చూపాలి ▫ రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామ స్థాయిలో ప్రకృతి వ్యవసాయం, నానో యూరియా వినియోగంపై విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం జరిగిన 88వ 'రైతు నేస్తం' కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు, అధికారులకు ప్రకృతి వ్యవసాయ, నానో యూరియా వాడకంపై దిశానిర్దేశం చేశారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న యువ రైతు సందీప్‌ను, నానో యూరియా వినియోగంలో ముందున్న మహేంద్ర రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. యూరియా అధిక వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించడంతో పాటు, ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్ ద్వారా సాగు విస్తీర్ణానికి అనుగుణంగా అవసరమైన యూరియా మోతాదును రైతులు సులభంగా తెలుసుకోవచ్చని మంత్రి తెలిపారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గిస్తూ, నానో యూరియా, నానో డిఎపి వినియోగం, ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని సూచించారు. అలా గే, వ్యవసాయంతో పాటు అనుబంధ శాఖల ద్వారా రైతులకు ఆధునిక సాంకేతిక సమాచారాన్ని అందించాలన్నారు. 99 రోజుల ప్రజా పాలనలో భాగంగా మే 4 నుండి 9 వరకు నిర్వహించనున్న రైతు ఉత్సవాల్లో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. అంతకుముందు రాష్ట్రవ్యాప్తంగా 1600 రైతు వేదికల ద్వారా పాల్గొన్న రైతులకు యాదాద్రి జిల్లాకు చెందిన సందీప్ ప్రకృతి వ్యవసాయం, స్వీయ మార్కెటింగ్ పద్ధతులపై వివరించారు. ఖమ్మం జిల్లాకు చెందిన మహేంద్ర రెడ్డి వరి సాగులో నానో యూరియా వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన మాజీ సైనికుడు నవీన్ ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై తన అనుభవాలను పంచుకుని ఇతర రైతులకు స్ఫూర్తినిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బాబురావు ప్రకృతి వ్యవసాయంలో తన అనుభవాలను వివరించారు. అలాగే, జగిత్యాల జిల్లా గూడూరు, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి ప్రాంతాలకు చెందిన రైతులు అడిగిన ప్రశ్నలకు వ్యవసాయ శాస్త్రవేత్తలు సమగ్ర సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్ వ్యవసాయ అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





**ఎపి నిబంధనలకు విరుద్ధంగా**

# శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తే సహించేది లేదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని ఎక్సైజ్ శాఖ మంత్రి, జూపల్లి కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వాయర్‌లో కనిష్ట నీటి మట్టం స్థాయి 834 అడుగుల (254.2 మీటర్లు) కు చేరుకున్నప్పుడు విద్యుత్ ఉత్పత్తి చేయరాదనే నిబంధనను బేఖాతరు చేస్తోందన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం అచ్చంపేట ఎంఎల్‌ఎ వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ ఎంఎల్‌ఎ రాజేశ్వర్ రెడ్డిలతో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సాగు, తాగునీటి అవసరాలు పట్టించుకోకుండా ఎపి సర్కార్ అక్రమంగా, అన్యాయంగా నీటిని తోడేస్తోందని ఈ అంశంపై ఎన్ని సార్లు విన్నవించినా ఎపి సర్కార్ పట్టించుకోకపోవడంతో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజాప్రతినిధులం శ్రీశైలం వద్ద వంటావార్పు కార్యక్రమానికి పిలుపు నివ్వడంతో విద్యుత్ ఉత్పత్తిని నిలిపేసిందని మంత్రి తెలిపారు. ప్రజాప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ, ఈ ప్రాంత ప్రజాప్రతినిధులకు తెలంగాణ ప్రజల ప్రయోజనాలే ముఖ్యం తెలంగాణకు దక్కాల్సిన నీటి కేటాయింపుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. పాలమూరు జిల్లాకు నష్టం జరిగితే రైతు పక్షాన ప్రభుత్వం పోరాడుతుందని ఎపి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



**'కాళేశ్వరం' కొట్టుకుపోతే, మల్లన్న సాగర్‌లో 25 టిఎంసిల**

# నీళ్లెక్కడి నుండొచ్చాయ్?

**బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కేంద్ర మంత్రి సి.ఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలు బిజెపి, కాంగ్రెస్ పార్టీల ఫెవికాల్ బంధానికి నిదర్శనమని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కొట్టుకుపోతే, మల్లన్న సాగర్‌లో 25 టిఎంసిల నీళ్లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. కేంద్ర మంత్రులు,కాంగ్రెస్ నాయకులు తమతో వస్తే కాళేశ్వరం జలాలతో గలగలా పారుతున్న గోదావరి నీళ్లను, పండుతున్న పొలాలను చూపిస్తామని ఆయన సవాల్ విసిరారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీహాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ కేంద్ర మంత్రులు సిఆర్.పాటిల్, కిషన్ రెడ్డి, బండి సంజయ్, కాంగ్రెస్ నాయకులు యాదాద్రి భువనగిరి, చొప్పదండి, జగిత్యాల, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, మెదక్, నర్సాపూర్ రైతుల వద్దకు కాళేశ్వరం నీటిని, వాటి వల్ల పండుతున్న పంటలను చూద్దామా అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి పాటిల్ వ్యాఖ్యలు సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న భాషలాగే ఉందన్నారు. రూ 90వేల కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల రూపాయాలు ఎలా కొట్టుకుపోయాయని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని రకాల అనుమతులు ఇచ్చిందే కేంద్ర ప్రభుత్వమని, కాళేశ్వరం ప్రాజెక్టు దేశానికే ఆదర్శమని అప్పట్లో కేంద్ర మంత్రులు, అధికారులు ప్రశంసించారని హరీశ్ రావు గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ 'ఎకనామిక్ సర్వే', రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పెట్టిన బడ్జెట్ లెక్కలే కాళేశ్వరం విజయానికి సజీవ సాక్ష్యాలన్నారు. శాసనసభ సమావేశాలు ఒక దిశా నిర్దేశం లేకుండా ముగిశాయని, ఆరు గ్యారంటీలపైన స్పష్టత ఇవ్వలేదన్నారు. ప్రజా సమస్యలపైన చర్చించేందుకు ప్రభుత్వం కనీసం ముందుకు రాలేదని ఆరోపించారు. శాసనసభ సమావేశాల్లో సగం రోజులు ప్రశ్నోత్తరాలు నడపలేదని, ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నలు చర్చకు రాకుండా చేశారని ఆరోపించారు. శాసనసభను గాంధీభవన్‌గా మార్చారన్నారు. అవినీతి నుంచి మంత్రిని కాపాడేందుకు బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలను రెండు రోజుల పాటు సస్పెండ్ చేసి, ప్రతిపక్షం లేకుండానే ముఖ్యమైన బిల్లులను ఆమోదించుకున్నారని ఆరోపించారు. కృష్ణా, గోదావరి జలాలపై అసెంబ్లీలో చర్చిద్దామని అడిగితే సిఎం రేవంత్ రెడ్డి ఎందుకు పారిపోయారని ప్రశ్నించారు.

# గిరిజన యువతకు సిఎంఎస్‌టిఇఐ పథకం సబ్సిడి విడుదల

**నిలిచిపోయిన ప్రాజెక్టులకు నూతన జీవం**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు ఆర్థిక తోడ్పాటును అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న సిఎంఎస్‌టిఇఐ (చీఫ్ మినిస్టర్ షెడ్యూల్ ట్రైబ్స్, ఎంటర్‌ప్ర్యూనర్‌షిప్, ఇనోవేషన్) పథకం కింద నిలిచిపోయిన ప్రాజెక్టులకు ఊపిరి వచ్చింది. దాదాపు రెండున్నర ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సబ్సిడీలను విడుదల చేయడంతో లబ్ధిదారుల జీవితాల్లో కొత్త ఆశలు చిగురించాయి. ఈ పథకం పరిధిలో మొత్తం 200 మంది అభ్యర్థులు ఎంపికకాగా, అందులో 18 మంది తుది ప్రొసీడింగ్స్ పొందారు. ప్రాజెక్టుల అమలుకు అవసరమైన సబ్సిడీ విడుదలలో ఆలస్యం కారణంగా వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిలో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన రూ.50 కోట్లలో భాగంగా ఒక త్రైమాసికానికి సంబంధించిన రూ.12.30 కోట్లు విడుదల చేశారు. అందులో రూ.8.16 కోట్లు 18 మంది లబ్ధిదారులకు సబ్సిడీగా అందజేయడం విశేషం. ఈ పథకం కింద ప్రాజెక్ట్ ఆర్థిక నిర్మాణం 35 శాతం సబ్సిడీ, 55 శాతం బ్యాంకు రుణం, 10 శాతం లబ్ధిదారుడి వాటాతో అమలవుతుంది. సబ్సిడీ విడుదలతో నిలిచిపోయిన ప్రాజెక్టులు మళ్లీ గాడిలో పడే అవకాశాలు ఏర్పడ్డాయి.

### సిఎంకు లబ్ధిదారులు కృతజ్ఞతలు

ప్రభుత్వం సబ్సిడి నిధులను విడుదల చేయడంతో నిలబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ల చొరవ వల్లే ఈ సమస్య పరిష్కారమైందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మంగళవారం సచివాలయం లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌నుకలిపి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గిరిజన యువత స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగేందుకు ఇది ఒక కీలక అడుగు అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ సంతోష్, జిఎం శంకర్ రావు, స్టేట్ మిషన్ మేనేజర్ లక్ష్మీ ప్రసాద్, డిజిఎం రవి కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ న్యాయవాదుల రక్షణ బిల్లు ఆమోదం హర్షణీయం

**ఐఎఎల్ రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ న్యాయవాదుల రక్షణ బిల్లు 2026ను శాసనసభ, శాసనమండలిలో ఏకగ్రీవంగా ఆమోదం పొందడం పట్ల ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. బిల్లును సభలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదింప చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బిల్లుకు సహకరించి ఏకగ్రీవంగా ఆమోదింప చేసినందుకు అన్ని రాజకీయ పక్షాల శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులకు ఐఎఎల్ తరపున ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ప్రత్యేక పరిస్థితుల్లో కోర్టు ఆఫీసర్స్‌కు ఉన్న రక్షణను బిల్లులో న్యాయవాదులకు కల్పించడాన్ని స్వాగతిస్తున్నమన్నారు. బిల్లుపై శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా సిపిఐ శాసనసభ పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు న్యాయవాదులకు ప్రత్యేకంగా అకాడమీ ఏర్పాటు, బార్ అసోసియేషన్‌లలో మౌలిక సదుపాయాలు, లైబ్రరీలు, మహిళా న్యాయవాదులకు ప్రత్యక గదులకు, జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ పెంపు, కోర్టకు హాజరయ్యే కక్షిదారులకు గదులు ఏర్పాటు తదితర ప్రతిపాదనను మంత్రి శ్రీధర్ బాబు సానుకూలత వ్యక్తం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. న్యాయవాదు అకాడమీ ద్వారా న్యాయవాదుల వృత్తి నైపుణ్యం, న్యాయ వ్యవస్థ ఔన్నత్యానికి మరింత దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం బార్ అసోసియేషన్ పటిష్టతకు, కక్ష దారులకు తగు వసతులను కోర్టు ఆవరణలో ఏర్పాటు చేయాలని, జూనియర్ న్యాయవాదులకు ఇచ్చే స్టైఫండ్ రూ.10వేలకు పెంచాలని, సీనియర్ న్యాయవాదులకు పెన్షన్ పద్ధతిని ప్రవేశపెట్టాలని, చనిపోయిన న్యాయవాదుల కుటుంబాలకు సంక్షేమ నిధి నుంచి చెల్లించే మొత్తాన్ని రూ.20 లక్షలకు పెంచాలని, న్యాయవాదులకు మెడికల్ స్కీం ద్వారా పూర్తి వైద్య ఖర్చులు భరించాలని, అర్హులైన న్యాయవాదులకు గృహ వసతి పథకాన్ని చేపట్టాలని బొమ్మగాని ప్రభాకర్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. న్యాయవాదుల సంక్షేమ నిధికి రూ.500 కోట్లు కేటాయించి, నిర్వహణ బాధ్యతను బార్ కౌన్సిల్‌కే అప్పగించాలని ప్రభాకర్ ప్రభుత్వాన్ని కోరారు.

### హత్య కేసులో 15 మందికి యావజ్జీవ కారాగార శిక్ష

**జిల్లా ప్రధాన న్యాయస్థానం సంచలన తీర్పు**

**ప్రజాపక్షం/కరీంనగర్ :** గత కొన్నేళ్ల క్రితం కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చామనపల్లి గ్రామంలో జరిగిన బొజ్జ తిరుపతి హత్య కేసులో నిందితులకు జిల్లా ప్రధాన, సెషన్స్ కోర్టు కఠిన శిక్షను ఖరారు చేసింది. నిందితులుగా ఉన్న 15 మందికి యావజ్జీవ కారాగార శిక్ష (Life Imprisonment), తలో రూ.1,500లు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి మంగళవారం తీర్పు వెల్లడించారు. 2019, ఏప్రిల్ 19వ తేదీన చామనపల్లి గ్రామ పొలిమేరలో ఈ దారుణం జరిగింది. గ్రామ మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడిగా ఉన్న బొజ్జ తిరుపతి (48), చేపల వేటకు సంబంధించి నిందితులను సభ్యత్వం నుండి తొలగించారనే కక్షతో ఈ హత్య జరిగింది. నిందితులైన మయాకల ధర్మరాజం (ఎ1), మరో14 మంది సభ్యులు పథకం ప్రకారం తిరుపతిపై రాళ్లతో దాడి చేసి, తువాలుతో గొంతు నులిమి అత్యంత దారుణంగా హత్య చేశారు. మృతుడి భార్య బొజ్జ సమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో మయాకల ధర్మరాజం, మయాకల రాములు, మయాకల పోచయ్య, మయాకల కొమురయ్య, మయాకల అంజయ్య, మయాకల వెంకటేశం, మయాకల నవీన్, మయాకల ప్రవీణ్, మయాకల శ్రీనివాస్ (కొమురయ్య కుమారుడు), మయాకల శ్రీనివాస్ (రాములు కుమారుడు), మయాకల సంపత్, మయాకల లచ్చయ్య, మయాకల సత్తయ్య, మయాకల శ్రీనివాస్ (వెంకటేశం కుమారుడు), మయాకల వెంకట్రాజంలకు శిక్ష పడింది.


కేసును సమర్థవంతం గా దర్యాప్తు చేసిన నాటి కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ కె.శశిధర్, ప్రస్తుత ఎస్‌హెచ్‌ఓ ఏ.నిరంజన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.ప్రతాప్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ (సిడిఓ) ఎన్.రాజేందర్, మరియు సి.ఎం.ఎస్ ఏఎస్‌ఐ ఎం. సత్తయ్యలను సీపీ ప్రత్యేకంగా అభినందించారు. శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలను కోర్టు ముందు ప్రవేశపెట్టి నిందితులకు శిక్ష పడేలా చేయడంలో వీరు కీలక పాత్ర పోషించరన్నారు. నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా చూడటంలో పోలీసు యంత్రాంగం నిరంతరం శ్రమిస్తుందని ఈ సందర్భంగా సిపి పేర్కొన్నారు.

### 'టూరిజంలో అక్రమాలు' కథనంపై టిజిటిడిసి వివరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిజిటిడిసి)పై వచ్చిన ఆరోపణలను ఖండిస్తూ ఆ సంస్థ వివరణ విడుదల చేసింది. టూరిజం శాఖలో అక్రమాలు శీర్షికతో ప్రచురితమైన కథనంపై స్పందిస్తూ, ఆ వార్తలో పేర్కొన్న అంశాలు వాస్తవాలకు విరుద్ధమని స్పష్టం చేసింది. బోటింగ్ కార్యకలాపాలకు సంబంధించి రూ.1.48 కోట్ల ఆదాయ దుర్వినియోగం జరిగిందన్న ఆరోపణలు అసత్యమని టిజిటిడిసి తెలిపింది. టికెటింగ్ వ్యవస్థ పూర్తిగా ఆన్‌లైన్, ఎలక్ట్రానిక్ విధానంలో జరుగుతుందని, ప్రతి టికెట్ నిర్దిష్ట రేట్ల ప్రకారం జారీ అవుతుందని వెల్లడించింది. బోట్ల వినియోగం, ప్రయాణ సమయం, ఇంజిన్ స్థితి ఆధారంగా ఖర్చులు నిర్ణయించబడతాయని, అన్ని బిల్లులు సరైన డాక్యుమెంటేషన్‌తో ఉండి ఆడిట్‌కు లోబడి ఉంటాయని తెలిపింది.

### కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం

**ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డికి జలమండలి ఉద్యోగుల ఘన సన్మానం**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తాను ఎల్లప్పుడూ ముందుండి పోరాటం చేస్తానని ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉ పాధ్యక్షులు, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి అన్నారు. ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులుగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మొగుళ్ళ రాజిరెడ్డిని, ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కా ర్యదర్శి టి.పి.రాఘవేంద్ర రాజ్‌ను హైదరాబాద్, జలమండలి కేంద్ర కార్యాలయంలో మంగళవారం జలమండలి ఉద్యోగులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణే తన ప్రధాన ధ్యేయమని, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపై గళమెత్తి, న్యాయం జరిగే వరకు తన పోరాటం ఆగదని ప్రకటించారు. కార్యక్రమంలో యూనియన్ అసోసియేట్ ప్రెసిడెంట్ అల్లి శ్రావన్ కుమార్, ఎండి జాంగిర్, ప్రధాన కార్యదర్శి ఈ.చంద్రశేఖర్, నాయకులు కె.ఆనంద్ రెడ్డి, బి.శంకర్ ప్రకాష్, బి.నర్సింగ్ రావు, ఏ.అశోక్ తదితరులు పాల్గొన్నారు.


**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ : కూకట్‌పల్లి జోన్**

Lr.No. 01/CMC/SWM/EE/2025-26 తేదీ: 31.03.2026

NIT No. 01/CMC/SWM/EE/2025-26, తేదీ: 31.03.2026, పని పేరు: గుర్రపు డెక్క తొలగించడం, అంచనా విలువ: రూ.42.00 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం: 01.04.2026న ఉ.11.30గం.ల నుండి 08.04.2026న ఉ.11.30గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: శ్రీమతి సక్కుబాయి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎస్‌డబ్ల్యుఎం), కూకట్‌పల్లి జోన్, సిఎంసి, సెల్ నెం. 7893066262. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://tender.telangana.gov.in/ లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎస్‌డబ్ల్యుఎం), కూకట్‌పల్లి జోన్, సిఎంసి.

DIPR R.O. No. : 17851-PP/CL/ADVT/1/2025-26, Date: 31-03-2026

తెలంగాణ రాష్ట్రము

**పురపాలక సంఘం తాండూర్ :: వికారాబాద్ జిల్లా.**

No/MCT/1289/2026 బహిరంగ వేలం ప్రకటన తేదీ: 31.03.2026

మున్సిపల్ కౌన్సిల్ తాండూర్ వారు తెలంగాణ మున్సిపల్ యాక్ట్-2019 యొక్క సెక్షన్ 52 ప్రకారం ఆర్థిక సంవత్సరం 2026-27 కాలవ్యవధి కొరకు తాండూరు మున్సిపాలిటీ వద్ద డైలీ బేసిస్ పై చికెన్, మటన్ మరియు ఫిష్ వేస్ట్ లను సేకరించు, రవాణాచేయు మరియు సైంటిఫిక్ డిస్పోజల్ ఏజెన్సీల నియామకం కొరకు సంబంధిత మరియు అనుభవదారి కంపెనీలు/సంస్థలు/ ఏజెన్సీల నుండి దరఖాస్తులను ఆహ్వానించనైనది. "In favour of The Commissioner, Tandur Municipality" పేరున బ్యాంకు నుండి తీసిన డిడి రూ.5,000/- లను జతపరిచి తేదీ: 06.04.2006 న సాయంత్రం 4,00 వరకు మునిసిపల్ కార్యాలయంలో దాఖలు చేయవచ్చు. తేదీ: 07.04.2026 నాడు ఉదయం. 11:00 గంటలకు మున్సిపల్ కార్యాలయం యందు బహిరంగ వేలం (ఓపెన్ ఆక్షన్) వేయుటకు నిర్ణయించినాము. కావున ఇట్టి బహిరంగ వేలం (ఓపెన్ ఆక్షన్) యందు పాల్గొనే ఆసక్తి గల అభ్యర్థులు ఈ క్రింద తెలిపిన నియమ నిబంధనలు పాటించవలెను.

అర్హత నియమావళి:-

1. బిడ్డరుదారుడు కంపెనీ ప్రొఫైల్ యొక్క క్రెడియన్షియల్స్, అనుభవం మరియు ఏవేని ఇతర సంబంధిత పత్రాలను దాఖలు చేయవలెను.
2. బహిరంగ వేలం యందు పాల్గొను పాటదారు రూ.1,00,000/- లు (డి.డి లేక నగదు రూపములో జమ చేయవలెను), వేలం దక్కని వారికి అట్టి రూపాయలు తిరిగి చెల్లించబడును.
3. తెలంగాణ యొక్క ఏవేని మునిసిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ చేత జారీ చేయబడిన కనీస (3) సం. ల రవాణా అనుభవం కలిగిన సర్టిఫికెట్.
4. స్వంతంగా లేదా లీజుతో కనీసం (2) రవాణా వాహనాలు కలిగి ఉండవలెను.
5. లేటెస్ట్ బాయిలర్ సర్టిఫికెట్- 2025,
6. స్వంత/ లీజ్ ఫీడింగ్ సెంటర్ లోకేషన్ వివరాలు,
7. మున్సిపాలిటీకి సంబంధించి ఆస్తి పన్ను మరియు గత వేలం పాటలో గెలుచుకొని బకాయి ఉన్న వారికి అనుమతించబడదు.
8. అత్యధిక పాటదారు డిపాజిట్ రూపాయలలో ధరావత్తు రూ.లు 1,00,000/-లు కలుపుకొని మిగిలిన రూపాయలు (7) రోజులలో చెల్లించి మీ సొంత ఖర్చుతో అగ్రిమెంటు చేసుకొనిన తదుపరి మాత్రమే వసూలు చేసుకొనుటకు అనుమతించబడును. సకాలంలో చెల్లింపులు చేయని యడల ధరావతు జప్తు చేసుకొని రెండవ అత్యధిక వేలం దారునికి షరతులతో అప్పగించబడును.

ఇతర వివరముల కొరకు పురపాలక సంఘం కార్యాలయ రెవెన్యూ విభాగములో సంప్రదించగలరు. 0.

నోట్: ఎటువంటి కారణములు చూపకుండానే బహిరంగ వేలమును వాయిదా వేయుటకు లేదా రద్దు చేయుటకుగాను పురపాలక సంఘమునకు పూర్తి హక్కులు కలవు అని వేలములో పాల్గొనే వారందరు ఇట్టి విషయాన్ని గ్రహించవలెను.

సం/- కమిషనర్
పురపాలక సంఘం, తాండూర్.

DIPR R.O. No. : 17811-PP/CL/ADVT/1/2025-26, Date: 31-03-2026

**పురపాలక సంఘ కార్యాలయము :: భువనగిరి**

కొటేషన్ మరియు ఆసక్తి వ్యక్తీకరణ (E.O.I.) నోటీసు ప్రకటన

ఫైలు నెం. 21/28/2025-26, తేది: 31.03.2026

1) భువనగిరి పురపాలక సంఘం యందు గల వీధి కుక్కలను పట్టుకొని Animal Birth Control Centre (ABC) యందు శస్త్ర చికిత్సలు మరియు వాక్సినేషన్ చేసి వదిలి పెట్టుట కొరకు అనుభవజ్ఞులైన ఏజెన్సీల వారి నుండి, 2) భువనగిరి పురపాలక సంఘం యందు గల అన్ని వార్డులలో సంచరిస్తున్న కోతులను పట్టించుటకు మరియు పట్టిన కోతులను భువనగిరి పట్టణము నుండి దూరంగా అటవీ ప్రాంతంలో వదిలి పెట్టుటకు, 3) గౌరవ చైర్పర్సన్ మరియు గౌరవ కమీషనర్ గార్లు వివిధ సమీక్షా సమావేశములకు హాజరగుటకు, అభివృద్ధి పనుల పర్యవేక్షణకు అద్దె కార్లను ఎంగేజ్ చేయుట కొరకు వివిధ ఏజెన్సీల వారి నుండి ఆసక్తి వ్యక్తీకరణ (E.O.I.) కోరనైనది. ఆసక్తి గల వారు తేది 08.04.2026 లోపు శ్రీయుత మున్సిపల్ కమీషనర్ గారి పేరున రూ.5,000/-ల డిమాండ్ డ్రాఫ్ట్ కూడియున్న దరఖాస్తును పురపాలక సంఘ కార్యాలయం యందు సమర్పించి Request for Proposal (RFP) ఫారమ్ పొందగలరు.

భువనగిరి పురపాలక సంఘంలో 1) ప్రభుత్వ కార్యక్రమములు, జాతీయ నాయకుల జయంతి వర్ధంతులు నిర్వహించుటకు, పండుగల నిర్వహణకు అవసరమగు ఏర్పాట్ల కొరకు, 2) నీటి సరఫరా, వీధి దీపముల నిర్వహణకు అవసరమగు సామగ్రి కొరకు మరియు వాటర్ ట్యాంకర్లు ఎంగేజ్ చేయుట, 3) ఓపెన్ జిమ్‌లు, చిల్డ్రన్ ప్లే ఎక్విప్‌మెంట్ సరఫరా మరియు వాటి మరమ్మత్తుల కొరకు, 4) పార్కుల నిర్వహణ కొరకు అవసరమగు సామగ్రికి, 5) పురపాలక సంఘ వాహనముల మరమ్మత్తులకు, 6) పురపాలక సంఘం కంప్యూటర్లు, ప్రింటర్లు మరమ్మత్తులు, క్యాట్రిడ్జ్‌లు 8- ఫిల్లింగ్, మరమ్మత్తుల, 7) శానిటేషన్ నిర్వహణకు సంబంధించి వివిధ సామగ్రి మరియు కెమికల్స్, 8) పురపాలక సంఘం యందు వివిధ పనుల కొరకు జె.సి.బి., డోజర్, ట్రాక్టర్, లేబర్ ఎంగేజ్ చేసుకొనుటకు, 9) కార్యాలయ నిర్వహణకు అవసరమగు స్టేషనరీ సామగ్రి, రిజిష్టర్లు, అగ్రిమెంట్ బుక్లెట్స్, 10) చలివేంద్రముల/నీటి తొట్టిల నిర్వహణ, 11) విద్యుత్ పనుల నిమిత్తం గమ్ బూట్స్, టార్చ్ లైట్, 12) నర్సరీ నిర్వహణ, 13) విద్యుత్, సివిల్, మెకానికల్ పరికరములకు సంబంధించిన ఆక్సెసరీస్ సరఫా చేయుట, 14) బ్లౌజులు, మాస్కులు, ఆప్రాన్లు కొనుగోలు, 15) వివిధ కార్యక్రమముల కొరకు ఫ్లెక్సి బ్యానర్లు చేయించుట, 16) కార్యాలయ నిర్వహణ జిరాక్స్, 17) టీ స్నాక్స్ ఇతర రిఫ్రెష్‌మెంట్స్ సరఫరా, 18) మంచినీటి క్యాన్లు, వాటర్ బాటిల్స్ సరఫరా, 19) ఇంటర్‌నెట్ సరఫరా, 20) దిన పత్రికల సరఫరా, 21) వివిధ కార్యక్రమములు ఫ్లెక్సి బ్యానర్లు చేయించుట, వాల్ పెయింటింగ్స్ మొదలగు Non-SSR Items యొక్క ధరలు ఏజెన్సీలు / కాంట్రాక్టర్ల నుండి కొటేషన్లు కోరనైనది. కొటేషన్లు తేది: 01.04.2026 నుండి 03.04.2026 వరకు కార్యాలయము యందు సమర్పించగలరు. పూర్తి వివరముల కొరకు మున్సిపల్ ఇంజనీర్ : 9581853956 ను సంప్రదించగలరు.

సం/- కమీషనర్
భువనగిరి మున్సిపాలిటి.

DIPR R.O. No. : 17869-PP/CL/ADVT/1/2025-26, Date: 31-03-2026



## మహాలక్ష్మీ పథకం విజయవంతం

### ఉచిత బస్సు ప్రయాణం ద్వారా రూ.వెయ్యికోట్లు ఆదా : ఎమ్మెల్యే బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ :** ప్రజా పాలన ప్రగతి పథం అనే నినాదంతో ప్రారంభించిన మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించి వెయ్యి కోట్ల రూపాయల ప్రయాణ ఛార్జీలు ఆదా చేసుకున్న సందర్భంగా మంగళవారం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ దేవరకొండ డిపో ఆధ్వర్యంలో బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిధిగా హాజరయిన ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వారం రోజుల్లోనే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈపథకం ద్వారా మహిళలు ఆర్థిక భారం లేకుండా స్వేచ్ఛగా ప్రయాణిస్తూ, తమ దైనందిన అవసరాలను సులభంగా నిర్వహించుకుంటున్నారని పేర్కొన్నారు. ఇకపై కూడా ప్రజల సంక్షేమానికి కట్టుబడి ప్రభుత్వం అనేక పథకాలను అమలుచేస్తుందని, ప్రతి మహిళ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకొని ఆర్థికంగా ప్రయోజనం పొందిన మహిళలను ఆయన శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటి చైర్మన్ జమున మాధవరెడ్డి, ఆర్ఎం నల్గొండ బీంరెడ్డి, డిఎం విజయ కుమారి, వార్డు కౌన్సిలర్ గాజుల సావిత్రి, ఆర్టీసి సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

## ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించాలి

### రాష్ట్ర క్వాలిటీ ఆడిట్ అధికారి ఫయాజ్



**ప్రజాపక్షం/నకిరేకల్ :** అత్యవసర సమయాల్లో ప్రజల ప్రాణాలను కాపాడే 108 అంబులెన్స్ సేవలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండి భరోసా కల్పించాలని రాష్ట్ర క్వాలిటీ ఆడిట్ అధికారి ఫయాజ్ అన్నారు. మంగళవారం శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న 108 అంబులెన్స్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా అంబులెన్స్‌లో ఉన్న వైద్య పరికరాల పనితీరు, ఆక్సిజన్ సిలిండర్లు, ఔషధ నిల్వలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో ఆలస్యం లేకుండా స్పందించేలా అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా ఎప్పటికప్పుడు పరికరాలను తనిఖీ చేస్తూ ఉండాలని తెలిపారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, ప్రజలకు 108 సేవలు ఎల్లవేళలా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంఈటీ రమేష్, హేమంత్, పైలట్ యాదగిరి, సమీర్ బాబా పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌పి ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/చింతపల్లి :** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది పని తీరు, స్టేషన్ పరిధిలోని పరిస్థితులు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. అదేవిధంగా సమోదైన కేసుల గురించి విరాలు, స్టేషన్ రికార్డులను సమగ్రంగా తనిఖీ చేశారు. కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు ఎటువంటి అలసత్వం వహించరాదని ఎస్పీ హెచ్చరించారు. పెట్రోలింగ్ సమయంలో స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను ప్రతిరోజూ తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎస్పీ వెంట దేవరకొండ డిఎస్పీ శ్రీనివాస్‌రావు నాంపల్లి సీఐ రాజు ఉన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ రామ్మూర్తి, సిబ్బంది ఉన్నారు.

## దుర్భాషలాడిన ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/నల్లగొండ(దామరచర్ల):** దామరచర్ల బీసీ మహిళా గురుకుల పాఠశాలలో విద్యార్థినులు ఆకలి వేస్తోంది మేడం అని చెప్పినందుకు వారిపై అమానుషంగా దుర్భాషలాడటం ఘోరమైన చర్య అని సిపిఐ దామరచర్ల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో విద్యార్థినులు ఆకలితో బాధపడుతూ ఆహారం కోరగా, వారికి కనికరం చూపాల్సిన ఉపాధ్యాయురాలు దుర్భాషలాడి, మోకాళ్లపై నిలబెట్టడం నియంతృత్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. గత 20 రోజులుగా విద్యార్థులకు అందాల్సిన గుడ్లు, చికెన్, పండ్లు వంటి పోషకాహారం సరైన విధంగా అందకపోవడంపై ప్రశ్నించినందుకు ఇలా ప్రవర్తించడం శోచనీయమని పేర్కొన్నారు. తక్షణమే సంబంధిత ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేసి, ఘటనపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అలాగే మెనూ ప్రకారం విద్యార్థులకు అందాల్సిన ఆహారం వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## కష్టపడి చదవి ఎదగాలి



**ప్రజాపక్షం/హాలియా:** జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలంటే కష్టపడి చదివి ఎదగాలని జిల్లా విద్యాధికారి బిక్షపతి అన్నారు. మంగళవారం హాలియాలోని బీసీ, ఎస్సీ బాలికల వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఇఓ బిక్షపతి మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రతను పాటించడంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని కష్టపడి చదవాలన్నారు. ప్రస్తుత రోజుల్లో చదువుకు ఎంతో ప్రాముఖ్యత ఉందని దానిని గుర్తించి బాలికలు చదువుకొని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. వసతి గృహాల నిర్వహణ పట్ల డిఇఓ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల విద్యాధికారి సీనయ్య ఉన్నారు.

## ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలి




డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్

**ప్రజాపక్షం/మోత్కూర్ :** దేశంలో ఉపాధి అవకాశాల స్వరూపం మారుతున్న ఈ సమయంలో ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల అమలు అత్యవసరమని డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగం క్రమంగా క్షీణిస్తుండగా, ప్రైవేట్ రంగం విస్తరిస్తున్న పరిస్థితుల్లో దళితులు, వెనుకబడిన వర్గాలకు తగిన అవకాశాలు దక్కకపోవడం సామాజిక న్యాయానికి విరుద్ధమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) యాదాద్రి భువనగిరి జిల్లా 2వ జిల్లా మహా సభలు మంగళవారం నాడు మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో సిపిఐ కార్యాలయం (కెఆర్) భవనంలో జరిగిన మహాసభకు కాసపాక దయాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథి తెలంగాణదళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ హాజరై మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, సమాన అవకాశాలు కల్పించాలని స్పష్టంగా చెబుతున్నప్పటికీ, ప్రైవేట్ రంగంలో ఈ సూత్రాలు అమలుకావడం లేదని ఆయన విమర్శించారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రైవేట్ రంగం దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన పాత్ర పోషిస్తోంది. కానీ అక్కడ రిజర్వేషన్లు లేకపోవడం వల్ల దళిత యువత ఉపాధి అవకాశాల నుండి దూరమవుతున్నారు. ఇది కేవలం ఉపాధి సమస్య కాదు ఇది సమానత్వం, గౌరవం, హక్కుల సమస్య అని స్పష్టం చేశారు. ప్రైవేట్ కంపెనీల్లో నియామకాల్లో పారదర్శకత ఉండేలా చట్టపరమైన మార్పులు తీసుకురావాలని, ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందే కంపెనీలకు రిజర్వేషన్ విధానం తప్పనిసరి చేయాలని ఆయన సూచించారు. అలాగే ప్రైవేట్ రంగంలో కుల వివక్షను అరికట్టేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, అమలును పర్యవేక్షించేందుకు స్వతంత్ర కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర రెండవ మహా సభలు ఏప్రిల్ 17,18 వరంగల్ జిల్లాలో జరుగనుంది. ఈ మహాసభలకు 33 జిల్లా నుండి 500 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. అని ఆయన చెప్పారు. ఈ సమావేశానికి సీపీఐ జిల్లా యనాల దామోదర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు బొలగని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి సలిగంజి వీరస్వామి, నాయకులు ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శాంతికుమార్, ఇంజ హేమలత, కిష్టమ్మా ,జిట్టా రాములు, న్యాతకాని కిష్టమ్మా, భాగ్యమ్మ, కట్ల యాదగిరి, చెడే సుందర్, బాల నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.



## పండరినాద్‌కు ఘన సన్మానం

### క్రమశిక్షణతో విధులు నిర్వహించి సహచరులకు ఆదర్శం : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ ఆర్‌టిసి డిపో కంట్రోలర్‌గా పనిచేసి పదవి విరమణ పొందిన జంపాల పండరినాద్ ఎల్లమ్మలకు సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం శాలువా కప్పి, పూలమాల వేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఆర్‌టిసిలో దీర్ఘకాలం నిబద్ధతతో సేవలందించిన పండరినాద్ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఉద్యోగ జీవితమంతా క్రమశిక్షణతో విధులు నిర్వహించి, సహచరులకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఆయన భవిష్యత్ జీవితం సుఖశాంతులతో నిండాలని ఆకాంక్షిస్తూ, రాబోయే రోజులలో ప్రజా ఉద్యమాల్లో కూడా భాగస్వామ్యం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.వెంకటేశ్వర్లు, గురిజ రామచంద్రం, ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎన్‌ఆర్‌సి రాజు, బి.వెంకటయ్య, ప్రముఖ న్యాయవాది గుర్రం వెంకట్ రెడ్డి, కస్తాల వెంకన్న, జిల్లా యాదయ్యతో పాటు పలువురు ఆర్‌టిసి సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## వివాదాస్పద భూమిపై ఆర్‌డిఓ విచారణ

**ప్రజాపక్షం/మర్రిగూడ :** మర్రిగూడ సమీపంలోని సర్వే నంబర్ 5లో భూమి వివాదం నెలకొనడంతో మంగళవారం చండూరు ఆర్‌డిఓ శ్రీదేవి, తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్ క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించారు. ఇరువర్గాల సమక్షంలో భూమిని పరిశీలించిన అధికారులు, ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నందున ప్లాట్ బుక్ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కేవలం ఖాళీ వ్యవసాయ భూములకే ప్లాట్ బుక్‌కు అర్హత ఉంటుందని, డివిజన్ సర్వేయర్‌తో సర్వే అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని ఆర్డీవో పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇళ్ల స్థలాల యజమానులు, స్థానికులు విచారణలో పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

### జిల్లా ఎస్‌పి కె.నరసింహ



**ప్రజాపక్షం/సూర్యాపేట :** మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని, వారిని జైలుకు పంపడంతోపాటు వాహనాలు కూడా సీజ్ చేస్తామని, ఏప్రిల్ 1వ తేదీ నుండి నిబంధనలు పటిష్టంగా అమలు చేస్తామని జిల్లా ఎస్‌పి కె.నరసింహ తెలిపారు. అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద స్థానిక ప్రజలకు, ఆటో డ్రైవర్లకు, టాక్సీ డ్రైవర్లకు సూర్యాపేట పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి నియమాలు పాటిస్తూ ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ ప్రతి ప్రయాణం సురక్షితంగా గమ్యం చేరాలన్నారు. డ్రైవర్ బాధ్యతగా ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చాలని సూచించారు. వాహనాలు నడుపుతున్న సమయంలో రోడ్డుపై ఉన్న పరిస్థితులను అంచనా వేస్తూ, కాలినడకన వెళ్లు వారిని గమనిస్తూ ముందుకు సాగాలన్నారు. టాక్సీ, ఆటో డ్రైవర్లు యూనిఫామ్ ధరించాలని, వాహనానికి సంబంధించి అన్ని అనుమతి పత్రాలు కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని, డ్రైవర్ పక్కన ప్రయాణికులను కూర్చోబెట్టి రవాణా చేయకూడదని తెలిపారు. డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే రోడ్డుపై ఉన్న పరిస్థితులను అంచనా వేయలేక ప్రమాదాల బారినపడతారని అన్నారు. ద్విచక్రవాహనంపై ప్రయాణించేవారు హెల్మెట్ తప్పకుండా ధరించాలని కోరారు. కార్లు పెద్ద వాహనాల్లో ప్రయాణం చేసే సమయంలో సీట్‌బెల్ట్ పెట్టుకోవడం సురక్షితం, నిదానంగా వాహనాలను నడుపుతూ ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యం చేరాలని సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకట్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, పట్టణ ఎస్ఐలు ఏడుకొండలు,ఐలయ్య,పౌరులు, ఆటో, ట్యాక్సీడ్రైవర్లు పాల్గొన్నారు.

## నానో ఎరువుల ద్వారా సుస్థిర వ్యవసాయం వైపు ప్రోత్సహించాలి

### జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్




**ప్రజాపక్షం/తిప్పర్తి :** నానో ఎరువుల ద్వారా సుస్థిర వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ వ్యవసాయ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన తిప్పర్తి మండలం,దుప్పలపల్లి రైతు వేదికలో వ్యవసాయ అధికారులకుద్దేశించి నానో ఎరువుల వినియోగం ద్వారా సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించడంపై నిర్వహించిన సాంకేతిక ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని, డ్రోన్ సాంకేతికత ద్వారా నానో యూరియాను సమర్థవంతంగా ఉపయోగించి పంట దిగుబడులను పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు సన్నరకం వరి పండించేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. వానకాలం సీజన్‌లో వ్యవసాయ యంత్రాల వినియోగాన్ని పెంచేందుకు ముందుగానే ప్రణాళిక రూపొందించాలని సూచించారు. పంట మార్పిడి పద్ధతులను రైతులకు వివరించి వేరుశనగ, పెసలు మినుములు వంటి పంటలను ప్రోత్సహించాలని చెప్పారు. జిల్లాకు కేటాయించిన సుమారు 10 వేల సాయిల్ హెల్త్ కార్డులు త్వరితగతిన రైతులకు అందజేయాలని, భూమి ఆరోగ్యాన్ని మెరుగుపరచే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, జిల్లా ఉద్యాన శాఖ డిడి సుభాషిణి, తిప్పర్తి మండల ఏఈఓ సన్నీ రాజ్, వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## బెస్ట్ లీడర్ సుమతమ్మకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/నాంపల్లి :** అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(ఏఐటీయుసి)రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎడమ సుమతమ్మ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏఐటీయూసీ బెస్ట్ లీడర్ అవార్డు అందుకున్న సందర్భంగా మంగళవారం మండలంలోని సుంకిశాల గ్రామ సెక్టార్‌లో అంగన్వాడి కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్లు,హెల్పర్లు కలిసి సుమతమ్మకు శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అలాగే జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని తిరుమలగిరిగ్రామానికి చెందిన ప్రసన్నలతను బెస్ట్ అంగన్‌వాడీ టీచర్‌గా సత్కరించారు. సుమతమ్మ మాట్లాడుతూ అంగన్వాడి టీచర్స్, హెల్పర్స్ సమస్యల పరిష్కారానికి తాను చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డు అందించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అవార్డు ప్రదానం చేసిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

## సాగర్‌ను సందర్శించిన కేంద్ర అధికారుల బృందం




**ప్రజాపక్షం/నందికొండ :** అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి చెందిన నాగార్జునసాగర్‌ను మంగళవారం కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం సందర్శించింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్రటేరియట్ ట్రైనింగ్ అండ్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ అమర్జిత్ సింగ్ ఆధ్వర్యంలో సుమారు 70 మంది అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు ఈ పర్యటనలో పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో వారం రోజులుగా శిక్షణ పొందుతున్న ఈ బృందం 'భారత్ దర్శన్' కార్యక్రమంలో భాగంగా నాగార్జునసాగర్‌కు చేరుకుంది. వీరికి ప్రోటోకాల్ ఆర్ఐ దండ శ్రీనివాస్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం టూరిజం లాంచ్‌లో నాగార్జునకొండ మ్యూజియం, నాగార్జునసాగర్ డ్యామ్‌ను సందర్శించారు. తరువాత బుద్ధవనంలోని బుద్ధ చరితవనం, జాతకవనం, ధ్యానవనం, స్తూపవనాలను దర్శించి, మహాస్తూపం సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలను ప్రతిబింబించే లఘు చిత్రాన్ని వీక్షించారు.ఈ సందర్భంగా బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, శాసన ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర బౌద్ధ ధర్మంపై సమగ్రంగా వివరించారు. అనంతరం మహాస్తూపం ధ్యాన మందిరంలో అధికారులు ధ్యానం నిర్వహించారు. ఈ పర్యటనలో స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ నాగార్జునకొండ, నాగార్జునసాగర్ డ్యామ్, బుద్ధవనం చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని వివరించారు.

## హుజూర్‌నగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి

### జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** నూతన పాలకవర్గం హుజూర్‌నగర్ మున్సిపాలిటిని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని, మున్సిపాలిటి అభివృద్ధికి సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ కోరారు. హుజూర్‌నగర్ మున్సిపల్ బడ్జెట్ 2026–27 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్‌పై మంగళవారం హుజూర్‌నగర్ మున్సిపాలిటిలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ నిధులను సక్రమంగా వినియోగించి సత్ఫలితాలు రాబట్టాలని కోరారు. మున్సిపాలిటి 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.33 కోట్లతో బడ్జెట్ రూపొందిచడం జరిగిందని వివరించారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటిని దశల వారిగా అభివృద్ధి చేసుకునేందుకు పాలకవర్గం కృషి చేయాలన్నారు. వార్డులలో ఉన్నసమస్యలను ప్రణాళికబద్దంగా పరిష్కరించేందుకు యాక్షన్‌ప్లాన్ తయారు చేసుకుని ముందుకు పోవాలని సూచించారు. ప్రాధాన్యత అంశాలైన తాగునీరు, పారిశుద్ధ్యం, రోడ్లకు సంబంధించిన పనుల కోసం ప్రత్యేక గ్రాంట్ల నిధులను వినియోగించుకుని పూర్తి చేయాలని తెలిపారు. రానున్న వేసవికాలంలో దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆర్డీవోకు సూచించారు. వార్డులలో ముఖ్యమైన ప్రదేశాలలో వీధిలైట్లు ఏర్పాటు చేస్తే మహిళ భద్రత కల్పించడం జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల కార్యక్రమాన్ని మున్సిపాలిటిలో సమర్ధవంతంగా నిర్వహించాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వార్డుల్లో పర్యటించి కాలనీల్లో చెత్త తొలగింపు, డ్రైనేజీ శుభ్రపర్చడం, రోడ్లను శుభ్రం చేయడం వంటి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా అందంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లిఖార్జున్‌రావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసిల్దార్ కవిత, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత బస్సు పథకం బలమైన అడుగు




జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మహిళల ఆర్థిక,సామాజిక భద్రతతో పాటు స్వావలంబనకు ఉచిత బస్సు పథకం బలమైన అడుగని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం నల్లగొండ ఆర్‌టిసి బస్టాండ్‌లో మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం ద్వారా రూ.10వేల కోట్ల ఆదా సాధించిన సందర్భంగా మహిళలను సన్మానించే కార్యక్రమం నిర్వహించగా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అమలవుతున్న ఉచిత బస్సు పథకం ద్వారా మహిళలకు గణనీయమైన ఆర్థిక లాభం కలుగుతోందన్నారు. 2023 డిసెంబర్‌లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించగా, మహిళలు మరియు విద్యార్థులు కలిసి దాదాపు రూ.10 వేల కోట్ల మేర ఆదా చేసుకున్నారని తెలిపారు. జిల్లాస్థాయిలోనే సుమారు రూ.340 కోట్ల వరకు ఆదా కావడం విశేషమన్నారు. మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం వల్ల మహిళలు నెలకు సగటున రూ.5,000 వరకు ఆదా చేసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ జాన్‌రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్‌రెడ్డి, జిల్లా మహిళా సంక్షేమ అధికారి కృష్ణవేణి, సీడీపీఓ హరిత, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డిపో మేనేజర్ రమణ హుస్సేన్ పాల్గొన్నారు.

**ఎస్‌సి, ఎస్‌టి సమస్యల పరిష్కారానికి సమర్థవంతంగా పనిచేయాలి**

షెడ్యూల్డ్ కులాలు, తెగల సమస్యల పరిష్కారానికి ఎస్‌సి, ఎస్‌టి జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమర్ధంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులు, అంటరానితనం నివారణకు చట్టాలు ఉన్నాయని, వాటి అమలులో సభ్యులు చురుకుగా వ్యవహరించాలని అన్నారు. జిల్లాలో జరిగిన అకృత్యాల కేసులను సమీక్షించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలపై దాడుల కేసులను వెంటనే నమోదు చేసి 60 రోజుల్లో విచారణ పూర్తి చేస్తున్నామని చెప్పారు. వివక్షత, దేవాలయ ప్రవేశం నిరాకరణ వంటి అంశాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఇండ్ల స్థలాలను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాలలో నిర్మిస్తున్న2160 ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ కాలనీని త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్ ఇందిరమ్మ కాలనీని, అంతర్గత రోడ్లు, సభా స్థలిని, మొక్కలు నాటడం, హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించి, మిగిలిపోయిన పనులను తర్వితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను అదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రీయ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అర్హత లేనివారికి ఈ జాబితాలో పేరు ఉండకూడదని స్పష్టం చేశారు. అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి, సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావులేకుండా ఈ ప్రక్రీయ చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, హౌసింగ్ పిడి సిద్దార్ధ, మిషన్ భగీరథ కరుణాకర్‌రెడ్డి, తహసిల్దార్ కవిత, ఇతర జిల్లా శాఖలు అధికారులు పాల్గొన్నారు.

# మోదీ స్మార్ట్ సిటీ మిషన్ విఫలం

## రాహుల్ గాంధీ విమర్శ




**కన్నూరు:** ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేరళలోని కన్నూరులో మంగళవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ సిసిఎం ఏమాత్రం వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్‌వింగ్ పార్టీ అని చెప్పుకొచ్చారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఆ పార్టీ నేతలు బిజెపితో జత కట్టారని ఆరోపించారు. అందువల్లే కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ విజయం సాధించాలని ప్రధాని కోరుకుంటున్నారని అన్నారు. ఇతరచోట్ల మతం, దేవుడి గురించి మాట్లాడే మోదీ కేరళలో మాత్రం ఆ విషయాలు ప్రస్తావించడం లేదన్నారు. శబరిమల ఆలయంలో జరిగిన బంగారు తాపడాల కుంభకోణం గురించి ఇప్పటివరకు ఆయన ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. బంగారు తాపడాలు మాయమవడం వెనక సిసిఎం నేతల హస్తం ఉన్నందువల్లే ఈ విషయంలో బిజెపి మౌనంగా ఉందని రాహుల్ అన్నారు. బిజెపితో సిసిఎం జత కట్టడం ఆ పార్టీలోని కొందరు సీనియర్ నేతలకు నచ్చలేదని, అందువల్లే వారు యూడీఎఫ్ మద్దతుతో స్వతంత్రులుగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన స్మార్ట్ సిటీ మిషన్ వల్ల ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదని రాహుల్ అన్నారు. ఈ పథకం గురించి మోదీ నిత్యం గొప్పలు చెబుతుంటారని, కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయన్నారు. స్మార్ట్ సిటీలుగా కేంద్రం ఎంపిక చేసిన ఏ ఒక్క నగరాన్ని పూర్తిగా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. అక్కడి ప్రజలు కలుషిత నీరు, నిర్మాణ సమయంలోనే కుప్పకూలుతున్న బ్రిడ్జ్‌లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పౌరులకు ప్రాథమిక గౌరవం, స్వచ్ఛమైన నీరు, గాలి, భద్రత అందించడంలో ఆ నగరాలు విఫలమవుతుండడంతో అది ఓ అసంపూర్ణ పథకంగా మిగిలిపోయిందన్నారు.

### లోక్‌సభలో అమిత్‌షా తనకిష్టమైన తిట్టును వాడకుండానే...

# ఆవేశంగా వాగి అద్భుతం సృష్టించారు

## కాంగ్రెస్ ఎద్దేవా



**న్యూఢిల్లీ :** హోం మంత్రి అమిత్‌షాపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయి విమర్శల దాడికి దిగింది. లోక్‌సభలో హోం మంత్రి అమిత్‌షా 90 నిమిషాల (గంటన్నర) పాటు తనకు ఇష్టమైన తిట్టు పదాన్ని ఒక్కసారి కూడా వాడకుండా ఆవేశంగా వాగి విరుచుకుపడటం ద్వారా ఒక అద్భుతం సాధించారని మంగళవారం కాంగ్రెస్ ఘాటైన విమర్శలతో విరుచుకుపడింది. గత రెండు దశాబ్దాలుగా నక్సల్ వ్యతిరేక వ్యూహం, కార్యకలాపాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని ప్రతిపక్ష కాంగ్రెస్ నొక్కిచెప్పింది. అలాగే 2011 అక్టోబరులో జార్ఖండ్‌లోని దట్టమైన అటవీ ప్రాంతాలలో ప్రారంభించిన సరందా కార్యాచరణ ప్రణాళిక 'ఒక నిర్ణయాత్మక మలుపు' అని పేర్కొంది.మావోయిస్టుల అత్యున్నత సంస్థ, కేంద్ర వ్యవస్థను దాదాపు పూర్తిగా కూల్చివేయబడటంతో దేశం నక్సల్స్ నుంచి విముక్తి పొందిందని అమిత్‌షా ప్రకటించిన ఒక రోజు తర్వాత కాంగ్రెస్ ఈ ప్రకటనలు చేసింది. తీవ్రవాదులు సాగిస్తున్న సుదీర్ఘ హింసాకాండను అంతం చేయడానికి 'కాంగ్రెస్ ఏమీ చేయడంలేదు' అని కూడా అమిత్‌షా ఆరోపించారు. 'దేశాన్ని వామపక్ష తీవ్రవాదం (ఎల్‌డబ్ల్యుఇ) నుంచి విముక్తి చేసే ప్రయత్నాలు' అనే అంశంపై లోక్‌సభలో జరిగిన చర్చకు సమాధానమిస్తూ కాంగ్రెస్ నాయకుడైన రాహుల్‌గాంధీ సానుభూతిపరులైన నక్సల్స్‌తో బహిరంగంగా చాలాసార్లు కనిపించారని, అంతేకాకుండా తన మీడియా హ్యాండిల్ నుంచి మావోయిస్టుల పట్ల సానుభూతి చూపే అనేక వీడియోలను కూడా ఆయన పోస్ట్ చేశారని అమిత్‌షా ఆరోపించారు. అమిత్‌షాపై పరోక్షంగా విమర్శలు చేస్తూ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జి జైరాం రమేశ్ ఇలా అన్నారు. నిన్న లోక్‌సభలో హోం మంత్రి ఒక అద్భుతం చేశారని. గత సందర్భాలలో తొలగించిన తనకు ఇష్టమైన తిట్టు పదాన్ని ఒక్కసారి కూడా ఉపయోగించకుండా, ఆయన 90 నిమిషాలపాటు ఆవేశంగా, తీవ్రంగా మాట్లాడారని ఈ నెల ప్రారంభంలో అమిత్‌షాపై విమర్శలు చేస్తూ జైరాం రమేశ్ చేసిన పోస్ట్‌కు 'X' అని ట్యాగ్‌చేసి, లోక్‌సభలో తాను మళ్లీ ఉచ్చరించడానికి ఇష్టపడే పదాలలో ఒకదానిని తొలగించారని కూడా ఆయన పేర్కొన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను తొలగించాలన్న ప్రతిపక్షాల ప్రతిపాదన దిగువసభలో జరిగిన వాడీవేడి చర్చ తర్వాత ఓడిపోవడంతో అమిత్‌షాపై ఆ విమర్శ వచ్చింది. ఆ చర్చకు స్పందిస్తూ సభలో తనను మాట్లాడటానికి తనను అనుమతించడం లేదన్న రాహుల్‌గాంధీ వాదనను అమిత్‌షా అప్పట్లో కొట్టిపారేశారు. ఆ కాంగ్రెస్ నాయకుడు మాట్లాడటానికి ఇష్టపడనందున సమావేశాలు, చర్చల సమయంలో ఉద్దేశపూర్వకంగానే ఆయన తరచూ బయట ఉండేవారని ఆయన అన్నారు. తీర్మానంపై రెండు రోజులపాటు జరిగిన చర్చలో హోం మంత్రి తన ప్రసంగాన్ని ముగిస్తున్న సమయంలో సభ్యులు సభ మధ్యలోకి దూసుకెళ్లి నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. అమిత్‌షా చేసిన కొన్ని వ్యాఖ్యలు 'అభ్యంతరకరమైనవి' అని పేర్కొంటూ వాటికి వారు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నక్సల్ హింస నిర్మూలనకు ప్రకటించిన గడువుకు ఒక రోజు ముందు ఈ చర్చ జరిగింది. గత సంవత్సరం 2026 మార్చి 31నాటికి దేశంలో ఎల్‌డబ్ల్యు అంతం అవుతుందని నక్సల్స్‌కు వ్యతిరేకంగా ఒక భారీ ఆపరేషన్ నిర్వహించబడుతుందని అమిత్ షా ప్రకటించారు. మోదీ ప్రభుత్వపు అతిపెద్ద విజయం 'నక్సల్స్‌రహిత భారతదేశం' అని, ఈ విషయాన్ని ఏ పరిశోధకుడైనాసరే అంగీకరించాల్సిందేనని అమిత్‌షా అన్నారు. 'అక్టోబరు 2011లో జార్ఖండ్‌లోని దట్టమైన అటవీ ప్రాంతాలలో ప్రారంభించబడిన సరందా కార్యచరణ ప్రణాళిక ఒక పరివర్తనాత్మకమైన చొరవి, ఇది ఇతర ప్రాంతాలలో కూడా అనుసరించబడిన ఒక నమూనాగా నిలిచింది. అది ఒక నిర్ణయాత్మక మలుపు' అని జైరాం రమేశ్ 2011 అక్టోబరులో అప్పటి జార్ఖండ్ ముఖ్యమంత్రి అర్జున్ ముండాకు రాసిన లేఖలో కూడా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.

# బిహార్ గుడిలో తొక్కిసలాట

## 8 మంది భక్తులు మృతి



**పాట్నా:** బిహార్‌లోని నలందలో ఘోర విషాదం జరిగింది. శీతలా మాత ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 8 మంది మహిళలు మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం జరిగిన ఈ ఘటనలో భారీగా భక్తులు ఒక్కసారిగా గుమిగూడటంతో తీవ్ర రద్దీ ఏర్పడి, ఆందోళనలో ఒకరిపై ఒకరు పడిపోవడంతో ప్రమాదం సంభవించినట్లుగా తెలుస్తోంది.

**అధిక రద్దీ కారణంగా ప్రమాదం**

నలంద జిల్లాలోని మాఘ్రా గ్రామంలోని శీతలామాత ఆలయానికి ప్రతి మంగళవారం భక్తులు వస్తుంటారు. అయితే ఈసారి మహావీర జయంతి, చైత్ర మాసం చివరి మంగళవారం కావడంతో ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. ఉదయం 9 గంటల నుంచి భక్తుల రాక పెరుగుతూ వచ్చింది. ఉదయం సుమారు 10:30 గంటల సమయంలో ఒక్కసారిగా రద్దీ పెరగడంతో భక్తులు ఒకరిపై ఒకరు పడిపోవడంతో తొక్కిసలాట జరిగింది. ఘటన సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, స్థానిక గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

**ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన మోదీ,సిఎం**

ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం ప్రకటించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ కూడా సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.6లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. మరోవైపు ఈ ప్రమాదంపై ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ, ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందిస్తుందని చెప్పారు. గాయపడిన వారికి సరైన చికిత్స కోసం ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# బెంగాల్‌లో ఓటర్లకు ముప్పు

**• సర్ పేరుతో నిజమైన ఓటర్లను తొలగించే ప్రమాదం • ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు మూడు పేజీల లేఖ రాసిన మమత బెనర్జీ**

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ముందు రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎన్నికల కమిషన్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. సర్ ప్రక్రియ పేరుతో నిజమైన ఓటర్లను జాబితా నుంచి తొలగించే ప్రమాదం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు మూడు పేజీల లేఖ రాసిన మమత, ఇసి తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల ప్రజాస్వామ్య, రాజ్యాంగ హక్కులను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు. 'ఒక రాజ్యాంగ సంస్థ నుంచి ఆశించే ప్రమాణాలు ఇవి కావు' అని ఆమె లేఖలో స్పష్టం చేశారు. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు నిర్వహించడం ఇసి బాధ్యత అని గుర్తు చేశారు. ఇక బంగాల్‌లో ఎన్నికలు రెండు దశల్లో జరగనున్నాయి. ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ జరుగగా, మే 4న ఫలితాలు వెల్లడించనున్నారు. ఇదే సమయంలో, బిజెపిపై కూడా మమతా ఘాటు విమర్శలు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ ఓటర్లను బెంగాల్ ఓటర్ల జాబితాలో చేర్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. బిహార్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఓటర్లను తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు.

**బిజెపికి బెంగాల్ ప్రజలపై గౌరవం లేదు!**

పశ్చిమ మేదినిపూర్ జిల్లా చంద్రకోణాలో జరిగిన ఎన్నికల సభలో మాట్లాడిన మమతా, ఒక్క రోజులోనే సుమారు 30 వేల కొత్త ఓటర్ల నమోదు ఫారాలు సమర్పించారని తెలిపారు. దీనిపై సమాచారం అందడంతో అభిషేక్ బెనర్జీ తన ప్రచారాన్ని మధ్యలో వదిలి ఇసి కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చిందని చెప్పారు. బిజెపికి బెంగాల్ ప్రజలపై గౌరవం లేదని, ఎన్నికల్లో గెలవడానికి ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉందని మమతా విమర్శించారు. సర్ ప్రక్రియ పేరుతో మహిళలు, మైనారిటీల పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు.

**నాన్ వెజ్‌పై నిషేధం విధించే ప్రమాదం**

బిజెపి, ఇసి కలిసి ప్రజల పౌరసత్వం, రాజ్యాంగ హక్కులను లాక్కుంటున్నాయి. దీనికి వ్యతిరేకంగా మేము చివరి వరకు పోరాడుతాం' అని మమత స్పష్టం చేశారు. అలాగే, బిజెపి అధికారంలోకి వస్తే బెంగాల్ ప్రజల ఆహారపు అలవాట్లపై కూడా నియంత్రణలు విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రత్యేకంగా నాన్‌వెజ్ ఆహారంపై నిషేధం విధించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్‌సి అమలు చేయాలని చూస్తోందని, అయితే తమ ప్రభుత్వం ఉన్నంత కాలం బెంగాల్‌లో ఎన్ఆర్‌సికి అనుమతి ఇవ్వబోమని మమత తేల్చి చెప్పారు. డిటెన్షన్ క్యాంపుల ఏర్పాటుకు కూడా తాము వ్యతిరేకమని తెలిపారు. ఇంకా బ్యాంకురా, బిష్ణుపూర్, గర్బేటా ప్రాంతాల్లో జరిగిన సభల్లో మమతా బిజెపిపై తీవ్ర విమర్శలు చేశారు. లక్షలాది నిజమైన ఓటర్ల పేర్లు తొలగించారని, అల్లర్లకు ప్రోత్సాహం ఇచ్చారని, రాష్ట్రానికి రావాల్సిన నిధులను అడ్డుకున్నారని ఆరోపించారు.

**బెంగాలీ మాట్లాడే వలస కార్మికులను వేధిస్తోందంటూ!**

బిజెపి ఒక బార్బరిక్ పార్టీ అని, బెంగాలీ మాట్లాడే వలస కార్మికులను వేధిస్తోందని మమతా విమర్శించారు. బెంగాల్ యువత ప్రతిభ, సంస్కృతి, విజయాలపై బిజెపికి అసూయ ఉందని వ్యాఖ్యానించారు. తనను కొనుగోలు చేయలేరనే కారణంతోనే బిజెపి నాయకులు తనను ద్వేషిస్తున్నారని కూడా మమతా పేర్కొన్నారు. ఇక ఈ ఎన్నికల్లో



తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థులెవరో పట్టించుకోకుండా, తానే అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థినిగా భావించి ఓటు వేయాలని ప్రజలను కోరారు. మరోవైపు, బిజెపి నకిలీ ఓటర్ల నమోదు చేసిందంటూ టీఎంసీ ఆరోపించిన నేపథ్యంలో విచారణ జరుపుతామని బంగాల్ ప్రధాన ఎన్నికల అధికారి మనోజ్ కుమార్ అగర్వాల్ తెలిపారు. తన కార్యాలయంలోని సిసిటివి ఫుటేజీని సమీక్షిస్తానని హామీ ఇచ్చారు. ఓటర్ల జాబితాలో తొలిసారి ఓటు వేసేవారిని చేర్చడానికి లేదా ఒక నియోజకవర్గం నుంచి మరొక నియోజకవర్గానికి ఓటరును మార్చడానికి ఫారం 6 నింపుతారు. సుప్రీంకోర్టు ఆదేశాలను స్పష్టంగా ఉల్లంఘిస్తూ, బిజెపి కొద్ది గంటల్లోనే సుమారు 30,000 ఫారం 6 లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) కార్యాలయానికి సమర్పించిందని టిఎంసి నాయకుడు అభిషేక్ బెనర్జీ ఆరోపించారు. సోమవారం సిఇఒతో సమావేశమైన అనంతరం అభిషేక్ బెనర్జీ మాట్లాడుతూ 'సుప్రీంకోర్టు ఆదేశాలను స్పష్టంగా ఉల్లంఘిస్తూ, ఆరు నుంచి ఏడు గంటల్లోనే సుమారు 30,000 ఫారం 6లు సిఇఒ కార్యాలయానికి వచ్చాయని మాకు విశ్వసనీయ సమాచారం ఉంది' అని అన్నారు. సిఇఒ సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వలేకపోయారని, టిఎంసి దీనిని చూస్తూ ఊరుకోదని ఆయన పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై స్పందిస్తూ, ఎన్నికల సంఘం ఫిర్యాదులను తీవ్రంగా పరిగణిస్తోందని, విచారణ జరుపుతామని మనోజ్ కుమార్ అగర్వాల్ అన్నారు.

### నలంద విశ్వవిద్యాలయం బౌద్ధ అధ్యయనాలకు...

# ప్రపంచంలోనే ఒక ప్రముఖ కేంద్రంగా ఆవిర్భవించాలి

**• రాష్ట్రపతి ముర్ము ఆశాభావం • స్నాతకోత్సవంలో 36మంది విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం**

**రాజ్‌గిర్ (బిహార్) :** నలంద విశ్వవిద్యాలయం పునరుద్ధరణ అనేది దాని ఘనమైన వారసత్వాన్ని ఆధునిక వాతావరణంలో పున: స్థాపించడానికి జాతీయ, అంతర్జాతీయ నిబద్ధతకు ప్రతీక అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్ఘాటించారు. మంగళవారం ఇక్కడ యూనివర్సిటీ స్నాతకోత్సవం కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ప్రాచీన నలంద విశ్వవిద్యాలయం సుమారు 8 శతాబ్దాలపాటు గొప్ప జ్ఞాన కేంద్రంగా నిలదొక్కుకుందన్నారు. దాని పతనం భారతదేశానికే కాకుండా యావత్ ప్రపంచానికే తీరని నష్టమని రాష్ట్రపతి పేర్కొన్నారు. 'దీని పునరుద్ధరణ అనేది యూనివర్సిటీ యొక్క ఘనమైన వాతావరణాన్ని ఆధునిక వాతావరణంలో పున: స్థాపించడానికి జాతీయ, అంతర్జాతీయ నిబద్ధతకు ఒక ప్రతీక' అని ద్రౌపది ముర్ము అన్నారు. ప్రపంచం అనేక సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో కరుణ, స్వాతంత్ర్యం, విమర్శనాత్మక ఆలోచనల అవసరం గతంలో కంటే ఎక్కువగా ఉన్నందున నలంద విశ్వవిద్యాలయం ఒక ప్రముఖ ప్రపంచ విద్యా సంస్థగా ఆవిర్భవిస్తుందని రాష్ట్రపతి విశ్వాసం వ్యక్తం చేశారు. అదే సమయంలో దాని పురోగతి వల్ల కలిగే ప్రయోజనాలు అది స్థాపించబడిన సమాజానికి కూడా చేరాలని ఆమె నొక్కిచెప్పారు. సాంప్రదాయ జ్ఞాన వ్యవస్థలతో అనుసంధానం కావడానికి విశ్వవిద్యాలయం చేపట్టిన సామాజిక కార్యక్రమాలను రాష్ట్రపతి అభినందించారు. పట్టభద్రులకు డిగ్రీలు ప్రదానం చేస్తూ ఈ సంస్థ విద్యార్థులు మానవాళి యొక్క ఉమ్మడి వారసత్వాన్ని పొందుతున్నారని ఇక్కడ నుండి పట్టభద్రులయ్యే విద్యార్థులు రెండు విషయాలను పొందుతారని అవి ఒకటి డిగ్రీ, రెండవది వారసత్వం అన్నారు. డిగ్రీ వారి వ్యక్తిగత విజయం అయితే మానవత్వ వారసత్వం అందరూ పంచుకునేది అని ద్రౌపది ముర్ము తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి నలంద విశ్వవిద్యాలయానికి చెందిన 36మంది విద్యార్థులకు బంగారు పతకాలను కూడా ప్రదానం చేశారు. ఈ సంవత్సరం పట్టభద్రులైన విద్యార్థులలో సగానికి పైగా30కి పై దేశాలకు చెందిన విద్యార్థులు ఉన్నారని రాష్ట్రపతి ముర్ము సంతోషం వ్యక్తంచేశారు. జ్ఞానం శాశ్వతంగా నిలుస్తుందని, సంభాషణ విజయం సాధిస్తుందని, అభ్యసనం కొనసాగుతుందని ఇచ్చిన వాగ్దానాన్ని ఆ విద్య మానవత్వపు సేవ చేస్తూనే ఉంటుందని రాష్ట్రపతి అన్నారు. మహావీర్ జయంతిని పురస్కరించుకుని ముర్ము మాట్లాడుతూ మహావీర్, బుద్ధుడు ఈ ప్రాంతం నుంచి కరుణ, అహింస, ప్రేమ సందేశాన్ని యావత్ మానవాళికి వ్యాప్తి చేశారని చెప్పారు. బౌద్ధ ఆలోచన చరిత్రలోని అత్యుత్తమ మేధావులలో కొందరు నలందలో నివసించి, పనిచేశారని ఆమె చెప్పారు.



# బిజెపి గూటికి లియాండర్ పేస్

**న్యూఢిల్లీ:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల వేళ టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ బిజెపి కండువా కప్పుకున్నారు. కేంద్రమంత్రి కిరణ్ రిజిజు సమక్షంలో మంగళవారం ఆయన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పేస్ సాధించిన విజయాలను రిజిజు గుర్తుచేసుకున్నారు. 22 ఏళ్లకే 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో పురుషుల సింగిల్స్‌లో కాంస్యం నెగ్గి... పేస్ సరికొత్త చరిత్ర సృష్టించారన్నారు. రిజిజు మాట్లాడుతూ 'ఒలింపిక్ మెడల్స్ జాబితాలో భారత్ పేరు చేరేలా చేశారు. బిజెపి వేదికగా ఇకనుంచి ఆయన దేశానికి సేవ చేయనున్నారు' అని చెప్పుకొచ్చారు. కోల్‌కతాలో పుట్టిన పేస్... తల్లిదండ్రుల ప్రోత్సాహంతో టెన్నిస్ వైపు నడిచారు. తన కెరీర్‌లో ఏకంగా 18 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచాడు. అందులో 10 మిక్స్‌డ్ డబుల్స్‌లో, 8 పురుషుల డబుల్స్‌లో నెగ్గారు. రాకెట్ వదిలి... 2021లో తణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. అప్పుడు ఆ పార్టీ తరఫున ప్రచారం చేశారు.

# యుసిసి అమలు చేస్తాం



## మహిళలకు నెలకు రూ.3 వేలు అసోంలో బిజెపి మ్యానిఫెస్టో హామీ

**గువహతి:** అసోం అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బిజెపి మంగళవారం మ్యానిఫెస్టో విడుదల చేసింది. ఇందులో ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి)తో పాటు మహిళలకు నెలకు రూ.3 వేలు అందిస్తామంటూ హామీలు ప్రకటించింది. మొత్తం 31 హామీలతో కూడిన మ్యానిఫెస్టోను అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహా పలువురు నేతలు విడుదల చేశారు. మ్యానిఫెస్టోలోని ముఖ్యాంశాలు పరిశీలిస్తే...రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్, ఎస్‌టి ప్రాంతాలు మినహా అసోం అంతటా యుసిసి అమలు చేస్తామని బిజెపి హామీ ఇచ్చింది. వరదరహిత రాష్ట్రంగా చర్యలు తీసుకుంటామని, బంగ్లాదేశీ మియాలు ఆక్రమించుకున్న భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని, అరుణోదయ పథకం కింద మహిళలకు నెలకు రూ.3 వేలు అందజేస్తామని, ఐదేళ్లలో 2 లక్షల మందికి ఉద్యోగాల కల్పన,లఖ్‌పతి దీదీ పథకం కింద 40 లక్షల మంది మహిళలకు ప్రోత్సాహకాలు అందిస్తామని హామీలు గుప్పించింది.

# ఇండిగో కొత్త సిఇఒ విలియం వాల్ష్

**న్యూఢిల్లీ:** ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో సిఇఒగా బ్రిటీష్ ఎయిర్‌వేస్ మాజీ చీఫ్ విలియం వాల్ష్ నియమితులయ్యారు. పీటర్ ఎల్బర్స్ రాజీనామాతో ఏర్పడిన ఖాళీని వాల్ష్‌తో ఇండిగో భర్తీ చేసింది. ప్రస్తుతం ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ డైరెక్టర్ జనరల్‌గా వాల్ష్ వ్యవహరిస్తున్నారు. గతేడాది డిసెంబర్‌లో భారీ స్థాయిలో ఇండిగో విమానాలు రద్దైన సంగతి తెలిసిందే. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తర్వాత పీటర్ ఎల్బర్స్ తన పదవీకాలం ముగియడానికి 18 నెలల ముందే అకస్మాత్తుగా రాజీనామా చేశారు. దీంతో కొత్త సిఇఒ నియామకం చోటుచేసుకుంది. ఇండిగో వంటి బలమైన పునాదులు కలిగిన సంస్థకు నాయకత్వం వహించడం సంతోషంగా ఉందని విలియం వాల్ష్ పేర్కొన్నారు. విమానయాన రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సంస్థను ముందుకు తీసుకెళ్తానని తెలిపారు.

# భారీ ఉగ్రకుట్ర బట్టబయలు

**ఢిల్లీలో లష్కరే తొయిబా ఉగ్రవాది అరెస్ట్.. సంచలన నిజాలు వెల్లడి**



**న్యూఢిల్లీ :** దేశంలో భారీ ఉగ్రకుట్ర బయటపడింది. పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ లష్కరే తొయిబాకు సహకరిస్తున్న షబ్బీర్ అహ్మద్ అనే ఉగ్రవాదిని ఢిల్లీ స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి ఉగ్రదాడులకు సంబంధించి కీలక సమాచారాన్ని సేకరించారు. ఈ విచారణలో సంచలన విషయాలు వెల్లడయ్యాయి. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలో భారీ పేలుళ్లకు కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. ఢిల్లీలోని వాణిజ్య ప్రాంతాలు, హిందూ దేవాలయాలే టార్గెట్‌గా ఎంచుకున్నట్లు వెల్లడైంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. బంగ్లాదేశ్ కేంద్రంగా పని చేసే ఉగ్రసంస్థలతో, అలాగే పాక్ ఉగ్రవాద సంస్థలతోనూ ఢిల్లీకి చెందిన షబ్బీర్ అహ్మద్ సంబంధాలు కలిగి ఉన్నాడు. దేశంలోని కీలక ప్రదేశాలకు సంబంధించిన సమాచారాన్ని అతడు లష్కరే తొయిబా వంటి సంస్థలకు చేరవేశాడు. ఢిల్లీలోని ప్రధాన కేంద్రాల్ని వారు లక్ష్యంగా ఎంచుకుని, అనేక ప్రాంతాలపై నిఘా ఏర్పాటు చేశారు. ఢిల్లీలోని హిందూ ఆధ్యాత్మిక కేంద్రాలైన కల్కాజి టెంపుల్, చాతర్‌పూర్ టెంపుల్, లోటస్ టెంపుల్‌లతోపాటు ప్రధాన వాణిజ్య కేంద్రాలైన కొన్నాట్ ప్లేస్, పహార్‌గంజ్ వంటి కమర్షియల్ హబ్స్‌ను ఎంచుకున్నారు. షబ్బీర్ అహ్మద్ వాటిని మొత్తం పరిశీలించి, అక్కడి వివరాల్ని వీడియోలుగా చిత్రీకరించి, వాటిని పాక్ ఉగ్రసంస్థలకు చేరవేశాడు. షబ్బీర్ ఒంటరిగా తిరుగుతూ ఆ ప్రదేశాల వివరాల్ని సేకరించాడు. అతడు బంగ్లాదేశ్, పాక్ ఉగ్రవాద సంస్థలతోపాటు ఐఎస్ఐ వంటి పాక్ ఇంటెలిజెన్స్ సంస్థలతో కూడా కలిసి పని చేస్తున్నాడు. బంగ్లాదేశ్‌లో ఒక కొత్త తీవ్రవాద సంస్థను స్థాపించాలనే లక్ష్యంలో భాగంగా షాబిద్, మిగతా ఉగ్రవాదులు కలిసి పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ, ఎన్‌సీఆర్ చుట్టు పక్కల ప్రాంతాల్లో సభ్యుల్ని చేర్చుకోవడం, ఉగ్రవాదంపై ప్రోత్సహించడం వంటి కార్యకలాపాలు లక్ష్యంగా వీరు పని చేస్తున్నారు. భారత నిఘా సంస్థల నుంచి తప్పించుకునేందుకు షబ్బీర్.. టెలిగ్రాం వంటి యాప్స్ వాడేవాడు. ఇటీవల ఇలాగే జమ్మూ కాశ్మీర్‌లో ఇలాగే టీఆర్ఎఫ్ (ద రెసిస్టెన్స్ ఫ్రంట్) అనే ఉగ్ర సంస్థ పుట్టుకొచ్చిన సంగతి తెలిసిందే. ఢిల్లీ పోలీసులు సరైన సమయంలో షబ్బీర్ అనే ఉగ్రవాదిని గుర్తించడంతో భారీ కుట్ర భగ్నమైంది.

# నేటి నుంచి జేబుకు చిల్లు

## అమలులోకి కొత్త విధానాలు

**న్యూఢిల్లీ:** కొత్త ఆర్థిక సంవత్సరం (2026–27) బుధవారం నుంచి ప్రారంభం కానుండటంతో బ్యాంకింగ్, పన్నులు, పెట్టుబడులకు సంబంధించి పలు కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఈ మార్పులు ప్రజల నెలవారీ బడ్జెట్ నుంచి దీర్ఘకాలిక పొదుపు వరకు అన్నింటిపై ప్రభావం చూపుతాయి. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కావడంతో పన్ను చెల్లింపుదారులు తమ ఆదాయ వివరాలు నమోదు చేసే ప్రక్రియలో మార్పులు ఉంటాయి. ముఖ్యంగా డిఫాల్ట్ పన్ను విధానం ఎంచుకునే వారికి మరిన్ని ప్రయోజనాలు అందే అవకాశం ఉంది. చాలా బ్యాంకులు ఏప్రిల్ 1 నుంచి క్రెడిట్ కార్డ్ రివార్డ్ పాయింట్ల నిబంధనలు సవరించాయి. అద్దె చెల్లింపులు లేదా ఇన్సూరెన్స్ ప్రీమియంపై వచ్చే రివార్డ్ పాయింట్లలో కోత విధించే అవకాశం ఉంది. ఇక నుంచి అన్ని కొత్త బీమా పాలసీలను తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ రూపంలోనే జారీ చేయాల్సి ఉంటుంది. దీనివల్ల డాక్యుమెంట్లు పోగొట్టుకునే భయం ఉండదు. మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడిదారులు తమ కేవైసీ వివరాలను అప్‌డేట్ చేసుకోవడం తప్పనిసరి. అధికారిక పత్రాల ప్రకారం కేవైసీ పూర్తి చేయని ఖాతాల నుంచి లావాదేవీలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. ప్రతి నెల ఒకటో తేదీన చమురు సంస్థలు ఎల్‌పీజీ ధరలు సమీక్షిస్తాయి.

### సెమీ కండక్టర్ సరఫరాదారుగా

# భారత్ పాత్ర బలోపేతం: మోదీ



**న్యూఢిల్లీ:** ప్రపంచంలో విశ్వసనీయ సెమీకండక్టర్ సరఫరాదారుగా భారతదేశం తన పాత్రను బలోపేతం చేసుకుంటోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సనంద్‌లో కేన్స్ సెమికాన్‌కు చెందిన అవుట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్ట్ ప్లాంట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ ఈ ప్లాంట్ ప్రారంభోత్సవం ఆత్మనిర్భరత దిశగా భారతదేశం చేస్తున్న ప్రయత్నాలను బలోపేతం చేస్తుందని, ఇది పటిష్టమైన సెమీకండక్టర్ పర్యావరణ వ్యవస్థను నిర్మించడంలో ఒక మైలురాయి అని తెలిపారు. ప్రపంచ సెమీకండక్టర్ సరఫరా గొలుసులో ఒక భారతీయ కంపెనీ చేరడం గర్వకారణమని పేర్కొంటూ, ఇది కేవలం ఆర్థిక పోటీ సమయం మాత్రమే కాదని, భవిష్యత్ టెక్నాలజీ రంగ స్వరూపాన్ని తీర్చిదిద్దాల్సిన సమయం అని మోదీ అన్నారు. 'ఈ ప్రాజెక్టులో ఉత్పత్తి ప్రారంభం కావడంతో ప్రపంచ మార్కెట్‌లో విశ్వసనీయ సెమీకండక్టర్ సరఫరాదారుగా భారతదేశం తన పాత్రను మరింత బలోపేతం చేసుకుంటోంది. ఒక విధంగా చెప్పాలంటే, ఈ రోజు సనంద్, సిలికాన్ వ్యాలీ మధ్య ఒక కొత్త వారధి ఏర్పడింది. సనంద్‌లోని ప్లాంట్ ఇప్పుడు కాలిఫోర్నియా కేంద్రంగా పని చేస్తున్న ఒక సంస్థకు 'ఇంటెలిజెంట్ పవర్ మాడ్యూల్స్‌ను సరఫరా చేస్తోంది' అని ప్రధాని పేర్కొన్నారు. భారతదేశం 2021లో సెమీకండక్టర్ మిషన్‌ను ప్రారంభించిందని, ఇది కేవలం ఒక పారిశ్రామిక విధానం మాత్రమే కాదని, భారతదేశ ఆత్మవిశ్వాసానికి ఒక ప్రకటన అని అన్నారు. 'ఉత్పత్తిలోని ప్రతి రంగంలో దేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చేందుకు భారతదేశం గత బడ్జెట్‌లో సెమీకండక్టర్ మిషన్ 2ను ప్రారంభించింది' అని ఆయన పేర్కొన్నారు.

# హైతీ సాయుధముఠా దాడిలో 70 మంది మృతి

**సమగ్ర దర్యాప్తునకు ఐక్యరాజ్యసమితి డిమాండ్**

పోర్ట్ ఔ ప్రిన్స్: కరీబియన్ సముద్రంలో క్యూబా సమీప దేశం రిపబ్లిక్ ఆఫ్ హైతీలోని ఆర్టిబోనౌట్‌లో సాయుధ ముఠా చేసిన దాడిలో 70 మంది మరణించారు. మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. దీంతో తీవ్ర భయాందోళన చెందిన 6000 మంది ప్రజలు ఆ ప్రాంతం నుండి ఇళ్ళు ఖాళీ చేసి దూరంగా పారిపోయారు. గ్రాన్‌గ్రిఫ్ కు చెందిన సాయుధ ముఠా సభ్యులు తెల్లవారుజామున ప్రజలు గాఢనిద్రలో ఉన్న సమయంలో జీన్–డెనిస్ ప్రాంతంపై దాడి చేశారని స్థానిక పౌర రక్షణ అధికారులు చెప్పారు. ఈ సమీపంలో ఉన్న వెరెట్టెస్‌లో ఇటీవల దాడులు చేయడంతో 2000 మంది నిరాశ్రయులయ్యారు. గ్రాన్ గ్రిఫ్, వివ్ అన్సామ్ ముఠాలమధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ ఘర్షణలు సర్వత్రా వ్యాపిస్తున్నాయి. రాజధాని పోర్ట్ ఔ ప్రిన్స్‌లో అధికభాగాన్ని సాయుధ ముఠాలు పాలిస్తున్నాయి. దీనిని అదుపు చేయడం కోసం ఐక్యరాజ్యసమితి సారథ్యంలోని బలగాలు, అమెరికాకు చెందిన ఒక ప్రైవేటు సంస్థ సహాయంతో హైతీ భద్రతా దళాలు కృషి చేస్తున్నాయి. 2021 నుండీ ఇప్పటివరకూ ఈ ముఠాలవల్ల 20,000 మంది మరణించారు. ఐనాగానీ ఏ ఒక్క ముఠా నాయకుణ్ణీ ఇప్పటివరకూ అరెస్టు చేయలేదు. ప్రతి ఏడాదీ ఈ మరణాల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఆర్టిబోనైట్ అనేది వ్యవసాయ ప్రధానమైన ప్రాంతం. అధికారిక గణాంకాల కంటే చాలా ఎక్కువమంది ఈ దాడుల్లో మరణించారని హైతీ మానవహక్కుల సంఘం (కలెక్టివ్ డిఫెండింగ్ హ్యూమన్ రైట్స్) ప్రకటించింది. భద్రతా సిబ్బంది ఏ విధ ంగానూ స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని మానవ హక్కుల సంఘం తీవ్రంగా విమర్శించింది.

భారత రాజ్యాంగం సంక్షేమ రాజ్యాన్ని హామీ ఇచ్చింది. 1990 దాకా ప్రభుత్వాలు ఆ దిశలో ప్రయాణానికి ప్రాధాన్యం ఇచ్చాయి. 1991లో నయా ఉదార ఆర్థిక విధానాలు ప్రవేశించాక సంక్షేమానికి తిలోదకాలిచ్చారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పిజి) పేరుతో పెట్టుబడులకు పెద్ద పీట వేసి సామాన్య ప్రజలను, రైతులను దోచుకునే విధానాలు రాజ్యమేలుతున్నాయి. అధికారంకోసం ఇక్కడే మరో వైరుధ్యం అస్థిత్వంలోకి వచ్చింది. ప్రభుత్వ విధానాల్లో పెట్టుబడికి సేవచేస్తూ, అధికారంకోసం ఎన్నికల్లో ఓటర్లకు ఉచిత సహాయం అందించే పథకాలు నెమ్మదిగా ప్రారంభమై ఇప్పుడు పరాకాష్టకు చేరాయి. దోపిడీకి గురవుతున్న పేదలకు ఎంతోకొంత ఉపశమనం చేకూర్చేందుకు కొన్ని పార్టీలు ప్రారంభించిన ఈ వాగ్దాన చొరవలను 'తాయిలాలు'గా, పరిహసించిన ప్రధాని నరేంద్ర మోదీ, కొద్దికాలంలోనే బిజెపి మేనిఫెస్టోల్లో ఉచిత పథకాలు చేర్చటాన్ని అనుమతించారు. కేంద్రంలో తాము అధికారంలో ఉన్నందున రాష్ట్రాల్లో కూడా తమ/తమ కూటమి ప్రభుత్వాలను గెలిపిస్తేనే 'రెండు ఇంజిన్‌ల' ప్రభుత్వం ఉచిత పథకాలను సమర్థవంతంగా అమలు జరుపగలుగుతుందని ఉద్ఘాటించటం మొదలుపెట్టారు. ఎన్నికల్లో ఓటర్లకు డబ్బు పంపిణీ చేసే రాజకీయ అవినీతి, ఓటర్లకు ఉచిత ప్రదానాల పేరుతో అధికారికంగా రాజకీయ ఎజండాలోకి చేరింది. పాలక వర్గ పార్టీల మధ్య పోటీ పెరిగింది. అభ్యర్థులందరూ మహా కోటీశ్వరులే. ఆర్థిక అసమానతలు నెలకొని ఉన్న సమాజంలో అర్హులైన వారికి రాజ్యం సహాయం చేయటం సంక్షేమం కిందకు వస్తుంది. కాని విచక్షణారహితంగా మహిళా ఓటర్లను ఆకర్షించే పథకాలు పెరుగుతున్నాయి. మహిళలు ఉచిత నగదు సహాయం ఇవాళ దాదాపు అన్ని రాష్ట్రాల్లో ఒక లక్షణంగా మారింది – చెల్లించే నగదు మొత్తంలో వ్యత్యాసాలున్నాయి – అంతే. సంక్షేమ పథకాలకు చెల్లింపులకే ఆదాయం సరిపోక పలు రాష్ట్రాలు అభివృద్ధి కార్యక్రమాలకు అప్పులపై ఆధారపడుతున్నాయి – కిస్తీలు చెల్లించలేక కొన్ని ప్రభుత్వాలు గింజుకుంటూ గత ప్రభుత్వాలను నిందిస్తుంటాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం పెంచుకునేందుకు సంపన్నులపై, పెట్టుబడిదారులపై పన్నులు పెంచాలి. ఆ పనిచేస్తే పెట్టుబడిదారులు తక్కువ పన్నులున్న రాష్ట్రాలకు వెళ్లిపోతారన్న భయం. అందువల్ల వారికి రాయితీలు, పన్నుల తగ్గింపు మోదీ ప్రభుత్వ విధానంగా ఉండగా ఏ రాష్ట్రం సంపద వృద్ధిపై పన్నులు వేయగలదు!

# ఉచిత ప్రదానాల్లో పోటీ

ఏప్రిల్ నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో అసోం ఒకటి. అక్కడ ప్రధాన ప్రత్యర్థులు బిజెపి, కాంగ్రెస్. పదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ అధికారంకోసం ఓటర్లకు కొన్ని 'గ్యారంటీలు' హామీ ఇచ్చిందంటే అర్థం చేసుకోవచ్చు. కాని పదేళ్లుగా అధికారంలో ఉండి అస్సామీ జాతీయవాదం, ముస్లిం వ్యతిరేకతతో సమాజాన్ని విభజించి ఏలుబడి సాగిస్తున్న బిజెపికి ఇబ్బడిముబ్బడి ఉచితాలు హామీ ఇవ్వటం ఎందుకు అవసరమైంది. కచ్చితంగా మూడవసారి అధికారం మాదే అని డప్పుకొడుతున్న ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ భయపడుతున్నారని అర్థం.

కాంగ్రెస్ పార్టీ మార్చి 29న అసోం ఓటర్లకు ఐదు 'గ్యారంటీల'తో మ్యానిఫెస్టో విడుదల చేయగా, రెండ్రోజుల తర్వాత బిజెపి 31వాగ్దానాలతో ప్రణాళిక విడుదల చేసింది. రాష్ట్రంలో ఎన్‌డిఎ, అంతకుముందు యుపిఎ ప్రభుత్వ సాఫల్యాలను బేరీజు వేసి తమ పాలన గొప్పగా ఉందని బిజెపి మ్యానిఫెస్టో ఉద్ఘాటించింది.

కాంగ్రెస్ ఐదు గ్యారంటీలు : వ్యాపారం ప్రారంభించటానికి లేదా వృద్ధి కోసం ప్రతి మహిళ బ్యాంక్ ఖాతాకు రూ.50,000లు బదిలీ. రాజకీయ వివక్షత ఉండదు. రెండు, రూ.25లక్షల వరకు నగదు రహిత ఆరోగ్య రక్షణ; మూడు, ప్రజా గాయకుడు జుబీన్ గార్గ్ హత్య విషయంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో న్యాయం చేయటం; నాలుగు, వృద్ధాప్య పెన్షన్ నెలకు రూ.250 నుంచి రూ. 1250కి పెంపుదల; 5, 'భూమి పుత్రులకు' 10లక్షల వార్షిక పట్టాల స్థానంలో శాశ్వత పట్టాలు ఇస్తాం.

బిజెపి వారి వాగ్దానాల్లో కొన్ని : తొలి సంకల్పం – అసోం ఆది ప్రజల భూమిని, వారసత్వాన్ని, గౌరవాన్ని కాపాడతాం. ఇది చాలా మౌలికమైనది. రెండు, ఏకరూప పౌర స్మృతి అమలు (6వ షెడ్యూలు ప్రాంతాలు, గిరిజనులకు మినహాయింపు), లవ్ జిహాద్‌ను అరికట్టేందుకు కఠినమైన చట్టం, భూమి జిహాద్ నిరోధానికి గట్టి చర్యలు; అదనంగా 2లక్షల ఉద్యోగాలు, కొత్త పరిశ్రమల స్థాపనకు 10లక్షల మంది యువతకు రూ.5లక్షల వరకు ఆర్థిక సహాయం, ఉచిత రేషన్, జిల్లాకొక యూనివర్శిటీ, పేదలకు కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య, మహిళలకు నెలవారీ ఆర్థిక సహాయం రూ.3వేలకు పెంపు, రైతులకు ఏటా రూ.11 వేలు వగైరా.

బిజెపి అభ్యర్థులలో ముస్లిం ఒక్కరూ లేకపోవటం ప్రత్యేకించి గమనించదగింది. ఇది దేశవ్యాప్తంగా బిజెపి అనుసరిస్తున్న మినహాయింపు విధానం. ఇది సమాజాన్ని ఎంతగా విభజిస్తుందో ఊహించుకోవచ్చు. ఇది తాత్కాలికంగా ఎన్నికల ప్రయోజనం చేకూర్చవచ్చు. కాని దేశ సమైక్యతకు దీర్ఘకాలంలో జరిగే చేటును విస్మరించటం బిజెపి/ఆర్‌ఎస్‌ఎస్ సంకుచిత భావజాలానికి నిదర్శనం.



## హింస, సంఘర్షణలు ముగియాలి

అన్ని మతాలు సహనాన్ని, శాంతిని బోధిస్తాయి. హింసను ఖండిస్తాయి. ఏ ఆధ్యాత్మిక సంప్రదాయంలోనూ హింసకు స్థానం లేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు శాంతి కోసం కృషి చేయాలి. పశ్చిమాసియా సహా ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న హింస, సంఘర్షణలు త్వరగా ముగియాలి. పశ్చిమాసియా, రష్యా-ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న సంఘర్షణలకు శాశ్వత పరిష్కారం చర్చలు, దౌత్యం, పరస్పర గౌరవంపై ఆధారపడి ఉంటుంది. మనమందరం తోబుట్టువులమనే అవగాహనతో ఈ సంఘర్షణలను పరిష్కరించుకోవాలి.

– నోబెల్ గ్రహీత దలైలామా

## ఆల్ ఫూల్స్ డే - మానసిక సాంత్వన వేదిక!

తాజా సమాచారం ప్రకారం, అమెరికా అధ్యక్షుడు తాను ఇటీవల తీసుకున్న నిర్ణయాలన్నింటినీ వెనక్కి తీసుకున్నారనే వార్త ప్రపంచ మానవాళిని ఆనంద డోలికల్లో ముంచేస్తున్నది. అదే విధంగా ప్రపంచ ప్రజలు స్మార్ట్‌ఫోన్‌పై విరక్తి చెంది నేటి నుంచి వాడడం మానేశారనే వార్త కూడా సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తున్నది. ఈ వార్తలను మీరు నమ్మడం లేదు కదా ! మీరు నమ్మినట్లైతే మీరు పప్పులో కాలేయినట్లే, ఏప్రిల్ ఫూల్ అయినట్లే.

**చిలిపి సరదాల నెలవు ఆల్ ఫూల్స్ డే :** అనాదిగా ప్రపంచ దేశాలు 01 ఏప్రిల్ రోజున ఏప్రిల్ ఫూల్స్ డే లేదా ఆల్ ఫూల్స్ డే నిర్వహించుకోవడం చూస్తేనే ఉన్నాం. ఆత్మీయులను సరదాగా ఆట పట్టించడం, క్షణకాలం పాటు అబద్ధాలతో సహచరులు లేదా బంధువులను ఆశ్చర్యచకితులను లేదా ఫూల్ చేయడం, లేని దానిని ఉన్నట్లు లేదా ఉన్న దానిని లేనట్లుగా భ్రమింపజేయడం, జోక్స్ వేసుకొని నవ్వుకోవడం, చిలిపిగా ఒకరినొకరు మోసం చేసుకోవడం, అబద్ధపు వార్తలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడం లాంటి పలు ప్రవర్తనలతో ఏప్రిల్ ఫూల్ అంటూ సంతోషంగా గడపడం ఆల్ ఫూల్స్ డేకు మాత్రమే సొంతం.

**ఏప్రిల్ ఫూల్ దినం చారిత్రక నేపథ్యం:** చారిత్రక నేపథ్యాలను తవ్వి చూస్తే ఏప్రిల్ ఫూల్స్ డే జననం 1582కు చెందుతుంది. ఫ్రాన్స్‌లో 01 ఏప్రిల్ రోజున ప్రారంభం అయ్యే జూలియన్ క్యాలెండర్ నుంచి 01 జనవరిన ప్రారంభమయ్యే గ్రిగోరియన్ క్యాలండర్‌కు మారిన సందర్భంలో ప్రజల కొంత అసౌకర్యానికి లోనుకావడం, ఈ మార్పును అర్థం చేసుకోలేదని వారిని ఏప్రిల్ ఫూల్‌గా గేలి చేయడం ఆచారంగా మారి, కాల క్రమంలో అన్ని దేశాలకు విస్తరించడంతో ఏప్రిల్ ఫూల్ డే బహుళ ప్రచారంలోకి వచ్చింది. మరో వివరణ ప్రకారం హిలారీ అనే పురాతన రోమ్ పండుగలో రుతువులు మారుతూ వాతావరణ మార్పులు అసంబద్ధంగా ఉండడంతో ఏప్రిల్ ఫూల్ అంటూ ఒకరినొకరు ఆట పట్టించుకోవడం జరిగేదని కూడా తెలుపబడింది. వ్యాపార సామ్రాజ్యాలు, క్రీడలు, రెస్టారెంట్లు లాంటి అనేక స్థలాల్లో కూడా 01 ఏప్రిల్ రోజున ఆల్ ఫూల్స్ డేను సరదాగా ప్రదర్శించడం జరుగుతూ వస్తున్నది.

హానికరం కాని, మరొకరి మనసు నొప్పించని జోక్స్, అవమానకరం కాని అవాస్తవ సమాచారాలు, ఆట పట్టించే సందర్భాలతో కొనసాగుతు న్న ఆల్ ఫూల్స్ డే ప్రపంచ మానవాళిని సంతోష సాగరంలో ముంచేయడంతో పాటు మానసిక సాంత్వన చేకూర్చడం జరుగుతున్నది. నేటి ఏప్రిల్ ఫూల్ డే సరదాగా గడపాలని, మన వల్ల మరొకరి మనసు నొచ్చుకోకూడదని అర్థం చేసుకుంటూ ఆనందంగా ఆల్ ఫూల్స్ డేను జరుపుకుందాం. దైనందిన వేగవంతమైన జీవన విధానం లోంచి కొంత సమయాన్ని కేటాయించి ఏప్రిల్ ఫూల్ అంటూ మానసిక ఒత్తిడిని తగ్గించుకుంటూ ఈ రోజైనా ఉల్లాసంగా గడుపుదాం.

(01 ఏప్రిల్ – ఏప్రిల్ ఫూల్స్ డే సందర్భంగా)

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

### మహనీయులు జన్మించిన నెల ఏప్రిల్

ఆంగ్ల క్యాలండర్‌లోని ఏప్రిల్ 1న ఎవరో ఒకర్ని ఏప్రిల్ ఫూల్‌ని చేసి ఏప్రిల్ ఫూల్‌గా అవహేళన చేయటం కొందరికి సరదా! ఇది భారతీయ సాంప్రదాయం కాకపోయినా ఇంగ్లీషు చదువులతో మన దేశంలో తిష్ట వేసింది.

భారత దేశానికి గొప్ప నాయకులను అందించిన నెల ఏప్రిల్.

* భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జన్మదినం – ఏప్రిల్ 14
* సంఘ సంస్కర్త, పరిపాలనాదక్షుడు డాక్టర్ బాబూ జగ్జీవన్ రాం జన్మదినం ఏప్రిల్ 5.
* గొప్ప హేతువాది, సత్యశోధక్ సమాజ్ వ్యవస్థాపకుడు, మహిళలకు విద్యాప్రదాత మహాత్మ జ్యోతిరావు ఫూలె జన్మదినం – ఏప్రిల్ 11
* సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినం – ఏప్రిల్ 16
* విప్లవ కవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) జన్మదినం – ఏప్రిల్ 30

# గడువు ముగిసింది – మావోయిస్టుల ప్రజా జీవితం ఎటు?

దేశం నుండి మావోయిస్టులను లేదా నక్సలైట్లను రూపుమాపటానికి హోంమంత్రి అమిత్‌షా 2024 ఆగస్టు 24న విధించిన 2026 మార్చి 31గడువు మంగళవారం ముగిసింది. దేశం నక్సల్స్ రహితం అయిందని ఆయన ఢంకా బజాయించారు. ఇప్పటికే కొన్ని వందల సంఖ్యలో నాయకులు, వారి దళసభ్యులు ముఖ్యంగా చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పోలీసులకు ఆయుధాలు అప్పగించి లొంగిపోయారు. ప్రభుత్వాలు ప్రకటించిన నగదును, పునరావాస కార్యక్రమాలను అంగీకరించారు. ఇంకా గణపతిలాంటి ఒకరిద్దరు అగ్రనాయకులు, కొన్ని డజన్‌ల మంది కింది స్థాయి దళ నాయకులు, సభ్యులు సమాచారం అందక, పోలీసులతో కమ్యూనికేషన్ ఏర్పడకో లేదా పోరాటం కొనసాగించాలనే సంకల్పంతోనో రహస్య జీవితంలో ఉండి ఉండవచ్చు. గడువు ముగిసింది అంటే లొంగిపోయే అవకాశాలకు తలుపులు మూశారని అర్థం కాదు. ఆయుధాలు అప్పగించి ఎప్పుడైనా లొంగిపోవచ్చు, కాకపోతే ప్రభుత్వ పునరావాస కార్యక్రమాలకు అర్హులు కారు. ప్రభుత్వం తమకున్న ఇంటెలిజెన్స్ సమాచారం ప్రకారం లొంగుబాటుకు మరికొంత సమయం ఇవ్వవచ్చు, పునరావాస సదుపాయాలు పొడిగించనూవచ్చు. అయితే ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన క్రూరమైన హింస, మావోయిస్టుల నుండి చర్చల ప్రతిపాదనను, రహస్య జీవితంలోని తమ నాయకుల మధ్య కమ్యూనికేషన్ నెలకొల్పుకుని హోంమంత్రి ప్రతిపాదనపై చర్చించి నిర్ణయం తీసుకునేందుకు కోరిన వ్యవధిని అమిత్ షా మూర్ఖంగా తిరస్కరించిన వైనం గత ఐదారు మాసాల్లో నివారించదగిన హింసకు దారితీసింది. ప్రభుత్వం మావోయిస్టులను హతమార్చి ఉండవచ్చు, కాని వారు లేవనెత్తిన ప్రధానమైన సమస్యలు పరిష్కరించనంతకాలం వారి భావజాలం సజీవంగానే ఉంటుంది.

*ఈ సందర్భంగా, 1967 తిరుగుబాటు అనంతరం గత ఆరు దశాబ్దాల్లో నక్సలైట్ ఉద్యమంలో మలుపులు, మెలికలను సూక్ష్మంగా విశ్లేషిస్తూ ప్రముఖ పాత్రికేయుడు అరుణ్ శ్రీవాస్తవ రాసిన వ్యాసాన్ని ఇక్కడ ఇస్తున్నాం – సం॥*

**హోంమంత్రి అమిత్ షా సోమవారం లోక్‌సభలో చేసిన ప్రకటన ప్రకారం గత రెండు సంవత్సరాల్లో మావోయిస్టుల మొత్తం నాయకత్వాన్ని – ఒక్కరు మినహా – నిర్మూలించటం జరిగింది. 2024 ప్రారంభంలో సిపిఐ (మావోయిస్టు)కు పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీ సభ్యులు 21మంది ఉండేవారు. ఈనాడు ఒకరు అరెస్టులో ఉన్నారు, ఏడుగురు లొంగిపోయారు, 12 మంది హతులైనారు; పరారీలో ఉన్న వ్యక్తితో సంభాషణ జరుగుతున్నది. త్వరలోనే లొంగిపోతాడని భావిస్తున్నాం.**

**గడచిన మూడు సంవత్సరాల్లో 706 మంది మావోయిస్టులు హతులైనారు. 2218 మంది అరెస్టు చేయబడినారు. 4800లకు పైగా కేడర్లు లొంగిపోయారు.**

పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్‌బరీలో 1967లో రైతాంగ తిరుగుబాటు నుంచి ఉద్భవించిన నక్సలైట్ ఉద్యమం గత అరవై ఏళ్లలో ఎన్నో మలుపులకు, ఆటుపోట్లకు గురైంది. ఒక స్థానిక సాయుధ తిరుగుబాటు నుండి బయలుదేరి ప్రభుత్వ వ్యతిరేక తిరుగుబాటుగా చెల్లాచెదురుగా అభివృద్ధి చెందిన ఈ ఉద్యమం, ఇటీవల కాలంలో పెద్దఎత్తున లొంగుబాట్లు, భద్రతా దళాల చేతిలో కేడర్ల దారుణ హత్యలతో అంతరించే దశకు చేరింది. అయితే ఒక పరిణామం ఎంతో ముఖ్యమైంది. నక్సలైట్లు పెద్ద సంఖ్యలో చంపబడినప్పటికీ, ఇంతకు క్రితం మావోయిస్టులు ఆధిపత్యం వహించిన ప్రాంతాల్లోని ఆదివాసీల్లో ఉద్యమ స్ఫూర్తి అలాగే ఉంది.

హోంమంత్రి అమిత్‌షా మావోయిస్టుల లొంగుబాటుకు 2026 మార్చి 31ని గడువుగా నిర్ణయించి మావోయిస్టుల ఊచకోతకు భద్రతాదళాలను భారీగా మోహరించి 'ఆపరేషన్ కగార్' పేరుతో అడవులు జల్లెడ పట్టడంతో సాయుధ మావోయిస్టులు పెద్ద సంఖ్యలో లొంగిపోయారు. నక్సలైట్ నాయకుల్లో అత్యధికులను ఏరివేశామని హోంమంత్రి సంతోషపడవచ్చు. అయితే నక్సలిజంను రూపుమాపామని ఆయన చెప్పుకునే గొప్ప లు భ్రమ. నక్సలైట్ పార్టీలు, వాటి నాయకులు హతులై ఉండవచ్చు లేదా లొంగిపోయి ఉండవచ్చు. కాని షా ఆ భావజాలాన్ని అణగద్రొక్కలేరు.

నక్సలైట్‌ల తొలి సంఘటిత పార్టీ 1969 మే 1 నాటి కలకత్తాలోని షాహిద్ మినార్ వద్ద భారీ బహిరంగ సభలో ఏర్పడింది. 1964లో సిపిఐలో చీలిక నుండి ఉద్భవించి, ఆరంభంలో చైనా పంథాను, మావోను అనుసరించిన సిపిఐ(ఎం) నుండి తిరుగుబాటు చేసిన నాయకుడు చారు మజుందార్ కొత్త పార్టీ చైర్మన్‌గా ఎన్నుకోబడ్డారు. 1972లో పోలీసుల కస్టడీలో చారుమజుందార్ మరణించిన దరిమిలా, ఉద్యమం 40కి పైగా వేర్వేరు గ్రూపులుగా చీలిపోయింది. అవి ఐక్య విప్లవ కార్యాచరణకన్నా తరచూ అంతర్గత ఘర్షణల్లో మునిగిపోయాయి. ఆ ఘర్షణలకు బలమైన సైద్ధాంతిక ఎల్లలున్నాయి. కొత్తగా ముందుకు వచ్చిన సాయుధ పోరాట భావజాలంలో కొన్ని ప్రాథమికమైన గందరగోళాలు, వైరుధ్యాలున్నాయి. అవి గ్రూపుల మధ్య ఘర్షణలకు దారితీశాయి. ఈ పరిస్థితి క్రియాశీల కార్యకర్తలను అరెస్టు చేయటానికి, చంపివేయటానికి రాజ్యయంత్రానికి అవకాశమిచ్చింది.

రెండు భావజాల సమస్యలు – వర్గ శత్రువుల నిర్మూలన, చైనా చైర్మన్ మన చైర్మన్ – ఉద్యమానికి హాని చేశాయి. ఈ రెండు సమస్యలను సరైన దృక్పథంలో మదింపు చేయటానికి బదులు పక్కకు పెట్టారు. వేర్వేరు ఫాక్షన్స్ వేర్వేరు ఆదేశాలు పంపాయి. పశ్చిమబెంగాల్, బీహార్‌లలో, ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఒడిస్సా, చత్తీస్‌ఘడ్‌లోని కొన్ని ప్రాంతాల్లో పూర్తి గందరగోళం నెలకొంది. పశ్చిమ బెంగాల్‌లో ముఖ్యమంత్రి సిద్ధార్థ శంకర్ రే ప్రభుత్వం అనేకమంది నాయకులను జైళ్లలో పెట్టింది. క్రియాశీలంగా ఉన్న నక్సలైట్ గ్రూపులను దాదాపు అణచివేసింది. 1977లో వామపక్ష ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఆ ప్రభుత్వం జైళ్ల నుంచి నక్సలైట్లను విడుదల చేసింది. వారిలో చాలామంది బెంగాల్‌లో నూతన పరిస్థితిని సమీక్షించటం మొదలుపెట్టారు. కాగా ఇతర రాష్ట్రాల్లో పాత గ్రూపులు చురుకుగా ఉండిపోయాయి.

భారత ఆర్థిక వ్యవస్థలో సరళీకరణ క్రమం మొదలుకావటం, డెంగ్ సియావోపింగ్ నాయకత్వం క్రింద చైనా మార్కెట్ సోషలిజం అనే నూతన పంథా చేబట్టటం, అటుతర్వాత సోవియట్ యూనియన్ సహా తూర్పు యూరప్‌లో సోషలిస్టు వ్యవస్థ కూలిపోవటం – ఈ 1980, 1990 దశాబ్దాల్లో సంభవించిన పరిణామాలను గ్రహించి మావోయిస్టులు తమ వ్యూహం సరిదిద్దుకోలేదు. పరిమిత సంఖ్యలోని మావోయిస్టు గ్రూపులు తమ పోరాటాన్ని ఇప్పటికీ పాత రూపంలోనే కొనసాగిస్తున్నాయి. గిరిజన ప్రాంతాల్లో సైతం యువతలో బయలుదేరిన ఆకాంక్షలు ఉపయోగించుకుని వారిని ఏకాకులను చేసేందుకు రాజ్యయంత్రానికి పెద్ద అవకాశం ఇచ్చారు.

దక్షిణ భారతదేశంలో, ప్రధానంగా ఆంధ్ర–ఒడిస్సా సరిహద్దు (ఎఒబి) రీజియన్‌లో, తెలంగాణలో, కేరళ, కర్నాటక, తమిళనాడు ముక్కోణ కూడలి ప్రాంతంలో పనిచేస్తున్న మావోయిస్టులు సాయుధ పోరాటం పట్ల సైద్ధాంతిక నిబద్ధత, గ్రామీణ ప్రాంతాల్లో మిగిలివున్న తమ బలమైన కేంద్రాలను కాపాడుకోవలసిన అవసరం, పెచ్చుపెరుగుతున్న రాజ్య ఒత్తిడిని ప్రతిఘటించాల్సిన కారణాలన్నింటి దృష్ట్యా పోలీసుతో హింసాత్మక సంఘర్షణలు కొనసాగించారు. ఉద్యమం క్షీణిస్తున్నా, హింసాయుత ఘర్షణలు కొనసాగడం తర్కానికి అందదు. ప్రజాస్వామ్య క్రమాన్ని తిరస్కరించటం, "దీర్ఘకాల ప్రజా యుద్ధం" ద్వారా రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకోవటం సిపిఐ (మావోయిస్టు) మూల సిద్ధాంతం. రాజ్యస్వభావం ఫ్యూడల్, సామ్రాజ్యవాదం అయినందున తమ లక్ష్యాల సాధనకు హింసాయుత సంఘర్షణ ఒక్కటే మార్గంగా వారు భావించారు. పోలీసుల చేతిలో తమ నష్టాలకు వ్యతిరేకంగా మావోయిస్టులు ఎదురుదాడి చేసేవారు. తమ బలాన్ని ప్రదర్శించేందుకు, మరికొంతమంది లొంగుబాటును నిరోధించేందుకు వారు భద్రతా సిబ్బందిపై దాడులకు పాల్పడేవారు. వారి సంఖ్య బాగా క్షీణించింది. అయితే దృఢ సంకల్పులైన మావోయిస్టులు ఇప్పటికీ కొద్దిమంది ఉన్నారు. మార్చి 31 అంతిమ గడువు ముగిశాక కూడా వారు భద్రతా దళాలపై దాడులు చేయవచ్చు.

దక్షిణ భారతదేశంలో – "రెడ్ కారిడార్" అంతటా పరిశ్రమలు, మైనింగ్, మౌలిక వసతుల ప్రాజెక్టులకోసం బడా కార్పొరేట్లు భూమి సేకరిస్తుండటం మావోయిస్టు సాయుధ ప్రతిఘటన సాగుతుండటానికి దోహదం చేస్తున్న ముఖ్యమైన కారణం. అందువల్ల షా ఏమి గొప్పలు చెప్పుకున్నప్పటికీ రాటుదేలిన కేడర్లు ఇప్పటికీ ఉన్నారు.

భారతదేశంలో నక్సలైట్ ఉద్యమ చరిత్రను చూచినట్లయితే – 1972 మధ్య నాటికి పార్టీదాదాపుగా పూర్తి పక్షవాతానికి గురైంది. మొత్తం కేంద్ర నాయకత్వం ఆచరణలో నిర్వీర్యమైంది. మిగిలిన పార్టీ శక్తులు చీలికలు పీలికలై చెల్లాచెదురుగా ఉన్నాయి. పార్టీ పంథాకు సంబంధించి అంతటా గందరగోళం. 1990 జులైలో ఢిల్లీలో జరిగిన ప్రత్యేక మహాసభ, దాదాపు ఇరవై ఏళ్ల తర్వాత, బహిరంగంగా పనిచేయాలని నిర్ణయించింది. అలా ఉద్భవించిందే సిపిఐ (ఎంఎల్)–ఎల్. అది భారతదేశ పరిస్థితిలోని నూతన వాస్తవికతలను పరిగణనలోకి తీసుకుని 1969 నాటి ఆది సిపిఐ(ఎంఎల్) వారసత్వాన్ని స్వీకరించటం మొదలుపెట్టింది. ఇతర కమ్యూనిస్టు రివల్యూషనరీ గ్రూపులు అస్థిత్వ సంక్షోభంలో పడ్డాయి. గత 60 ఏళ్లలో కొన్ని అంతరించాయి. సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ బతికి బట్టకట్టటమేగాక, 1974లో అది పునర్నిర్మాణం పొందిన నాటినుంచీ నిరంతరాయతను, ఐక్యతను నిలబెట్టుకుంటున్నది. బలమైన జాతీయ నెట్‌వర్క్‌తోపాటు అది రెగ్యులర్‌గా పార్టీ కాంగ్రెస్‌లు, ప్రాంతీయ, జిల్లా స్థాయిలవరకు మహాసభలు జరుపుకుంటోంది.

సిపిఐ(ఎంఎల్)ను దాని పిడివాదం నుంచి, ఏకాకితనంతో కూడిన సాయుధ పోరాటం నుంచి వినోద్ మెహాతా సరిదిద్దాడు. ప్రజాస్వామ్య దృక్పథంలోకి తెచ్చి, అంతిమంగా విప్లవ రాజకీయాలను లీగల్ పోరాటాలతో కలగలిపాడు. 1970ల్లో ఆయన ప్రారంభించిన దిద్దుబాటు కార్యక్రమం కచ్చితంగా అజ్ఞాత జీవితం గడపటమే పార్టీ విధానం అనే వైఖరిని విడనాడింది. ఇండియన్ పీపుల్స్ ఫ్రంట్ (ఐపిఎఫ్) వంటి బహిరంగంగా పనిచేసే సంస్థలను నిర్మించాడు. 1982లో లిబరేషన్. ఒఆర్‌జి.ఇన్ ప్రారంభించాడు. సిపిఐ(ఎంఎల్) ఆరంభకాలపు పిడివాదంతో తెగతెంపులు చేసుకున్నాడు. విస్తృతంగా ప్రజలతో సంబంధాలకు మార్గంగా, లీగల్‌గా నిలదొక్కుకోవటానికి ఎన్నికల క్రమంలో పాల్గొన్నాడు. బిహార్‌లో ఉద్యమాలు నిర్మించాడు.

అదే సమయంలో సాయుధ పోరాటాన్ని నమ్మిన మావోయిస్టులు గడ్చిరోలీనుంచి బస్తర్ మీదుగా చత్తీస్‌ఘడ్, ఒరిస్సా వరకు హింసాయుత కార్యక్రమాలు కొనసాగించారు. ఆదివాసీల అండ తగ్గింది. ఇన్‌ఫార్మర్లు పెరిగారు. రాజ్యహింస పెచ్చరిల్లింది. అడవుల్లో బతకటం దుర్లభమైంది. లొంగుబాట్లు, పోలీసులనుంచి సామూహిక హత్యలు పెరిగాయి.

భారతదేశంలో నక్సలైట్ ఉద్యమ క్షీణతకు కారణాలనేకం. అంతర్గత శతృత్వం, సైద్ధాంతిక చీలికలు, నాయకత్వ సంక్షోభం ప్రధాన కారణాలు.

చారు మజుందార్ కుమారుడు, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి అభిజిత్ మజుందార్ ఇలా అంటారు – "...అవును, ఇప్పుడు మేము రాజ్యాంగ ప్రజాస్వామ్యాన్ని కాపాడటంపై ముందుగా దృష్టిపెడుతున్నాం. ఫాసిజానికి వ్యతిరేకంగా, ఫ్యూడల్ అవశేషాలు, బడా వ్యాపారవర్గం మధ్య బంధానికి వ్యతిరేకంగా, వివిధ రకాల ప్రభుత్వాల దుష్పరిపాలనకు వ్యతిరేకంగా పోరాటానికి నేడు దానిని అత్యంత ముఖ్యమైనదిగా భావిస్తున్నాం" అన్నారు. ఇది అజ్ఞాత జీవితం నుంచి పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పంథాలోకి మార్పు చెంది, పేదల పక్షాన సమరశీల పోరాటాలు చేస్తున్న పార్టీ. ఇప్పుడు అసంతృప్తితో ఉన్న ఇతర మావోయిస్టు గ్రూపులను ఈ పార్టీ తన సైద్ధాంతిక, నిర్మాణ పరిధిలోకి రాబట్టగలుగుతుందా? లేక ప్రభుత్వానికి లొంగిపోయిన మావోయిస్టు ప్రముఖులు పునఃసమీకృతులై, ప్రస్తుత దేశ పరిస్థితులను, వివిధ శక్తుల పొందికలను బేరీజు వేసుకుని పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పంథాలో పని చేసే మరో ఎంఎల్ పార్టీని ఏర్పాటు చేస్తారా? స్థానిక పరిస్థితుల్ని బట్టి ఇతర లెఫ్ట్ పార్టీలలో చేరతారా? వేచి చూడాల్సిందే. ముందుగా వారు జనజీవన స్రవంతిలో కుదురుకోవాలి. కొత్త జీవితం ప్రారంభించాలి.

*(ఐపిఎ సర్వీస్)*

# మైనర్ల డ్రైవింగ్... పెరుగుతున్న విషాదాలు



గిలకత్తుల వెంకట రమణ గౌడ్
9866878769

వేగం ఒక మత్తు. దానిని అదుపు చేసుకోవాల్సిన వయస్సులోకి రాకముందే చేతిలో స్టీరింగ్ పట్టుకుంటున్నారు. అది కేవలం పిల్లల తప్పు మాత్రమే కాదు, తల్లిదండ్రులు, సమాజం యొక్క ఉదాసీనత, నిర్లక్ష్యం, పర్యవేక్షణ వైఫల్యం. నేడు ప్రపంచ వ్యాప్తంగా పిన్న వయసు డ్రైవర్ల వల్ల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు అనేక కుటుంబాలను, తీరని వేదనతో శోకసాగరంలో ముంచుతున్నాయి. సమ వయస్కుల చేత గుర్తించబడాలని ఆకాంక్ష, సామాజిక ఒత్తిడి, సినిమా హీరోల అనుకరణ ప్రభావం, చట్టాల పట్ల అవగాహన లోపం, ఈ విషాదాలకు దారి తీస్తున్నాయి.ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) నివేదిక ప్రకారం 15 నుండి 35 సంవత్సరాల వయసు వారు ప్రపంచంలో జరిగే రోడ్డు మరణాలలో దాదాపు సగంమందిగా ఉన్నారు. ముఖ్యంగా 21సంవత్సరాల లోపు యువకులు రోడ్డు ప్రమాదాలలో మరణించే వారిలో మూడింట రెండు వంతులు ఉన్నా రు. అమెరికాలో జరిపిన పరిశోధన ప్రకారం 16–17 సంవత్సరాల డ్రైవర్ల ప్రాణాంతక ప్రమాద రేటు 20 సంవత్సరాలు పైబడిన డ్రైవర్ల కంటే మూడింతలు అధికంగా ఉంది. ఇవి అభివృద్ధి చెందిన దేశాల అంకెలు. అక్కడ నియమాలు కఠినంగా అమలవుతాయి, రోడ్లు మెరుగ్గా ఉంటాయి. మరి మన దేశంలో పరిస్థితి ఇంకెంత తీవ్రంగా ఉంటుందో అంచనా వేయవచ్చు.

**సోషల్ మీడియా**

పిన్న వయసు డ్రైవింగ్ ప్రమాదాలకు పరిశోధకులు చాలా కారణాలు గుర్తించారు. వాటిలో అత్యంత ఆందోళనకరమైనది. సోషల్ మీడియా మరియు డిజిటల్ ప్రభావం. సామాజిక అభ్యాస సిద్ధాంతం (Social Cognitive Theory) ప్రకారం, ప్రమాదకరమైన డ్రైవింగ్ ప్రవర్తనలు ఆదర్శ ప్రాయంగా, హీరోయిజంగా చూపించబడి, శిక్షించబడకుండా గుర్తింపు పొందినప్పుడు, అదే వయసు యువత వాటిని అనుకరించే అవకాశం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇక్కడే సమస్య మూలం దాగి ఉంది. సోషల్ మీడియాలో రీల్స్‌కు వేలాదిగా లైకులు వస్తాయి.ఆ గుర్తింపు ఆకర్షణే అపాయంలోకి నెట్టుతోంది. స్నేహితులు పక్కన కూర్చున్నప్పుడు టీనేజర్లు మరింత ప్రమాదకరంగా డ్రైవ్ చేసే అవకాశం ఉంటుంది.

ఈ సామాజిక ఒత్తిడి డిస్ట్రాక్షన్‌కు, నిర్లక్ష్య డ్రైవింగ్‌కు దారి తీస్తుంది. అదే సమయంలో మొబైల్ ఫోన్ చూస్తూ, డ్రైవ్ చేయడం వల్ల ప్రమాద అవకాశం 23 రెట్లు పెరుగుతుందని, దాదాపు 39% టీనేజర్లు డ్రైవింగ్ చేసేటప్పుడు ఫోన్ చూస్తున్నట్లు అంగీకరిస్తున్నారు.

**కనిపించని ముప్పు**

CDC పరిశోధన ప్రకారం, 16 నుండి 19 సంవత్సరాల డ్రైవర్లు 20 సంవత్సరాలు పైబడిన వారితో పోలిస్తే ప్రమాదం బారిన పడటానికి మూడింతలు ఎక్కువ అవకాశం కలిగి ఉంటారు. అనుభవం లేకపోవడం వల్ల, దూరాలు అంచనా వేయలేకపోవడం, ఆకస్మిక పరిస్థితులకు స్పందించలేకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా ఎదురు ప్రయాణాలు, మితిమీరిన వేగంతో నియంత్రణ తప్పడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా రిస్క్‌ను అంచనా వేసే ప్రిఫ్రంటల్ కార్టెక్స్ భాగం ఆ సమయంలో పూర్తిగా పని చేయదు. మోటార్ వెహికిల్స్ చట్టం 1988 లోని Section 4 ప్రకారం 18 సంవత్సరాలు నిండని వారు వాహనం నడపడం చట్టవిరుద్ధం. 2019లో సవరించిన చట్టం ప్రకారం Section 199A కింద పిన్న వయసు వారు వాహనం నడిపితే, వాహనం యజమాని లేదా తల్లిదండ్రులు కూడా నేరుగా బాధ్యత వహించాలి. రూ. 25,000 జరిమానా, వాహన రిజిస్ట్రేషన్ రద్దు, ఆ పిల్లవాడికి 25 ఏళ్ల వరకు లైసెన్స్ నిరాకరణ ఇవి చట్టంలో ఉన్నాయి. IPC Section 279 మరియు 304A కింద జైలుశిక్ష సైతం విధించే వీలుంది. చట్టాలు కఠినంగా అమలు చేసినప్పుడే ప్రమాదాలను నివారించగలం.

అమెరికాలో అమలవుతున్న Graduated Driver Licensing (GDL) విధానం ప్రపంచవ్యాప్తంగా నిపుణుల ప్రశంసలందుకుంటుంది.దశలవారీగా డ్రైవింగ్ అనుమతులు ఇచ్చే ఈ కార్యక్రమాలు టీనేజ్ డ్రైవర్ల ప్రమాద రేట్లను గణనీయంగా తగ్గించాయి. భారత్‌లోనూ అలాంటి సంస్కరణలు అవసరం. పాఠశాల, కళాశాల స్థాయిలో రోడ్డు భద్రత అవగాహన పాఠ్యాంశంలో భాగం కావాలి. ట్రాఫిక్ పోలీసులు విద్యార్థులతో క్రమంగా సంభాషించాలి. ప్రభుత్వం, యువత, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమ శిబిరాలు నిర్వహించాలి. చట్టాల పట్ల సంపూర్ణ అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు పిల్లలకు బైక్ ఇవ్వడం అంటే వారి మరిపట్ల ప్రేమ చూపించడమనే విషయం కారాదు. బైక్ ఇవ్వడంతో స్వేచ్ఛ ఇవ్వడం కాదు, వారిని ప్రమాదంలో నెట్టడం అనే విషయం అర్థం చేసుకోవాలి.సోషల్ మీడియా సంస్థలు కూడా బాధ్యత వహించాలి. ప్రమాదకరమైన స్టంట్ వీడియోలు వైరల్ అవ్వడానికి వేదిక కల్పించడం నైతికంగా, సామాజికంగా సరి కాక వారి ప్రాణాలకు ముప్పు కలిగించే విధంగా ఉంటున్నది.

**ప్రాణం తిరిగి రానిది**

రోడ్డు అనేది పోటీ మైదానం కాదు. వేగం అనేది సాహసం కాదు. స్టీరింగ్ అనేది సోషల్ మీడియా ప్రాప్స్ కాదు. ఈ రోజు అనేకమంది యువకులు వాహనాన్ని గుర్తింపు సాధనంగా మార్చుకుంటున్నారు. లైకులు వస్తాయని, వ్యూస్ పెరుగుతాయని, స్నేహితుల మధ్య హీరో అవుతారని. కానీ ఆ వేగపు మత్తులో ఒక్క సెకనులో కోల్పోయే ప్రాణం తిరిగి రాదు. ఏ లైక్,ఏ వీడియో కూడా చనిపోయిన వ్యక్తిని మళ్ళీ జీవింపజేయదు. 'మీరు ప్రపంచంలో చూడాలనుకుంటున్న మార్పుగా మీరే ముందు మారండి.' అన్న మహాత్మా గాంధీజీ మాటలు రోడ్డు భద్రతకు అక్షరాల వర్తిస్తాయి. తల్లిదండ్రులు పిల్లలకు తాళాలు ఇచ్చే తాళాలు తన పిల్లల జీవితంతో పాటు మరొకరి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే అవకాశం ఇస్తున్నామన్న గుర్తుంచుకోవాలి.ఒక నిర్లక్ష్య వైఖరిని ప్రోత్సహిస్తున్నామన్న విషయం గుర్తెరగాలి. ఉపాధ్యాయులు తరగతి గదిలో పాఠాల జ్ఞానంతో పాటు జీవిత విలువలు నేర్పే బాధ్యత కూడా తీసుకోవాలి. రోడ్డుపై మీకు ఎదురయ్యే ప్రతి వ్యక్తీ ఎవరో ఒకరికి అమ్మ, నాన్న, బిడ్డ, జీవిత భాగస్వామి. వారి ప్రాణం మీ వేగంకంటే విలువైనది. మీ ప్రాణం మీ రీల్స్, వ్యూస్ కంటే విలువైనది. స్టీరింగ్ పట్టుకున్న ప్రతిసారీ ఈ ఒక్క మాట గుర్తుండాలి.'నేను సురక్షితంగా ఇంటికి చేరుకోవాలి, ఇదే నన్ను ప్రేమించే వారికి నేనివ్వగలిగే అతిపెద్ద బహుమతి' అన్న మార్పు ఈ క్షణమే మొదలవ్వాలి.

## అంతర్రాష్ట్ర రహదారిపై ప్రమాద సూచిక బోర్డుల ఏర్పాటు




**ప్రజాపక్షం/ తలమడుగు:** తలమడుగు మండలం ఉండం గ్రామం నుండి ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లే అంతరాష్ట్ర రహదారిపై ప్రమాద సూచిక బోర్డులను అధికారులు ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఇరువైపు లా పిచ్చిమొక్కలు పెరిగి వాహనదారులు ఇబ్బందులు పడుతన్నారని, ముఖ్యంగా మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని 'ప్రజాపక్షం' పత్రికలో సోమవారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి తక్షణమే స్పందించిన అధికారులు ఉండం నుండి ఆదిలాబాద్ వెళ్లే మార్గంలో పిచ్చిమొక్కలను తొలగించి, ప్రమాద సూచిక బోర్డులను అమర్చారు. తలమడుగు, కొత్తూరు, సుంకిడి, కూచులపూర్, సాయిలింగి గ్రామాలతో పాటు మహారాష్ట్ర నుండి వచ్చే వాహనదారులకు దీనివల్ల ఎంతో మేలు చేకూరింది. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'ప్రజాపక్షం' యాజమాన్యానికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళా సాధికారతకు 'మహాలక్ష్మీ' భరోసా

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా



**ప్రజాపక్షం/ఆదిలాబాద్:** మహాలక్ష్మి పథకం మహిళల ఆర్థికాభివృద్ధికి, సాధికారతకు పెద్దపీట వేస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం విప్లవాత్మక నిర్ణయమన్నారు. జిల్లాలో సుమారు 2.55కోట్ల మంది మహిళలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని, దీనివల్ల ఆదిలాబాద్ డిపోలో 106 కోట్లు, ఉట్నూర్ డిపోలో 28 కోట్ల రూపాయల ప్రయాణ చార్జీలు ఆదా అయ్యాయని వెల్లడించారు. మహిళల ఆరోగ్యం కోసం త్వరలోనే హెల్త్ ప్రోఫైల్స్ తయారు చేస్తామని పీహెచ్‌సీల ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించారు. మహిళలు బస్సులు నడిపేలా జిల్లా సమాఖ్యకు వాహనాలు కేటాయించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని వివరించారు. అనంతరం మహిళా ప్రయాణికులు, ఉద్యోగులు, ట్రాన్స్‌జెండర్లను కలెక్టర్ సన్మానించారు.డిఆర్‌డిఓ రవీందర్ రాథోడ్, సంక్షేమ అధికారి మిల్కా, మెప్మా పీడీ రాజు, ఆర్టీసీ అధికారులు శ్రీహర్ష, రామయ్య, ప్రతిమ పాల్గొన్నారు.

## నేడు డిహెచ్‌పిఎస్ రెండో జిల్లా మహాసభలు

డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న




**ప్రజాపక్షం / మంచిర్యాల :** దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రెండో జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి దేవి పోచన్న పిలుపునిచ్చారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 1న నిర్వహించనున్న ఈ మహాసభలకు డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో దళితులపై హింస పెరిగిందని, రా జ్యాంగం కల్పించిన హక్కులను చట్టబద్ధంగా అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షలు తక్షణమే విడుదల చేయాలన్నారు. డిహెచ్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మారపల్లి రవి, నాయకులు గునిగంటి నరసింగరావు, మాసు రజిని, పొనగంటి యోసేపు, భోగే మధు, రామ్ సాగర్, కరుణాకర్ పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత




**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలం తుక్యతండాకు చెందిన సబావత్ సాలమ్మకు మంజూరు అయిన రూ. 28వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మంగళవారం జిల్లా గ్రంధాలయ ఛైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్, మండల పార్టీ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్ చేతులమీదుగా అందజేశారు. ప్రభుత్వం అందజేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులతో నిరుపేదలకు ఎంతో మేలు కలుగుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కిషన్‌నాయ్, నాయకులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** పోలీసు శాఖలో సుదీర్ఘ కాలం పాటు సేవలు అందించి,మంగళవారం రోజు పదవీ విరమణ పొందుతున్న డల్లు సింగ్ (ఏఎస్సై),శంకర్(ఏఎస్ఐ),మారుతి (ఏఎస్సై),నారాయణ(ఏఎస్ఐ)లను జిల్లా ఎస్పి డా.జి.జానకి షర్మిల జిల్లా పోలీసు కార్యాలయంలో వారిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జిలా ఎస్పి మాట్లాడుతూ. 1986 సంవత్సరంలో కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరిని బి.డల్లు సింగ్ (ఏఎస్ఐ)1419)సోన్,40 సంవత్సరాలు,అలాగే 1990 సంవత్సరంలో కానిస్టేబులవగా పోలీసు శాఖలో చేరిన జి.శంకర్ (ఏఎస్ఐ 408) లోకేశ్వరం 36 సంవత్సరాలు 1990 సంవత్సరంలో కానిస్టేబుల్‌గా పోలీసు శాఖాలో చేరిన జెడ్.మారుతి(ఏఎస్ఐ 2355)బైంసా రూరల్‌లో 37 సంవత్సరాలు,1989 సంవత్సరంలో కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరిన బి.నారాయణ రెడ్డి(ఏఎస్ఐ)1658) లక్ష్మణచాందలో 37 సంవత్సరాలు,వీరందరూ సుదీర్ఘ కాలం పాటు అంకితభావంతో సేవలు అందించి మంగళవారం రోజు పదవీ విరమణ చేశారని అన్నారు.వారు పోలీసు శాఖకు అందించిన సేవలను కొనియాడుతూ,విధి నిర్వహణలో అయన చూపిన నిబద్ధత,క్రమశిక్షణ,బాధ్యతాయుత సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.అలాగే వారి ఆరోగ్యం,కుటుంబ పరిస్థితి గురించి అప్యాయంగా అడిగి తెలుసుకుని,భవిష్యత్తులో మంచి ఆరోగ్యం,శాంతియుత జీవితం గడపాలని శుభాకాంక్షలు తెలిపారు.ఈ సన్మాన కార్యక్రమంలో జిల్లా ఎస్పి డా.జి జానకి షర్మిలతో పాటు ఏవో యూనుస్ అలీ,పోలీస్ ఆఫీసర్స్ అధ్యక్షుడు విరాసత్ అలీ,సిబ్బంది ఉన్నారు.

# అన్నదాత ఆక్రందన.. ప్రకృతి కన్నెర్ర

గాలివాన బీభత్సానికి కుప్పకూలిన రైతన్న



**ప్రజాపక్షం/నిర్మల్ :** ప్రకృతి పగబట్టిందో ఏమో కానీ.. కంటిపాపలా కాపాడుకున్న పంటను కాలగర్భంలో కలిపేసింది.నిన్నటి వరకు పచ్చని పైరును చూసి మురిసిపోయిన అన్నదాతల కళ్లల్లో ఇప్పుడు కన్నీటి ధారలు ఉప్పొంగుతున్నాయి.నిర్మల్ జిల్లా వ్యాప్తంగా సోమవారం అర్థరాత్రి ఈదురు గాలులతో విరుచుకుపడిన అకాల గాలావాన సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు.ఆకాశానికి చిల్లు పండిందో ఏమో కానీ,ఆ వాన కురిసిన తీరు చూస్తుంటే రైతు గుండె చెరువవుతోంది.చేతికి వచ్చిన పంట నోటి దాకా రాకుండానే మట్టిపాలవ్వడంతో జిల్లాలోని వేలాది మంది రైతులు దిక్కుతోచని స్థితటిలో కొట్టుమిట్లాడుతున్నారు.అప్పులు తెచ్చి పెట్టిన పెట్టుబడి, రేయింబవళ్లు పడ్డ శ్రమ అంతా ఒక్క రాత్రిలోనే గాలిలో కలిసిపోవడంతో రైతన్నల ఆక్రందనలు మిన్నంటుతున్నాయి.

### ఎనిమిది మండలాల్లో ప్రళయం..

జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లో వర్ష ప్రభావం ఉన్నప్పటికి..దిలవార్‌పూర్,సారంగాపూర్,లక్ష్మణచాంద,నర్సాపూర్,నిర్మల్ రూరల్,సోన్,లోకేశ్వరం,కుంటాల మండలాల్లో ప్రకృతి ప్రళయం సృష్టించింది.ఈ ఎనిమిది మండలాల్లో పంట నష్టం ఊహాతీతంగా ఉంది.వందలాది ఎకరాల్లో పంటలు నేలమట్టమై,ఎటు చూసినా ముదరమయమైన పొలాలే దర్శనమిస్తున్నాయి.ఒక్క రాత్రిలో కురిసిన వర్షం ఈ ప్రాంత రైతాంగం జీవితాల్లో చీకటి నింపింది.అప్పులు తీర్చి,గడుపుదామనుకున్న రైతులకు ఇప్పుడు గుండె కోత మిగిలింది.

### మునిగిన పంటలు.. దిక్కుతోచని స్థితిలో రైతులు

జిల్లాలో ప్రధాన పంటలైన మొక్కజొన్న సాగుపై ఈ గాలివాన కోలుకోలేని దెబ్బ తీసింది.జిల్లా వ్యాప్తంగా సు మారు 1,10,000 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయ గా, గాలి ధాటికి పైరు మొత్తం నేలకొరిగింది.కోతకు సిద్ధంగా ఉన్న తరుణంలో ఇలా జరగడం రైతును నిలువునా ముంచేసిది.ముఖ్యంగా 35,000 ఎకరాలకు పైగా సాగు చేసిన సీడ్ జొన్నలు(విత్తన జొన్నలు)సైతం నేలమ ట్టం కావడంతో విత్తన రైతులు లబోదిబోమంటున్నారు.పెట్టుబడుల కోసం లక్షలాది రూపాయలు అప్పులు తెచ్చి, విత్తన కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నా ఇప్పుడు బురదలో కలిసిన పంటను చూసి రోదిస్తున్నారు.

### పూత దశలో వరి..రాలిపోయిన మామిడి

మొక్కజొన్నే కాకుండా,జిల్లాలో సుమారు 35,000 ఎకరాల్లో ,సాగు చేసిన వరి పంటపై కూడా ప్రకృతి కన్నెర చేసింది.ప్రస్తుతం వరి పంట పూత దశలో ఉంది.సరిగ్గా ఈ సమయంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం



కురవడంతో వరి చేలు నేలవాలిపోయాయి.దీనివల్ల దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని వ్యవసాయ నిపుణ్యలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు మామిడి,రైతుల వరిస్థితి వర్ణనాతీతం.కాయ సైజు పెరిగి ,మార్కెట్‌కు పంపేందుకు సిద్ధతవుతున్న తరుణంలో వీచిన బలమైన గాలులకు కాయలు రాలిపోయి చెత్తాచెదారంగా మారాయి. ఎంతో ఆశగా ఎదురుచూసిన మామిడి తోటలు ఇప్పుడు వెలవెలబోతున్నాయి.

### నివేదికలకే పరిమితం కావొద్దు..

జిల్లా వ్యాప్తంగా జరిగిన ఈ భారీ నష్టంపై జిల్లా వ్యవసాయ శాఖాధికారులు ప్రాథమిక అంచనాలు వేస్తున్నట్లు చెబుతున్నారు. అయితే కేవలం ఏసీ రూముల్లో కూర్చుని అంచానాలు వేయడమే కాకుండా,క్షేత్రస్థాయిలో ప్రతి పొలాన్ని పరిశీలించి జరిగింన నష్టాన్ని పారదర్శకంగా నమోదు చేయాలని జిల్లా రైతాంగం వేడుకుంటోంది. ఏటా అకాల వర్షాలు కురిసినప్పుడు అధికారులు సర్వేలు చేయడం పరిపాటిగా మారిందని,కానీ రైతు చేతికి అందే పరిహారం మాత్రం దేవుడెరుగు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దిలావర్‌పూర్ నుండి లోకేశ్వరం వరకు దెబ్బతిన్న ప్రతి ఎకరానికి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పరిహారం ప్రకటించాలి. రైతు జీవితాల్లో వెలుగు నింపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.కేవలం అంచనాలకే పరిమి తం కాకుండా.తక్షణ అర్థిక సాయం అందించి తమను అదుకోవాలని రైతులు అర్తనాదాలు చేస్తున్నారు.అధికారుల సానుకూల నిర్ణయాలే ఇప్పుడు ప్రాణం,పోయబోయే సంజీవని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి భరోసా కల్పించాలని జిల్లా రైతాంగం ముక్త కంఠంతో డిమాండ్ చేస్తోంది.

## రాష్ట్రవ్యాప్తంగా మహిళలు.. రూ.290 కోట్ల ఉచిత ప్రయాణాలు

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** బాన్సువాడ బస్టాండులో ఆర్టీసీ బాన్సువాడ డిపో మేనేజర్ రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం మహాలక్ష్మి పథకం విజయవంతంగా కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు 290 కోట్ల ఉచిత ప్రయాణాలు చేసి 10000ల కోట్లు ఆదా చేసినట్లు బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ సలహాదాఉ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీఠ వేస్తుందని, వారు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా 2023 డిసెంబర్ 09వ తేదీనా ఈ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెపట్టారన్నారు. ఈ పథకం ప్రారంభమైన నాటి నుండి బాన్సువాడ డిపో నుండి 2.42 కోట్ల మంది మహిళలు 90.32 కోట్ల రూపాయలు మహిళలు ఆదా చేసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ పట్టణ ప్రజాప్రతినిదులు, నాయకులు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలపై గ్రామ సభలు నిర్వహించాలి

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**ప్రజాపక్షం/మెదక్ :** ప్రభుత్వం చేపడుతున్న 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2వ తేదీన అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించేందుకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని గ్రామ సభలలో ప్రజా ప్రతినిధులు, ప్రజలు విధిగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో అధికారులను ఆదేశించారు. గ్రామ సభలను సమర్థవంతంగా నిర్వహించి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పురోగతిని, రైతు భరోసా, రైతు బీమా, రైతు రుణమాఫీ, సాయిల్ హెల్త్ కార్డ్, వ్యవసాయ తదితర ప్రభుత్వ పథకాల గురించి, ప్రజలకు వివరించాలని అన్నారు. గ్రామసభల్లో ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన లబ్దిదారుల వివరాలను పారదర్శకంగా ప్రదర్శించాలని అధికారులకు సూచించారు. గ్రామ సభలు నిర్వహణకు ముందస్తుగానే షెడ్యూల్ తయారు చేసి పంచాయతి కార్యదర్శులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన ప్రాంతంలో గ్రామసభలు నిర్వహణతో పాటు గ్రామంలో ప్రభుత్వం ద్వారా లబ్ది పొందిన లబ్దిదారుల జాబితా చదివి వినిపించాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో జరిగే సభకు అగ్రికల్చర్, ఎడ్యుకేషన్, హౌసింగ్, ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులు, తహశీల్దార్, ఎంపిడిఓ లు తప్పనిసరిగా గ్రామ సభలకు హాజరు కావాలని స్పష్టం . గ్రామ సభకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగ



కుండా టెంట్లు, కుర్చీలు, తీగునీరు ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారి కోసం గ్రామ సభలో ప్రత్యేకంగా దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించాలని కలెక్టర్ సూచించారు.

## మాదకద్రవ్యాల నిరోధానికి సమష్టి కృషి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగంపై గట్టి నిఘా కొనసాగించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి, సీపీ సాయిచైతన్య సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లా స్థాయి సమావేశం జరగగా సీపీ సాయిచైతన్య సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలపై చర్చించి వాటి నిరోధానాకి అవలంభించాల్సిన చర్యలపై అధికారులకు కలెక్టర్, సీపీ దిశానిర్దేశం చేశారు. గడిచిన రెండు మాసాలలో జిల్లాలో ఎక్సైజ్, పోలీసు శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన దాడులు, పట్టుబడిన గంజాయి, అల్ప్రాజోలం ఇతర మత్తు పదార్థాలు, నమోదైన కేసులపై అధికారులు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ యువతను, విద్యార్థులను మత్తుకు బానిసలుగా మారుస్తున్న




మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. పోలీస్, ఎక్సైజ్, రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కమిటీ ఏర్పడి పక్కాగా కృషి చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి, క్లోరల్ హైడ్రేట్, డైజోఫామ్, అల్ప్రాజోలం వంటి మత్తు పదార్థాల రవాణా, విక్రయాలు జరుగుతున్నట్లు గమనిస్తే పోలీసులకు సమాచారమందించాలని టోల్‌ఫ్రీ 1908 కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని సీపీ సూచించారు. మత్తును కలగజేసే ఔషధాలు పక్కదారి పట్టకుండా వాటి వినియోగంపై కూడా పర్యవేక్షణ జరపాలని జిల్లా ఔషధ నియంత్రణ విభాగం అధికారులకు సూచించారు. పాఠశాలలు, కళాశాలలకు 100 మీటర్ల దూరంలోపు సిగరెట్లు, వంటి విక్రయాలు జరగకు ండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ దిలీప్‌కుమార ఆర్డీఓ రాజేంద్ర కుమార్,ఎక్సైజ్ సూపరింటెండెంట్ మ ల్లారెడ్డి, డీఈఓ అశోక్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమీషనర్ దుర్గాప్రమీల, డీటీఓ ఉమా మహేశ్వర్‌రావు, ఔషధ నియంత్రణాధికారిని శ్రీలత, డీయంఅండ్‌హెచ్‌ఓ రాజశ్రీ, డీడబ్ల్యుఓ పద్మ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉన్న సిఎం

50 శాతం ఫిట్మెంట్ తో పిఆర్‌సి వెంటనే ప్రకటించాలి

పిఆర్‌టియు రాష్ట్ర అధికార ప్రతినిధి మహేందర్ రెడ్డి

**ప్రజాపక్షం / గజ్వేల్:** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పిఆర్టియు ముందుండి పోరాటం చేస్తుండగా, ఇప్పటికే వివిధ సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి ముందుంచినట్లు పిఆర్టియు రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. వర్గల్ మండలం మజీద్ పల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గాయత్రీ దేవి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మండల శాఖ బాధ్యులు చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఐదు దశాబ్దాల సంఘ ఆవిర్భావం నుండి ఉపాధ్యాయులకు మెరుగైన సౌకర్యాలు, ఎన్నో రాయితీలు కల్పించిన ఘనత మన సంఘానికి దక్కుతుందని స్పష్టం చేశారు. సంఘనీడలో ఉన్న ప్రతి ఉపాధ్యాయుడికి అండగా ఉంటుండగా, నిబద్ధత, కర్తవ్య నిష్టతతో విశిష్ట సేవలందించిన సంఘం ప్రతి ఉపాధ్యాయుడికి గౌరవం, గుర్తింపు తెచ్చిందని తెలిపారు. కాగా 50 శాతం ఫిట్మెంట్ తో ప్రభుత్వం వెంటనే పిఆర్సి ప్రకటించాలని డిమాండ్ చేశారు. మండల విద్యాధికారి సునీత, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, పిఆర్టియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇంద్రసేనా రెడ్డి, శశిధర శర్మ, మండల ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి పాల్గొన్నారు.


## రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రైతులు యూరియా వాడకం తగ్గించాలని అ వసరమున్న మేరకు మాత్రమే వాడాలని పీఏసీ చైర్మన్, స్పెషల్ ఇన్‌చార్జి దేవకళ అన్నారు. మంగళవారం ధర్పల్లి మండలంలోని హోన్నాజీపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో మహాజన సభ నిర్వహించారు. జమ ఖర్చులపై సీఈఓ గంగానర్సయ్య చదివి వినిపించారు. రైతుకు ఆన్‌లైన్ ద్వారాయూరియా బుక్ చేసుకోవటం ఇబ్బందిగా మారిందని, రైతులకు సరిపడా ఎరువులు, మందులు అందించాలని కోరారు. చాలామంది రైతులకు రుణమాఫీ కాలేదని అధికారులకు తెలిపారు. ఈ ఉద్దేశ్యంతో ప్రభుత్వం అవసరం మేరకు రైతులకు అందేలా యాప్ తీసుకరావటం జరిగిందని అధికంగా వాడటంతో అందులో పండించిన ధాన్యంతో అనర్థాలు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం యూరియా వాడకం తగ్గించేలా చూస్తుందని, అందులో భాగంగా యూరియా కొంత కొరత ఏర్పడుతుందన్నారు.నానో యూరియా వాడకంతో ఎంతో ఉపయోగముందని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది మహ్మద్‌అలీ, వాల్గోట్ వినోద్, గంగామోహన్ రైతులు పాల్గొన్నారు.

## అకాల వర్షం బీభత్సం: కుప్పకూలిన అన్నదాత ఆశలు

మంచిర్యాల జిల్లాలో ఈదురు గాలుల ధాటికి నేలపాలైన వరి, మామిడి

**ప్రజాపక్షం / మంచిర్యాల :** మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా సోమవారం అర్ధరాత్రి వీచిన ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం తీవ్ర విషాదాన్ని నింపింది. ఒక్కసారిగా వాతావరణం మారిపోయి గాలివాన విరుచుకుపడటంతో వరి, మొక్కజొన్న, మామిడి, కూరగాయల తోటలు పూర్తిగా దెబ్బతిన్నా యి. ముఖ్యంగా మందమర్రి, నెన్నెల, భీమారం, జన్నారం, హాజీపూర్ మండలాల పరిసరాల్లో చేతికొచ్చిన మామిడి పంట రాలిపోయి రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి, మొక్కజొన్న పంటలు బలమైన గాలులకు నేలకొరిగాయి. ఎంతో కష్టపడి సాగు చేసిన పంటలు కళ్లముందే నాశనం కావడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో గాలివాన ధాటికి రహదారులపై భారీ వృక్షాలు విరిగిపడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అనేక గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు వంగిపోవడంతో సరఫరా నిలిచిపోయి ప్రజలు చీకట్లో మగ్గారు. ఉద్యానవన పంటలైన కూరగాయల తోటలు కూడా ఈ గాలుల ధాటికి తలవంచడంతో రైతులకు భారీగా ఆర్థిక నష్టం వాటిల్లింది. పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జిల్లావ్యాప్తంగా జరిగిన పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో అంచనా



వేయాలని రైతులు కోరుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పర్యటించి నష్టాన్ని లెక్కగట్టి తగిన పరిహారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పాలక కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు ప్రతిపక్ష నేతలు చొరవ చూపి రైతులకు అండగా నిలవాలని కోరుతున్నారు.

## గోదావరి పుష్కరాలకు పటిష్ఠ ఏర్పాట్లు

రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/నిర్మల్ :** బాసర క్షేత్రన్ని అధ్యాత్మిక ఆహ్లాదక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని రా ష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అన్నారు.త్వరలో బాసర ఆలయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రానున్నందున, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏ ర్పాట్లపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి ఆయన సమీక్షించారు.ముందుగా పలు నిర్మాణాలు చేపట్టబోయే ప్రాంతాలను పరిశీలించారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో పలు నిర్మానాలకు సంబంధించి శంకుస్థాపనలు చేసే ప్రాంతాలను చేశారు.పనుల ప్రారంభోత్సవాల ఏర్పాటుకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆయనఅన్నారు.అనంతరం ఆలయంలో ముఖ్యమంత్రి నిర్వహించు పూజలకు సంబంధించి వివరాలను చర్చించారు.అతర్వాత దేవాలయ కార్యనిర్వహణ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధింతచి పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు.బాసర ఆలయానికి దేశవ్యాప్తంగాద ఎంతో చారిత్రాత్మక ప్రశస్తి ఉందని, ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టబడి ఉందని అన్నారు.ముఖ్యమంత్రి బాసర పర్యటన అమ్మవారిని దర్శించుకుని,పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని వివరించారు.బాసర క్షేత్రాన్ని అధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిద్దేందుకు చర్యలు తసీఉకుంటున్నట్లు వివరించారు.ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా సకల వసతులను కల్పిస్తామని పేర్కొన్నారు.అధికారులంతా సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని అన్నారు.రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి బాసరలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని తెలిపారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పుష్కర్ ఘాట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఇప్పటి నుంచే అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణ పనులను ప్రారంభించాలని అన్నారు.జిల్లాలో పుష్కరాల నిర్వహణకు సంబంధించి వివరాలన్నింటినీ ఎప్పటికప్పుడు స్వయంగా సమీక్షిస్తానని వివరించారు.అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబందించి అధికారులు నిర్వర్తించాల్సిన బాధ్యతలపై సంబంధిత ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయడానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపార.అలాగే రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి బాసరలో అవసరమైన ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు.సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్.తహసిల్దార్ పవన్ చంద్ర,వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ఏర్పాట్లపై సమీక్ష

**ప్రజాపక్షం/బాల్కొండ :** రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 2న జరిగే గ్రామసభలపై దృష్టి సారించాలన్నారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల కార్యక్రమాన్ని అధికారులు బాధ్యతగా నిర్వర్తించాలని స్పెషల్ ఆఫీసర్ మిషన్ భగీరథ ఈఈ రాకేష్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి, మండల రెవెన్యూ అధికారి శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి గంగామోహన్, ఎంఈఓ బట్టు రాజేశ్వర్, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడి సెంటర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి: సిపిఐ ఫ్లోర్ లీడర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం కార్పొరేషన్ పరిధి 41వ డివిజన్లోని జవహర్ నగర్ 1 అంగన్వాడి సమస్యలను తన దృష్టికి వస్తే వెంటనే పరిష్క రిస్తానని సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కాపురీ సూర్య అన్నారు. మంగళవారం రోజున అంగన్వాడి కేంద్రం లో రామగుండం ప్రాజెక్టు సిడిపిఓ అలేఖ్య సిపిఐ ఫ్లోర్ లీడర్ 41వ డివిజన్ కార్పొరేటర్ మార్కపురి సూర్య ఆధ్వ ర్యంలో అంగన్వాడి సెంటర్లో అన్నప్రాసన, ఇసిసిఇ డే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ మార్కపురి సూర్య మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్లో ఇలాంటి కార్యక్ర మాలు చేయడం వల్ల అంగన్వాడి సెంటర్ లో విద్యార్థుల సంఖ్యను పెంచ డానికి దోహదపడుతుందని, కడుపుతో ఉన్నవారు అంగన్వాడి సెంటర్ కి వచ్చి సెంటర్లో భోజనం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని, ఎక్కువగా అంగన్వాడి సెంటర్‌కి రావడానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్య క్రమంలో మార్కపురి ప్రసన్న లక్ష్మీ, అంగన్వాడి టీచర్లు కె.అరుణ ఎస్.జయసుధ, తల్లులు గర్భిణీలు బాలింతలు మరియు కమిటీ సభ్యులు కాలనీవాసులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యంగా వాహనం నడిపి మృతికి కారణమైన వ్యక్తికి పదేళ్ల శిక్ష

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్:** మద్యం మత్తులో నిర్లక్ష్యంగా వాహనం నడిపి వ్యక్తి మృతికి కారణమైన నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగారా జైలు శిక్షతో పాటు రూ. 5 వేల జరిమానా విధిస్తూ ఒకటవ అదనపు జిల్లా అండ్ సెషన్స్ జడ్జి నారాయణ మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసి క్యూషన్ కథనం ప్రకారం ధర్మపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కుంటాల భీరయ్య 2013 సంవత్సరంలో బీడీలు కొను గోలు చేసేందుకు వెళుతుండగా మారుతి వ్యాన్ వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో భీరయ్య తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందాడు. ప్రమాదా నికి కారణమైన వ్యక్తిని మంచిర్యాల జిల్లా తిలక్‌నగర్‌కు చెందిన వనం అంజయ్యగా ధర్మపురి పోలీసులు గుర్తించి కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ కోటేశ్వర్ నిందితుడిని కోర్టులో ప్రవేశ పెట్టారు, కోర్టు డ్యూటీ అధికా రులు సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కానిస్టేబుళ్లు శ్రీధర్, కిరణ్ కుమార్, రాజులు సరైన సాక్షులను కోర్టులో హాజరు పరిచారు. అదనపు పబ్లిక్ ప్రాసి క్యూటర్ నర్సయ్య కేసు వాధించగా నేరం రుజువు కావడంతో ముద్దాయి అంజయ్యకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

## యాసంగి పంట కాలం పూర్తయ్యేవరకూ పోలాలకు సాగునీరు అందించాలి



**ప్రజాపక్షం/సిద్దిపేట:** యాసంగి పంట కాలం పూర్తయ్యేవరకు పంట పోలాలకు సాగునీరు అందించాలని అన్నపూర్ణ రిజర్వా యర్ నుండి రంగనాయక్ సాగర్ లోకి నీటి పంపింగ్ చేయాలని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర నీటిపా రుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలసి లేఖను అందచేశారు. ఈమేరకు మంగళవారం లేఖను విడు దల చేశారు. సిద్దిపేట నియోజక వర్గంలో గత ఐదు సంవత్సరాలుగా యాసంగి పంటకు నియోజకవర్గం పరిధిలోని రంగనాయక్ సాగర్ కాల్వల ద్వారా రైతులకు పంటపోలాలకు సాగునీరును అందిస్తున్నట్లు తెలి పారు. దానివల్ల రైతులకు మంచి పంట దిగుబడి పెరిగిందన్నారు. రంగనా యక్ సాగర్ కింద ప్రతియేడాది గణనీయంగా పంట ఉత్పత్తి పెరుగుతుం దని లేఖలో పేర్కొన్నారు. ఈ ఏడాది సుమారు 50వేల ఎకరాల్లో పంటసా గులో ఉందని, రంగనాయక సాగర్‌లో ఇటీవల మీరు 2.4 టిఎంసీల నీరు పంపింగ్ చేశారని. ప్రస్తుతం రంగనాయక్ సాగర్ 1.00 టిఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని యాసంగి పంటకు పూర్తి స్థాయిలో నీరు అందించాలంటే ఇంకా 1.5 టిఎంసీల నీరు అవసరం ఉందని లేఖలో పేర్కొన్నారు. కావున అన్నపూర్ణ రిజర్వాయర్ నుండి రంగనాయక్ సాగర్ లోకి నీటిని పంపింగ్ చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించాలని లేఖద్వారా కోరారు. సాగునీరు లేక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, గత ఐదు సంవత్సరాలుగా యాసంగి పంటకు సాగునీరు అందించి విధంగా ఈ యాసంగి పంట కాలం పూర్తయ్యేవరకు రైతులు పంట పోలా లకు సాగునీరు అందించాలని సిద్దిపేట నియోజక వర్గం పక్షాన రైతులకు తరుపున లేఖ ద్వా విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులకు నీటిని పంపింగ్ చేయాలని ఆదేశించారు.

## సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ ఉత్తమ సేవలు అందించాలి: కలెక్టర్




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల నూతన మున్సిపల్ కౌన్సిల్ ప్రజ లకు ఉత్తమ సేవలు అందించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షిం చారు. సిరిసిల్ల మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని మున్సిపల్ కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో మంగళవారం నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్ర వాల్ హాజరై మాట్లాడారు. అందరి సహకారంతో ఇటీవల ఎన్నికలు విజయ వంతంగా పూర్తి చేశామని, నూతన సభ్యులందరికీ అభినందనలు తెలియ జేసారు. బడ్జెట్ మీటింగ్ చాలా కీలకమని, రెవెన్యూ వ్యయంలో భాగంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు, కరెంట్ బిల్లులు, రుణాల చెల్లింపు, పారి శుధ్య పనులకు చెల్లింపులు, ఇతర ఖర్చులు ఉంటాయని, తప్పనిసరిగా 10 శాతం గ్రీన్ బడ్జెట్ ఖర్చు చేయాలని స్పష్టం చేశారు. మున్సిపల్ కు రావా ల్సిన పన్నులు 100 శాతం వసూలు చేయడంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముందుకు వెళ్తే 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు అవుతా యని వెల్లడించారు. మున్సిపల్ వార్డ్ సభ్యులు తమ పరిధిలో ఇంటి, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేసేందుకు సహకరించాలని, అన్ని షాప్ లు లైసెన్స్ తీసుకునేలా చూడాలని సూచించారు. మున్సిపాలిటీకి చెందిన ఖాళీగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ గదులు అద్దెకు ఇచ్చేందుకు మరో సారి టెండర్లు పిలువాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, వైస్ చైర్మన్ దార్ల సందీప్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, తహసీల్దార్ మహేష్ కుమార్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# అకాల వర్షంతో రైతన్నలకు అపార నష్టం

గాలి వానకు నేలరాలిన మామిడికాయలు
నేలకొరిగిన మొక్కజొన్న చేతికొచ్చిన పంటలు దెబ్బ తినడంతో అన్నదాతలు ఆందోళన
ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్న రైతులు



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** ప్రకృతి ప్రతాపానికి రైతులు ఆరు గాలం కష్టపడి పండించిన పంట నేలపాలైంది. పంట లను కాపాడుకునేందుకు నానా తండాలు పడుతున్న రైతులను సోమవారం అర్ధరాత్రి ఈదురు గాలులు ,ఉరు ములతో కూడిన వర్షం రావడంతో చాలా చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని గ్రామాల్లో సోమవారం అర్ధరాత్రి గాలి దుమారంతో కూడిన అకాల వర్షం రైతులను నిలువుగా ముంచింది. మామిడి, మొక్కజొన్న రైతులను కోలుకోకుండా చేసింది. కొన్ని గ్రామాల్లో నువ్వు పంట కూడా నేల పాలయింది. సోమవారం రాత్రి వచ్చిన గాలులకు మొక్కజొన్న నేలవా లగా, మామిడికాయలు రాలిపోయాయి. కళ్ళల్లో ఆరబో సిన పసుపు తడిసింది. కోత కోసి అమ్మే దశలో మొక్క జొన్న, అసలే అంతంత మాత్రం కాపుకొచ్చిన మామిడి ఈదురు గాలులకు వర్షార్పణం అయ్యాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. చేతికొచ్చిన మొక్కజొన్న దెబ్బ తినడంతో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి.. కష్టపడి పండించిన పంటలు కండ్ల ముందే నేల వాడడంతో మండల రైతాంగం లబోదిబో మంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో వరి పంట పొట్టకు వచ్చి ఉండడం మరికొన్ని ప్రాంతాల్లో 20 రోజుల్లో సిద్ధంగా ఉండడంతో అకాల వర్షం వల్ల దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన పడుతు న్నారు. వచ్చే రెండు రోజులు కూడా ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసే అవకాశం ఉందని వాతా వరణ శాఖ అధికారులు చెబుతుండటంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలులతో అకాల వర్షానికి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం సాయం అందించి తమను ఆదుకోవాలని రైతులు కోరు తున్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు సహాయం అందేలా చూడాలని మంత్రి లక్ష్మ ణ్ కుమార్‌ను కోరారు. క్షేత్రస్థా యిలో వ్యవసాయ అధికారులు పర్యటించి నష్టపోయిన పంట వివరాల నివేదికలు తయారుచేసి జిల్లా అధికారు లకు అందించి పరిహారం అందించాలని మండల రైతులు కోరుతున్నారు.

**ఈదురుగాలులతో వర్షం.. నేలకొరిగిన వరి**

**కథలాపూర్ :** మండలంలోని గ్రామాల్లో మంగళవారం వేకువజామున ఈదురుగాలులతో కూడిన వర్షం కురి సింది. పలు గ్రామాల్లో వరి పంట నేల వాలింది. భూష ణరావుపేట గ్రామ శివారులో గడ్డం రాజేశ్వర్ రెడ్డికి చెందిన 6 ఎకరాల వరి పంట చేతికందే సమయంలో నేల వాలడంతో పంట చేను వద్ద రోదించిన తీరు తోటి



రైతులను కలిచివేసింది. అనుకోకుండా భారీ వర్షం కురి వడంతో వరి పంటకు నష్టం వాటిల్లిందని రైతులు తల్లడి ల్లుతున్నారు.

**చేతికొచ్చిన పంటలు నెలవాలాయి**



**మల్లాపూర్:** సోమవారం అర్ధరాత్రి వేళ కురిసిన అకాల వర్షానికి విచిన భారీ ఈదురుగాలులకు చేతికొచ్చిన పంటలు నేలవాలి అన్నదాతలను కన్నీటి పర్యాతం చేశాయి. పెద్ద మొత్తంలో మొక్కజొన్న, మామిడి, వరి పంట నువ్వు పంటలు నేలకొరగా ఆర్థికంగా నష్టపోయా మని అన్నదాతలు విలవిలలాడిపోతున్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టం అధికారులతో అంచన వేయించి రైతులు నాదుకొని నష్టపరిహారం అందించాలని అన్నదా తలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఏది ఏమైనా అకా రణంగా కురిసిన భారీ ఈదురుగాలులు వర్షాలు అన్న దాత నడ్డి విరిచాయి.

**అకాల వర్షంతో మొక్కజొన్న రైతులకు నష్టం**

**పెగడపల్లి:** పెగడపల్లి మండలలోని వివిధ గ్రామాల్లో గత రాత్రి కురిసిన అకాల వర్షం మరియు ఈదురు గాలులకు మొక్కజొన్న పంట భారీగా దెబ్బతింది. కోతకు సిద్ధంగా ఉన్న పంట ఒక్కసారిగా నేలవాలడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి పెట్టి, పంట చేతికి వస్తుందనుకున్న తరుణంలో అకాల వర్షం తమ ఆశలను అడియాశలు చేసిందని రైతులు వాపోతు న్నారు. ముఖ్యంగా ఈదురు గాలుల ధాటికి మొక్కజొన్న నేలపాలై దిగుబడి పూర్తిగా తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి, వ్యవసాయాధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేయాలని కోరుతున్నారు. దెబ్బతిన్న ప్రతి ఎకరాకు నష్టపరిహారం అందించి, తమను ఆర్థి కంగా ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



## మహాలక్ష్మి పథకం మహిళలకు వరం




**ప్రజాపక్షం/జగిత్యాల :** మహాలక్ష్మి పథకం మహిళలకు ప్రభుత్వం కల్పించిన గొప్ప వరమని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొ న్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జగి త్యాల ఆర్టీసీ బస్సుస్టాండ్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. బస్సుల్లో ప్రయాణం చేసిన మహిళలతో వసతులను అడిగి తెలుసుకుని వారిని షాలువాలతో సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో కలెక్టర్ మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటి వరకు హహిళలకు ప్రయాణ చార్జిలలో రూ. 10వేల కోట్ల ఆదాయం ఆదా అయ్యిందన్నారు. ఈ పథకం ద్వారా మహిళలు తమ రోజువారి ప్రయాణ ఖర్చులను ఆదా చేసుకుని ఈ డబ్బును కుటుంబ అవసరా లకు వినియోగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, డిపో మేనేజర్‌తో పాటు జగిత్యాల ఆర్డీవో మధు సూదన్ తదితరులు ఉన్నారు.

## అకాల వర్షం అపార నష్టం

**ప్రజాపక్షం/చందుర్తి :** మండలం లో సోమవారం అర్ధరాత్రి ఆకస్మి కంగా కురిసిన అకాల వర్షం రైతులకు అపార నష్టాన్ని మిగిల్చింది. భారీ ఉరుములు మెరుపులు ఈదురు గాలులతో అర్ధరాత్రి కురిసిన వర్షం తో చేతికి వచ్చిన పంట నేల రాలి తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రకృతి ప్రకోపంతో నష్ట పోయిన వరి , మామిడి , మెక్కజొన్న ఇతర పంటలను ప్రభుత్వం వ్యవసాయ అధికారులతో సర్వే చేయించి నష్ట పోయిన పంటలకు పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని కోరతూ చందుర్తి మండల రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలుక పెంటయ్య పలువురు రైతులతో కలిసి స్థానిక తహసిల్దార్ కి వినతి పత్రం అందజేశారు.

## సిద్దిపేటలో ఉచిత బస్సుతో రూ.33.389. 12 లక్షల ఆదా

కలెక్టర్ హైమావతి



**ప్రజాపక్షం/సిద్దిపేట:** మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు గణనీయమైన ఆర్థిక ప్రయోజనాలు చేకూరుతున్నందని జిల్లా కలెక్టర్ హైమావతి తెలి పారు. 2023 డిసెంబర్ 9న ప్రారంభించిన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు సుమారు 10 వేల కోట్ల ఆదా చేసుకు న్నట్లు తెలిపారు. మంగళవారం సిద్దిపేట ఐడిఓసి సమావేశ మందిరంలో అన్ని శాఖల మహిళ ఉద్యో గులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈసం దర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో మహిళలకు ప్రత్యేక సంక్షేమ పథకాలు పరిమితంగా ఉండే వని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మహిళల సాధికా రతకు ప్రాధాన్యత ఇస్తూ ఆరు గ్యారంటీలతో భాగంగా ఉచిత ఆర్టీసి బస్సు ప్రయాణం. చేయుత, వంటి అనేక పథకాలు అమలు చేస్తుంద న్నారు. మహాలక్ష్మి పథకం కింద ఉచిత ఆర్టీసి బస్సు ప్రయాణాన్ని రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు 290.27 కోట్ల సార్లు ఉచిత ప్రయాణాన్ని వినియో గించుకొని రూ. 10.012015 కోట్ల రూపాయ లను ఆదా చేసుకున్నారన్నారు. ఒక్క సిద్దిపేట జిల్లా పరిధిలోనే సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్, ప్రజ్ఞాపూర్, దుబ్బాక డిపో ద్వారా 866.66 లక్షల మంది మహిళలు ప్రయాణించి 33389.12 లక్షలను ఆదా చేసుకున్నట్లు తెలిపారు. ఈసంద ర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి , రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు కృతజ్ఞ తలు తెలిపారు. ఈకార్యక్రమంలో డిఆర్డీఓ జయదే వ్‌ఆర్య, జిల్లా సంక్షేమ అధికారి శారధ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూపరాణి, ఉద్యాన వన శాఖ అధికారి సువర్ణ పాల్గొన్నారు.

## మహిళలకు మరింత శక్తినిచ్చిన పథకం 'మహాలక్ష్మి'

మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతోంది: కలెక్టర్ చిత్రా మిశ్రా

**ప్రజాపక్షం/కరీంనగర్:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకం జిల్లా లో విజయవంతంగా అమలవుతోందని జిల్లా కలె క్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. మహిళలకు మరింత శక్తిని అందించిన ఈ పథకం, వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోందన్నారు. ఆర్టీసీలో మహా లక్ష్మి కింద 290 కోట్ల ఉచిత ప్రయాణం ద్వారా పదివేల కోట్ల ప్రయాణ చార్జీల ఆదా అవడంతో కరీంనగర్ బస్టాండ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం వల్ల మహిళలు ఆర్థికంగా ప్రయోజనం పొందడమే కాకుండా, ఉపాధి, విద్య, వైద్యం వంటి రంగాల్లో అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారని పేర్కొ న్నారు. మహిళలు విద్యార్థులు కార్యాలయా లకు పాఠశాలలకు వివిధ పనుల కోసం వెళ్లేం దుకు మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకుం టున్నారని పేర్కొన్నారు. గ్రామ గ్రామానా ఈ పథకం పై మరింత విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆమె సూచిం చారు. జిల్లాలో మహాలక్ష్మి పథకం సక్సెస్‌ఫుల్‌గా అమలవుతూ మహిళల సాధికారతకు బలమైన వేదికగా నిలుస్తోందని కలెక్టర్ వెల్లడించారు. మహా లక్ష్మి పథకం మహిళల ఆర్థిక అభివృద్ధిలో వినూత నమైన మార్పు తీసుకొచ్చిందని తెలిపారు. ఈ పథకం గొప్ప మైలురాయి సాధించిందని మహి




ళలు అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించా లని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిష నల్ కలెక్టర్ రెవెన్యూ లక్ష్మి కిరణ్ ఆర్డిఓ కే.మహే శ్వర్ జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి మెప్మా పీడీ స్వరూపా రాణి ఆర్టీసీ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలోమన్ కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజు, పాల్గొన్నారు.

## పెన్షనర్ల పట్ల ప్రభుత్వ మొండి వైఖరి విడనాడాలి

**ప్రజాపక్షం/కరీంనగర్:** 2024 మార్చి నుంచి రిటైర్మెంట్ అయిన ఉద్యోగులు, ఉపాధ్యాయు లకు రావలసిన బకాయిలు అందక 24 నెలలు గడిచి నప్పటికీ, 250 మంది పెన్షనర్లు చనిపో యినప్పటికీ, సుమారు 1000 మంది పెన్షనర్లు అనారోగ్యం పాలై ఆస్పత్రిలో ఉన్నప్పటికీ, అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష నాయకులు వాయిదా తీర్మానం కోరి చర్చించినప్పటికీ ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి రిటైర్మెంట్ అయిన ఉద్యోగులకు ఉపాధ్యాయులకు రావల సిన బకాయిలు ఏక మొత్తంగా చెల్లించాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి అన్నారు. రిటైర్మెంట్ అయిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం ఎన్ని విజ్ఞప్తులు చేసినా, ఎన్ని పోరాటాలు చేసినా, అన్ని ప్రతిపక్షాలు అసెంబ్లీలో డిమాండ్ చేసిన ప్రభుత్వం బకాయిలు చెల్లించడంలో ఒక




నిర్దిష్టమైన హామీ ఇవ్వపోడాన్ని నిరసిస్తూ ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో కలెక్టర్ కార్యాలయాల ముందు రిటైర్డ్ ఎంప్లా యిస్ అసోసియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనచేపట్టడం జరిగిందన్నారు. 2024 మార్చి నుండి ఇప్పటివరకు రాష్ట్రవ్యా ప్తంగా రిటైర్మెంట్ అయిన 24,678 మంది ఉద్యోగులు ఉపాధ్యాయులకు రావలసిన బకా యిలు జిపిఎఫ్,టీఎస్ జిఎల్ఐ, జిఐఎస్, లీవ్ ఎన్కాష్ మెంట్, కమ్యూటేషన్, గ్రాట్యుటీ, డిఏ బకాయిలు, పిఆర్సి బకాయిలు అందక నానా ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 250 మంది పెన్ష నర్లు చనిపోయినారని అన్నారు. ఇప్పటికి వృద్ధా ప్యంలో అనారోగ్యంతో సుమారు 1000 మంది హాస్పిటల్లో జీవన్మరన సమస్యలతో కొట్టుమిట్టా డుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా మాకు రావలసిన బకాయిలు ఏక మొత్తంగా చెల్లించా లని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ నిరసన కార్యక్రమములో జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకిశాల ప్రభాకర్ రావు, ఆర్థిక కార్యదర్శి కనపర్తి దివాకర్, ఉపాధ్యక్షులు గద్దె జగదీశ్వర చారి, వంగ సుధాకర్, బూరుపల్లి రవీందర్, పేర్యాల భాస్కరరావు, హాజరైనారు.


## జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించండి

రోడ్డు భవనాల శాఖ మంత్రిని కోరిన జగిత్యాల ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/జగిత్యాల:** జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటా యించాలని కోరుతూ రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గంలో అనేక వంతెనలు చెడి పోయినాయన్నారు. రామోజీపేట, రాయికల్, పెంబట్ల బ్రిడ్జిల పనులు పూర్త యినప్పటికి అప్రోచ్ రోడ్ పనులు ఇంకా పూర్తి కాలేదని మంత్రికి వివరించా నన్నారు. సారంగపూర్ పోతారం, జగిత్యాల పోతారం. అంతర్గాం గ్రామా లను కలుపుతూ నూతన రోడ్ల విషయంపై మంత్రితో చర్చించామన్నారు. అలాగే గోవిందు పల్లి, నర్సింగాపూర్, పెరుకపల్లి, సారంగాపూర్, రాయికల్ మండలాల్లో ఉన్న నూతన బ్రిడ్జిల నిర్మాణాలకు టెండర్లు ఆహ్వానించాలని కోరుతూ వినతి పత్రాన్ని మంత్రికి అందజేశానన్నారు. మంత్రి తక్షణమే సాను కూలంగా స్పందించి ఇంజనీర్ ఇన్ చీఫ్‌కు ఆదేశాలు జారీ చేశారన్నారు.

## బల్దియా బడ్జెట్ రూ.312.42 కోట్లు

ప్రశాంతంగా ముగిసిన కరీంనగర్ మున్సిపల్ మొదటి సమావేశం
అధికారుల పనితీరుపై కార్పొరేటర్ల అసంతృప్తి
కరీంనగర్ ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతాం: మేయర్



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ నగరపా లక సంస్థ 2026–2027 ఆర్థిక సంవ త్సరం అంచనాలు, సవరించిన బడ్జెట్ రూ. 312.42 కోట్ల బడ్జెట్ కు, 11 ఎజెండా అంశాలకు పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. వార్షిక బడ్జెట్, సర్వసభ్య సమావేశం మంగళ వారం ప్రశాంతంగా ముగిసింది. నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ కొలగాని శ్రీని వాస్ అధ్యక్షతన, కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు సమక్షంలో జరిగిన బడ్జెట్, సర్వసభ్య సమావేశానికి జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు తెలంగాణ రాష్ట్ర గీతం తో ప్రారంభమైన పాలకవర్గ సమావేశాలు దేశ జాతీయ గీతాలాపనతో ముగిసింది. బడ్జెట్ లో నగరపాలక సంస్థ ఆదాయం నుండి పౌరుగు సేవలు, ఉద్యోగ జీతాలు, పారిశుధ్య నిర్వహణ, రుణ వాయిదాల చెల్లింపులు, 10 శాతం నిధులను సోంత ఆదాయ వనరులు, స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్స్ కేంద్ర ఆర్థిక సంఘం నిధుల నుండి వనమహో త్సవంకు కేటాయించారు. నగరపాలక సంస్థ నిధుల నుండి 1/3 నిధులను విలీన గ్రామాల డివిజన్ ప్రాంతాలు, అభివృద్ధి చెందని ప్రాంతాలు, బలహీన వర్గాల ప్రాంతాలు, మైనారిటీ, మురికి వాడ ప్రాంతాల మౌలిక సదుపాయాల కల్పనకు బడ్జెట్‌లో కేటాయించడం జరిగింది. అంతే కాక మిగిలిన నగరపాలక సంస్థ నిధులను వివిధ వార్డుల అభివృద్ధి పనులకు కేటాయించారు. సర్వసభ్య సమావేశం జీరో అవర్‌లో పాలకవర్గ సభ్యులు డివిజన్ల వారిగా ప్రజలు ఎదుర్కుంటున్న పారి శుధ్యం, మంచి నీటి సరఫరా, లీకేజీలు, ఆస్తి పన్నుల వసూళ్లు వాటి హెచ్చు తగ్గులు, రోడ్లు, డ్రైనేజీలు, సిగ్నల్స్, ప్లాస్టిక్, వీధి కుక్కలు, కోతుల స్వైర విహారం, ఎంక్రోజ్ మెంట్, భవన నిర్మాణ అనుతులు, పార్కుల నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ, స్మశాన వాటికల నిర్వహణ, వన మహోత్సవ నిర్వహణ లాంటి తదితర ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. డివిజన్ల వారిగా పాలకవర్గ సభ్యుల సమ స్యలపై మేయర్, కమీషనర్‌లు వివరణ ఇచ్చారు.



**కరీంనగర్ ను రాష్ట్రంలో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దు–తాం:** మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, కరీం నగర్ నగరాన్ని రాష్ట్రంలోనే ఒక ఆదర్శ నగరంగా తీర్చి దిద్దాలనే లక్ష్యంతో మా పాలకవర్గం పని చేస్తుందని తెలిపారు. నగరపాలక సంస్థ అభివృద్ధి కొరకు 312 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశ పెట్టి పాలకవర్గ సభ్యుల సమ క్షంలో ఆమోదం తెలిపామన్నారు. ప్రవేశ పెట్టిన బడ్జెట్ నగర ప్రజల ఆకాంక్షకు, అభివృద్ధి లక్ష్యాలకు ప్రతి రూపమన్నారు. డివిజన్ల వారిగా సభ్యులు సభ దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించి, విలీన గ్రామాల డివిజన్ల తో పాటు అన్ని డివిజ న్లను సమాంతరంగా అభివృద్ధి చేస్తా మని తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సహాకారంతో కేంద్ర ప్రభుత్వం నిధు లతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నిధులను తెచ్చేందుకు కృషి చేస్తామని, పార్టీలకు అతీతంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నగరాన్ని అన్ని రంగాల్లో అభి వృద్ధి చేసేలా మా పాలకవర్గం పని చేస్తుందని తెలి పారు. నగర అభివృద్ధి కోసం డివిజన్‌కు 10లక్షలు కేటాయించి 66 డివిజన్లకు 6.60 కోట్ల అభివృద్ధి పను లకు కేటాయించి ఆమోదం తెలిపామన్నారు. 50 కోట్ల నిధులను అన్ని డివిజన్ల అభివృద్ధి కోసం వినియోగిస్తా మని తెలిపారు. నగరంలో రోడ్డు ఎంక్రోజ్ మెంట్ సమ స్యలతో, అక్రమ కట్టడాల పై కూడ తగు చర్యలు చేపట్టా లని అధికారులను ఆదేశించామని తెలిపారు. ఈ సమా వేశంలో పాలకవర్గ సభ్యులు,అధికారులు పాల్గొన్నారు.



# వైభవ్ ఊచకోత

## సిఎస్‌కెపై భారీ విజయంతో రాజస్థాన్ బోణీ..!

ఐపిఎల్ పంతొమ్మిదో సీజన్‌ను రాజస్థాన్ రాయల్స్ ఘనంగా ఆరంభించింది. ఆల్ రౌండ్ షోతో చెన్నై సూపర్ కింగ్స్‌ను వణికించిన రాజస్థాన్ 8 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. 128 పరుగుల స్వల్ప ఛేదనలో వైభవ్ సూర్యవంశీ(52), యశస్వీ జైస్వాల్(38 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగారు. వైభవ్ అయితే.. ఫోర్లు, సిక్సర్లతో చెన్నై బౌలర్లను హడలెత్తించాడు. 15 బంతుల్లోనే రికార్డు హాఫ్ సెంచరీతో ఈ చిచ్చరపిడుగు లక్ష్యాన్ని కరిగించగా.. యశస్వీ క్లాస్ ఇన్నింగ్స్‌తో అలరించాడు. తొలుత సిఎస్‌కెను 127కే ఆలౌట్ చేసిన రాజస్థాన్.. వైభవ్ సూర్యవంశీ(52 : 17 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లు) మెరుపులతో స్వల్ప లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. తొలుత బౌలర్లు చెన్నైను 127 కట్టడి చేయగా ఓపెనర్లు ధాటిగా ఇన్నింగ్స్ మొదలెట్టారు. మ్యాట్ హెన్రికి చుక్కలు చూపిస్తూ వైభవ్ సూర్యవంశీ(52) 4, 6 బాదగా యశస్వీ జైస్వాల్ (38 నాటౌట్) చివరి బంతిని బౌండరీ దాటించాడు. అన్షుల్ కంబోజ్ వేసిన ఐదో ఓవర్లో రెచ్చిపోయిన వైభవ్.. రెండు ఫోర్లు, సిక్సర్‌తో 15 పరుగులు పిండుకున్నాడు. పవర్‌ప్లేలో వరుసగా రెండు సిక్సర్లతో 15 బంతుల్లోనే అర్ధ శతకం సాధించాడీ హిట్టర్. అతడి విధ్వంసంతో పవర్ ప్లేలో 74 రన్స్ చేసింది రాజస్థాన్. ఆ తర్వాతి ఓవర్లోనే సర్ఫరాజ్ డైవింగ్ క్యాచ్‌తో సూర్యవంశీ ఔటయ్యాడు. ధ్రువ్ జురెల్(18) వస్తూనే బౌండరీలతో సిఎస్‌కె బౌలర్లను హడలెత్తించాడు. కంబోజ్ ఓవర్లో స్కూప్ షాట్ ఆడాలనుకున్న జురెల్ దురదృష్టవశాత్తూ బంతిని వికెట్ల మీదకు ఆడుకున్నాడు. అప్పటికే రాజస్థాన్ విజయం వాకిట నిలవగా యశస్వీతో కలిసి కెప్టెన్ రియాన్‌పరాగ్(14 నాటౌట్) లాంఛనం పూర్తి చేశారు. నూర్‌అహ్మద్ ఓవర్లో బ్యాక్వర్డ్ పాయింట్ లో పరాగ్ సిక్సర్, హెన్రీ వేసిన 12వ ఓవర్ తొలి బంతిని యశస్వీ స్టాండ్స్‌కి పంపడంతో 8 వికెట్ల తేడాతో రాజస్థాన్ బోణీ కొట్టింది.

గువాహటిలో టాస్ ఓడిన సిఎస్‌కెకు శుభారంభం లభించలేదు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(6)తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన సంజూ శాంసన్(6)ను నంద్రె బర్గర్(226) బౌల్ చేశాడు. డిఫెన్స్ ఆడాలనుకున్న అతడి అంచనా తప్పగా బంతి ఆఫ్ స్టంప్‌ను గిరాటేసింది. ఆ తర్వాతి ఓవర్లో గైక్వాడ్‌ను ఆర్చర్ ఔట్ చేయగా.. ఆయుష్




మాత్రే(0)ను బర్గర్ పెవిలియన్ చేర్చాడు. బర్గర్, ఆర్చర్ విజృంభణతో పవర్ ప్లేలోనే నాలుగు వికెట్లు పడ్డాయి. ఆ దశలో ఇంప్యాక్ట్ ప్లేయర్ సర్ఫరాజ్ ఖాన్(17) జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. కానీ, జడేజా అతడిని ఎల్బీగా ఔట్ చేయగా.. చెన్నై 51కే ఐదు వికెట్లు కోల్పోయింది. ఆవెంటనే సిక్సర్ బాదిన శివం దూబే(6)ను సైతం జడ్డూ ఔట్ చేసి చెన్నైని మరింత కష్టాల్లోకి నెట్టాడు. ప్రధాన ఆటగాళ్లు విఫలమైనా కార్తిక్ శర్మ(18), జేమీ ఓవర్టన్(43)లు గొప్పగా ఆడారు. సందీప్ శర్మ ఓవర్లో బౌండరీతో సీఎస్కే స్కోర్ వంద దాటించాడు ఓవర్టన్. అన్షుల్ కంభోజ్ (7 నాటౌట్) రెండు ఫోర్లు బాదగా.. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో ఓవర్టన్ సిక్స్ బాదగా చెన్నై 127 పరుగులకే ఆలౌటైంది.

## సత్తాచాటిన తెలంగాణ క్రీడాకారులు..

### జాతీయ పారా తైక్వాండోలో 2వ ఓవరాల్ చాంపియన్‌షిప్




నాలుగవ జాతీయ పారా తైక్వాండో పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు చరిత్ర సృష్టించారు. ఈనెల 28, 29 తేదీల్లో బెంగళూరులోని కోరమంగళ స్టేడియంలో జరిగిన పోటీల్లో తెలంగాణ పారా తైక్వాండో అసోసియేషన్ (టీపీటీఏ) ఆధ్వర్యంలో పాల్గొన్న క్రీడాకారులు 3 పసిడి, 2 రజత, 3 కాంస్యాలతో మొత్తం 8 పతకాలు సాధించి జాతీయ స్థాయిలో 2వ ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు. ఎల్లావుల గౌతమ్ యాదవ్ (పీ51), కె.శివ (పీ52), కె.లోకేశ్వరి (పీ33) బంగారు, ఎం.మమత (పీ52), జి.రాజేశ్ (పీ53) వెండి, సాయక్ అబ్దుల్ (పీ52), సి.జ్ఞానేశ్వర్ (పీ52), ఎం.లోకేష్ (కే44 అండర్80 కేజీ) కాంస్య పతకాలు సాధించారు. వీరి విజయం దేశవ్యాప్తంగా పారా క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పారా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎల్లావుల గణేశ్ యాదవ్ అన్నారు.


## పారా ఆర్చర్ ఆఫ్ ది ఇయర్‌గా శీతల్




ఢిల్లీ : భారత యువ పారా ఆర్చర్ శీతల్ దేవీకి అరుదైన గుర్తింపు దక్కింది. 19 ఏండ్ల ఈ జమ్మూకశ్మీర్ అమ్మాయి 2025 సంవత్సరానికి గాను 'పారా ఆర్చర్ ఆఫ్ ది ఇయర్'గా ఎంపికైనట్టు వరల్డ్ ఆర్చరీ ప్రకటించింది. నిరుడు గ్వాంగ్జులో జరిగిన వరల్డ్ పారా ఆర్చరీ చాంపియన్ షిప్ పోటీల్లో స్వర్ణం గెలిచిన మొదటి మహిళా ఆర్మ్లెస్ (చేతులేని) ఆర్చర్‌గా రికార్డులకెక్కిన ఆమె నిలకడగా రాణిస్తుండటంతో వరల్డ్ ఆర్చరీ శీతల్‌కు ఈ అవార్డును ప్రకటించింది. వరల్డ్ చాంపియన్‌లో స్వర్ణమే గాక శీతల్.. పారిస్ పారాలింపిక్స్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లో కాంస్యం, వరల్ చాంపియన్‌షిప్‌లో మహిళల టీమ్ సిల్వర్, మిక్స్‌డ్ టీమ్ కాంస్యంతో సత్తాచాటింది. ఇక 'ఆర్చర్ ఆఫ్ ది ఇయర్'గా టర్కీకి చెందిన ఎమిర్కన్ హేనీ ఎంపికైంది.

మహిళ

# మహిళా సాధికారత దానం కాదు..హక్కు



మహిళా సాధికారత అనేది ఎవరో ఇచ్చే దానం కాదు. మహిళల హక్కు. స్త్రీలకు తమ జీవితానికి సంబంధించిన నిర్ణయాలను స్వయంగా తీసుకునే శక్తి, స్వేచ్ఛ, నమ్మకాన్ని ఇవ్వడాన్ని సూచించే ఈ పదం చాలాకాలంగా అందరూ అంటునే ఉన్నప్పటికీ, వాస్తవ రూపాన్ని దాల్చుకోవడం లేదన్నది నిజం. చాలా కాలంగా సమాజంలో మహిళలు సమాన హక్కులు పొందకుండా వివక్షకు గురవుతునే ఉన్నారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయ హక్కులు, సామాజిక గౌరవం వంటి అనేక రంగాల్లో వారికి అవకాశాలు పరిమితమయ్యాయి. అయితే కాలక్రమేణా ఈ పరిస్థితి మారడం ప్రారంభమైంది. మహిళలు తమ హక్కుల కోసం పోరాడి సమాజంలో సమాన స్థానం పొందడానికి కృషి చేస్తున్నారు. మహిళా సాధికారత అనేది కేవలం మహిళల సమస్య కాదు. అది మొత్తం సమాజ అభివృద్ధికి సంబంధించిన అంశం. మహిళలు శక్తివంతంగా, స్వతంత్రంగా ఉంటే కుటుంబాలు, సమాజాలు, దేశాలు మరింత బలంగా మారుతాయి. అందువల్ల మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ఒక న్యాయసమ్మతమైన మరియు అభివృద్ధి దిశగా తీసుకునే ముఖ్యమైన చర్య. చరిత్రలో చాలా కాలంగా పితృస్వామ్య సమాజ వ్యవస్థ ప్రబలం గా ఉంది. ఈ వ్యవస్థలో పురుషులు కుటుంబం, సమాజంలో ప్రధాన అధికారాన్ని కలిగి ఉన్నారన్నది కాదనలేని నిజం. మహిళల పాత్ర ఎక్కువగా గృహ పనులు, కుటుంబ సంరక్షణకు మాత్రమే పరిమితమవుతున్నది. అనేక దేశాలలో మహిళలకు ఓటు హక్కు కూడా లేదు. వారు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరచలేకపోయేవారు. క్రమంగా, ఈ పరిస్థితికి వ్యతిరేకంగా మహిళలు పోరాటాలు ప్రారంభించారు. మహిళల ఓటు హక్కు కోసం జరిగిన ఉద్యమాలు ప్రపంచవ్యాప్తంగా పెద్ద మార్పులను తీసుకొచ్చాయి. విద్యావకాశాలు పెరగడంతో మహిళలు తమ సామర్థ్యాన్ని నిరూపించడం ప్రారంభించారు. సమాజంలో వారు కేవలం



గృహ పనులకే పరిమితం కావాల్సిన అవసరం లేదని ప్రపంచం గుర్తించింది. పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయని చెప్పలేకపోయినా, చెప్పుకోదగిన మార్పులు సాధ్యమయ్యాయనడంలో అతిశయోక్తి లేదు. ఇక్కడ, మహిళా సాధికారత అంటే ఏమిటనే ప్రశ్న తెరపైకి వస్తుంది. మహిళా సాధికారత అంటే మహిళలకు సమాన హక్కులు ఇవ్వడం. వారు తమ జీవితాన్ని స్వతంత్రంగా నిర్మించుకునే అవకాశాన్ని కల్పించడం. ఇది విద్య, ఉద్యోగం, ఆర్థిక స్వాతంత్ర్యం మరియు నిర్ణయాధికారాన్ని కలిగి ఉండటాన్ని సూచిస్తుంది. ఒక మహిళకు విద్య ఉంటే ఆమెకు తన జీవితంపై నియంత్రణ పెరుగుతుంది. ఆమె తన కుటుంబం, సమాజంలో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోగలుగుతుంది. సాధికారత పొందిన మహిళలు తమ పిల్లలకు మంచి విద్యను అందించడానికి ప్రయత్నిస్తారు. వారు కుటుంబ ఆరోగ్యం, ఆర్థిక స్థిరత్వాన్ని మెరుగుపరుస్తారు. మహిళా సాధికారత ఒక వ్యక్తిగత ప్రయోజనంగా మాత్రమే కాకుండా, సమాజ మొత్తం అభివృద్ధికి దోహదపడే శక్తిగా మారుతుంది.

## పడవ నడుపుతూ

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సూరజ్‌పూర్ జిల్లా లో ఉదయం సూర్యకిరణాలు నీటి మీద మెరుస్తుంటే, ఒక చిన్న మోటార్ బోటు నెమ్మదిగా సరస్సు మీద ప్రయాణం మొదలుపెడుతుంది. సాధారణంగా అలాంటి బోట్లను పురుషులే నడిపిస్తారు. కానీ, ఇక్కడ దృశ్యం వేరుగా కనిపిస్తుంది. ఆ బోటును ఒక మహిళ నడిపిస్తుందే. ఆ సాహసికురాలే పూజా సాహు. నిన్నమొన్నటి వరకూ ఆమె ఒక సాధారణ గ్రామీణ మహిళ, కానీ ఇప్పుడు ఆమె కథ అసాధారణ ప్రేరణ. 'ఇప్పుడు నన్ను నా భర్త పేరుతో కాదు..'బోటింగ్ వాలి దీదీ అనే పేరుతో పిలుస్తారు' అంటున్నప్పుడు ఆమె కళ్లలో కనిపించే ఆత్మవిశ్వాసానికి ఎవరుఖరీదు కట్టగలరు? ఈ ఒక్క మాటలోనే ఆమె జీవిత మార్పు మొత్తం దాగి ఉంది. కొన్ని సంవత్సరాల క్రితం వరకు పూజా జీవితం సాధారణ గృహ పనులకే పరిమితమైంది. నిర్ణయాలు ఇతరుల చేతుల్లో ఉండేవి. తనకంటూ ఒక గుర్తింపు ఉండాలనే ఆలోచన కూడా దూరమైన కలలా అనిపించేది. కానీ పరిస్థితులు మారాయి, అవకాశాలు తలుపు తట్టాయి. ఒకప్పుడు బొగ్గు గని ఉన్న ప్రాంతాన్ని శాస్త్రీయ పద్ధతిలో పునరుద్ధరించి రూపొందించిన కెనాపారా ఎకోటూరిజం పార్క్ ఆమె జీవితానికి కొత్త దిశ ఇచ్చింది. సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్ అభివృద్ధి చేసిన ఈ పార్క్ ఇప్పుడు ప్రకృతి, ఉపాధి, గ్రామీణ అభివృద్ధి కలిసిన కేంద్రం



గా నిలిచింది. పెద్ద నీటి వనరు, తేలియాడే రెస్టారెంట్, చేపల పెంపకం, బోటింగ్ వంటి కార్యకలాపాలు స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయి. ఈ బోటింగ్ సేవలను నిర్వహించే శివ శక్తి మహిళా గ్రామ సంఘటన్ స్వయం సహాయక సంఘంలోని 12 మంది మహిళల్లో పూజా ఒకరు. మొదటిసారి బోటు స్టీరింగ్ పట్టుకున్నప్పుడు ఆమెకు భయం కలిగింది. కానీ ప్రతి రోజు సాధన ఆమెకు నమ్మకాన్ని ఇచ్చింది. ఇప్పుడు ఆమె నైపుణ్యంతో బోటును నడుపుతూ పర్యాటకులను సురక్షితంగా తీసుకెళ్తుంది. రోజుకు సుమారు రూ.200 సంపాదిస్తూ, తన జీవితంపై తానే నిర్ణయాలు తీసుకునే స్థితికి చేరుకుంది. 'ఇప్పుడు నా ఫోన్‌లో డబ్బు ఉంటుంది. నాకు నచ్చిన భోజనం తింటాను, నచ్చిన బట్టలు కొనుగోలు చేస్తాను' అని ఆమె చిరునవ్వుతో చెబుతుంది. ఆర్థిక స్వాతంత్ర్యం ఆమెకు ఆదాయంతోపాటు, ఆత్మగౌరవంగా కూడా ఉంది. పూజా కథ ఒక మహిళ ఎదుగుదల మాత్రమే కాదు..అది మార్పు సాధ్యమని నిరూపించే ఉదాహరణ. ఎవరో ఒకరిపై ఆధారపడే జీవితాన్ని గౌరవంతో కూడిన స్వయం ఆధారిత జీవితంగా మార్చుకోవచ్చునని ఆమె చేతల్లో చూపించింది. 'ఇంటి గడప దాటి బయటికి రండి. ఆర్థికంగా స్వతంత్రంగా మారండి.' అని ఆమె తనలాంటి గ్రామీణ మహిళలకు స్పష్టమైన సందేశమిస్తున్నది. ఈ రోజు సరస్సు మీద సాగుతున్న ప్రతి బోటు ప్రయాణం, ఒక మహిళ తన భయాలను జయించి గుర్తింపును సృష్టించుకున్న ప్రయాణానికి ప్రతీకగా నిలుస్తోంది.

అవకాశం దొరికితే సాధారణ మహిళ కూడా అసాధారణ మార్పునకు నాయకురాలవుతుందని పూజా సాహు కథ మనకు స్పష్టం చేస్తున్నది.

# హామీల అమలుకు పోరాటాలకు సిద్ధంకావాలి

### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా పిలుపు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** హామీల అమలుకు పోరాటాలకు సిద్ధం కావాలి సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీ దేవిపల్లి మండలం లోతువాగు ఎస్ఆర్ గార్డెన్స్‌లో మంగళవారం జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సబ్బండ వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు, రైతు రుణ మాఫీ తూతూ మంత్రంగా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, కార్మికుల హక్కులను కాలరాస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సేవ్ సింగరేణి పేరుతో సోమవారం సింగరేణి ప్రధానకార్యాలయం ముట్టడి కార్యక్రమం విజయవంతమైందని, దీంతో ప్రభుత్వానికి తమ సత్తా ఎంటోచాటామని తెలిపారు. సింగరేణి కార్మికుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత పాలకుల విధానాన్ని అవలంభిస్తోందని ఆరోపించారు. రాజకీయ సయోధ్యకు తాము కట్టుబడే ఉన్నామని, కానీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేసేందుకు వెనుకంజ వేసేదే లేదన్నారు. కార్మికులు, రైతులు, మహిళలు, విద్యార్థులు, జర్నలిస్టుల సమస్యలపై ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తన గళాన్ని అసెంబ్లీ లో వినిపిస్తున్నారని, చట్టసభల్లో మన ప్రాతినిధ్యం పెంచుకునేందుకు కృషిచేయాలన్నారు. గడిచిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటిరిగా బరిలోకి దిగి తమ సత్తా ఎంటో చాటామని, కమ్యూనిస్టులను తక్కువ చేసి చూసిన, మాట్లాడిన వాళ్లు నోళ్లు ఎల్లబెట్టుకునే ఫలితాలు సమిష్టిగా రాబట్ట గలిగామన్నారు. రానున్న జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగిద్దామని సాబీర్ పాషా పార్టీ శ్రేణులకు కోరారు. అమెరికా సామ్రాజ్యవాద యుద్ధ పోకడలు ప్రపంచ శాంతికి పెనుప్రమాదంగా మారిందని, దేశంలో యుద్ధం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నప్పటికీ దేశ ప్రధాని నరేంద్ర మోదీ నోరుమెదపక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. విదేశాంగ విధానానికి కట్టుబడ్డ మోదీ మానవీయ కోణాన్ని మరిచారన్నారు. ఈ యుద్ధ కారణంగా ధరలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ ధరలతో పాటు ఇతర నిత్య వసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో 3 వేల మంది మావోయిస్టులను ప్రభుత్వం హతమార్చిందని, కేంద్ర పోకడల కారణంగా అనేక మంది లొంగిపోతున్నారని చెప్పారు. చర్చలకు రానివ్వకుండా మారణ హోమం సృష్టిస్తూ భయానక వాతావరణాన్ని కల్పించారన్నారు. మావోయిస్టు రహిత భారతాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పిన కేంద్రం ఆ దిశగా సత్ఫలితాలు సాధించామంటూ చెప్పుకుంటుందన్నారు. అడవుల్లో నిక్షిప్తమైన ఉన్న సహజ వనరులను దోచుకునేందుకు కేంద్రం మావోయిస్టులను అడవుల నుండి బయటకు పంపుతోందని, అదానీ, అంబానీలకు అక్కడి సంపదను కారు చౌకగా కట్టబెట్టేందుకు బిజెపి చూస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వాల పనితీరుపై ప్రశించే వారిని అర్బన్ నక్సలైట్లు అంటూ ముద్రవేసి వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. జి.వీరస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర రావుతో పాటు కె.సారయ్య, సరెడ్డి పుల్లారెడ్డి, మిర్యాల రంగయ్య, మున్నా లక్ష్మి కుమారి, ఎస్‌డి సలీం, సలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాస రావు, వాసిరెడ్డి మురళీ, మువ్వా వెంకటేశ్వర రావు, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, రేసు ఎల్లయ్య, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, అడుసుమిల్లి సాయిబాబా, ఎస్‌కె.ఫహీమ్‌దాదా, డి.శంకర్, బంధం నాగయ్య, మండల కార్యదర్శులు, జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం



### సిపిఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఇంటింటికి సిపిఐ కార్యక్రమంతో ముందుకు వెళ్తున్నామని సిపిఐ మహబూబ్‌నగర్‌జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఇంటింటికీ సిపిఐ కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం బాలకిషన్ మాట్లాడుతూ ఏప్రిల్ ఒకటో తేది నుండి పదో తేదీ వరకు జరిగే ఇంటింటికీ సిపిఐ కార్యక్రమం ద్వారా ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకుని, ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వాలపై పోరాటం చేస్తామన్నారు. గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తున్న పార్టీ సిపిఐ అన్నారు. ఇంటింటికీ సిపిఐ కార్యక్రమాన్ని పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని బాలకిషన్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం ఏప్రిల్ 1వ తేది నుండి 10వ తేది వరకు జిల్లా వ్యాప్తంగా ఇంటింటికీ సిపిఐ పేరుతో కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమానికి సిపిఐ సానుభూతిపరులు ప్రజలు మద్దతు ఇచ్చి పార్టీ శ్రేణులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేష్, కె.పద్మావతి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాంద్ భాషా, జి.సత్యనారాయణరెడ్డి, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మ ణ్, రాజశేఖర్, శేఖర్, సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు సుందర్ రాజు, వీరేంద్ర కుమార్, మల్లేశ్వరి, రామేశ్వరి, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వేతనాలు చెల్లించకుంటే సమ్మెలోకి

### ఎఐటియుసి మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్




**ప్రజాపక్షం/రెబ్బెన :** మిషన్ భగీరథ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం రెబ్బెన తహసీల్దార్ కార్యాలయంలో ఎంఆర్ఐ ఉదయ్ కిరణ్, ఎంపిడిఒ శంకరమ్మకు ఎఐటియుసి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాలు చెల్లించని పక్షంలో బుధవారం నుంచి ఆసిఫాబాద్ సెగ్మెంట్ పరిధిలోని 600 మంది కార్మికులు నిరవధిక సమ్మెకు దిగుతారని హెచ్చరించారు. ఎల్ అండ్ టి యాజమాన్యం వేతనాల చెల్లింపులో కాలయాపన చేస్తోందని, దీనివల్ల కార్మికులు కుటుంబాలను పోషించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కార్మికుడికి చట్ట ప్రకారం బోనస్ చెల్లించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పెట్రోల్ అలవెన్స్, మొబైల్ బిల్లులను కంపెనీయే భరించాలని, సమానపనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వమే గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని, జాతీయ పండుగలకు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని, ఇపిఎఫ్, ఇఎస్ఐ వివరాలను కార్మికులకు వెల్లడించాలని కోరారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు కలీమ్, కార్యదర్శి దుర్గాజి, సాయి, గోపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, పట్టాలివ్వాలి

### సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారథి డిమాండ్

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న అర్హులయిన పేదలకు పట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి. విజయసారథి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ మహబూబాబాద్ జిల్లా కౌన్సిల్ సమావేశం సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై విజయసారథి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు కాంగ్రెస్ ప్రభుత్వం కొర్రీలతో అసలైన పేద ప్రజలకు ఇల్లు అందించడం లేదన్నారు. ప్రజలు గుడిసెలు వేసుకుని ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటుంటే వారికి పట్టాలు లేవనే నెపంతో ఇందిరమ్మ ఇల్లు అందించడం లేదన్నారు. గత ప్రభుత్వం జిఒ 58 కింద పట్టాలు ఇస్తామని ఇవ్వ లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పట్టాలు ఇవ్వడం లేదని విజయసారథి ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జిఒ 58 పట్టాలు రాక సుమారు 7నుండి 8 వేల మంది ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారని తెలిపారు. ఈ ప్రభుత్వమైనా పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న వారు సకాలంలో బిల్లులు రాక ఆర్థిక భారంతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పేదలు వేసుకొని నివాసం ఉంటున్న వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఇంటి




నెంబర్లు యాజమాన్య ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి ప్రజలను ఆదుకోవాలని కోరారు. సిపిఐ బలోపేతానికి కార్యకర్తలంతా కృషి చేయాలని, రానున్న ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు విజయసారథి పిలుపునిచ్చారు. ఏప్రిల్ 1వ తేది నుండి 10వ తేది వరకు జిల్లా వ్యాప్తంగా ఇంటింటికీ సిపిఐ పేరుతో కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి పోరాటాలు చేయడమే ఇంటింటికీ సిపిఐ లక్ష్యమన్నారు. కార్యక్రమానికి సిపిఐ సానుభూతిపరులు ప్రజలు మద్దతు ఇచ్చి పార్టీ శ్రేణులకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, నాయకులు పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, బైస స్వామి, మారగాని బాలకృష్ణ, మేక వీరన్న, కేదాసు రమేష్, కృష్ణమూర్తి, రమేష్ ,ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలులో ప్రభుత్వం విఫలం

**ప్రజాపక్షం/నర్సంపేట :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమయిందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మేకల రవి విమర్శించారు. సిపిఐ ఖిలా వరంగల్ మండల సమితి సమావేశం శివనగర్ తమ్మర భవన్‌లో ఓర్సు రాజు అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా మేకల రవి హాజరై మాట్లాడారు. దేశంలోని పాలకవర్గాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులేనన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి ఆచరణలో అరకొర అమలు చేసి గొప్పలు చెప్పుకుంటున్నాయని ఆరోపించారు. కేంద్రంలో ప్రధాని మోదీ పరిపాలనలో దేశం తిరోగమనానికి వెళ్లిందని, కేవలం ప్రసంగాలు, మాటలు తప్పితే ప్రజలకు చేసేందేమీ లేదని విమర్శించారు. ఇరాన్‌పై యుద్ధం చేస్తున్న అమెరికా, ఇజ్రాయెల్‌ల సామ్రాజ్యవాదం నశించాలని, ఈ యుద్ధం కారణంగా దేశంలో పెరిగిన గ్యాస్, నిత్యావసరాల ధరలను అదుపు చేయటంలో కేంద్రప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి రెండున్నర ఏళ్ల కావొస్తున్న ప్రజాసమస్యలు పరిష్కారంలో జాప్యం కారణంగా రాష్ట్రంలో పూర్తిగా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఏజెండాగా సిపిఐ పోరాడుతుందని, ప్రజా పోరాటాల పార్టీ సిపిఐకి చేయూతనివ్వాలన్నారు. ఏప్రిల్ ఒకటి నుండి పది వరకు సిపిఐ ఇంటింటి మాస్ ఫండ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేకల రవి కోరారు. కార్యక్రమంలో సిపిఐ ఖిలావరంగల్ సహాయకార్యదర్శి తాళ్లపల్లి జాన్ పాల్, మండల కార్యవర్గసభ్యులు సుంకరి భవాని, నల్లతీగల కుమార్, గజవెల్లి చిరంజీవి, ఉప్పల రవి, మండల సమితి సభ్యులు రోళ్ళ యాదమ్మ, జట్టి విజయలక్ష్మి, కుమార్, బాబు, ఖాజా మైనుద్దీన్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు



## కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

నాణ్యమైన ఆహారం, సదుపాయాలపై నిర్లక్ష్యం సహించం

భద్రాద్రికొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాల, అలాగే పడమటి నర్సాపురం గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా స్థాయి, ఆహార నాణ్యత, తాగునీటి సదుపాయాలు, మౌలిక వసతులు, పరిపాలనా వ్యవస్థపై సమగ్రంగా పరిశీలించారు. మొదటగా కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం మరియు జూనియర్ కళాశాలను సందర్శించిన కలెక్టర్, ఎనిమిదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారికి ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులు తీసుకుంటున్న టిఫిన్, భోజన నాణ్యతపై ఆరా తీశారు. మెనూ ప్రకారం ఆహారం అందుతుందా అనే విషయాన్ని నిర్ధారించుకున్నారు. విద్యార్థులతో ఇంగ్లీష్ పాఠ్యపుస్తకాన్ని చదివించి వారి పఠన సామర్థ్యాన్ని పరీక్షించారు. సిలబస్ పూర్తి స్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. డైనింగ్ హాల్, కిచెన్‌ను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఆహారం అందించకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తూ, బీట్‌రూట్ వంటి కూరగాయలు అందించకపోవడంపై సిబ్బందిని ప్రశ్నించారు. విద్యార్థులకు తప్పనిసరిగా నాణ్యమైన, తాజా కూరగాయలతో ఆహారం అందించాలని ఆదేశించారు. విద్యార్థులు చేతులు శుభ్రపరచుకునే ప్రదేశంలో ట్యాపులు లేకపోవడం, మరమ్మతులు చేపట్టకపోవడంపై వివరణ కోరారు. పాఠశాలలో గ్యాస్ సదుపాయం, సిలిండర్ల లభ్యత, వంట సిబ్బంది సంఖ్య, నెలవారీ వ్యయాలపై వివరాలు తెలుసుకున్నారు.అనవసర ఖర్చులను తగ్గించి విద్యార్థుల సౌకర్యాల అభివృద్ధికి నిధులు వినియోగించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యా నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రెండు శాఖల మధ్య వివాదం.. అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం



**ప్రజాపక్షం/కూసుమంచి :** రెండు శాఖల మధ్య వివాదంతో రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది. పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖాధికారుల మధ్య రోడ్డు నిర్మాణంలో ఏర్పడిన వివాదం ప్రయాణికులకు ఇబ్బందులు తెచ్చిపెడుతుంది. కూసుమంచి మండల పరిధిలోని పాలేరు చేపల మార్కెట్ నుండి హట్యాతండా వరకు రూ. 1.22 కోట్లతో రోడ్డు నిర్మించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖాధికారులు ఈ రోడ్డు నిర్మాణంలో కాలువ మట్టిని తవ్వారన్న విషయంలో ఇటు నీటిపారుదల శాఖాధికారులకు, పంచాయతీరాజ్ శాఖాధికారుల మధ్య వివాదం ఏర్పడింది. బిటి రోడ్డు నిర్మాణం పూర్తయినప్పటికి ఇరువైపులా మట్టి పోయకపోవడంతో ద్విచక్ర వాహనదారులు తరచూ కిందపడుతున్నారు. ఎందుకు పూర్తి చేయడం లేదన్న విషయంపై ఆరా తీయగా ఎన్ఎస్‌పి కాలువ మట్టిని రోడ్డు పక్కన పోసేందుకు అక్కడక్కడ కాలువకు ఇబ్బందికరంగా మారడంతో నీటిపారుదల శాఖాధికారులు అడ్డుకున్నారు. కాలువను పెకిలించిన చోట తిరిగి మరమ్మతులు చేయాలని నీటిపారుదల శాఖాధికారులు పట్టుబడుతున్నారు. ఈ రహదారిపై ప్రయాణికులు ఎక్కువగా ద్విచక్ర వాహనాల ద్వారా ప్రయాణిస్తుంటారు. రోడ్డు నిర్మాణాన్ని తక్షణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ డిఈ వంశీని వివరణ కోరగా రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిన మాట వాస్తవమేనన్నారు. ఎన్ఎస్‌పి కాలువను తవ్వింది మేము కాదని ఆ కాలువ తవ్వకాలతో మాకు ఎటువంటి సంబంధం లేదన్నారు. తొందరలోనే కాలువకు గోడ కట్టడమో లేక మట్టి పోయడమో నిర్ణయించి వీలైనంత తొందరగా పనులు చేపడతామని తెలిపారు.

## మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం లకారం ట్యాంక్ బండ్‌పై డిస్ట్రిక్ ఎన్ఆర్ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. డిస్ట్రిక్ ఎన్ఆర్ఐ ఫౌండేషన్, ఖమ్మం కార్పొరేషన్ సహకారంతో లకారం ట్యాంక్‌బండ్ వద్ద ఏర్పాటు చేసిన శుద్ధి చేసిన మంచినీటి కేంద్రం (మినరల్ వాటర్ ప్లాంట్)ను మేయర్ పునుకొల్లు నీరజ, తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ లకారం ట్యాంక్ బండ్‌కు వచ్చే సందర్శకులకు, వాకర్స్‌కు ఉపయోగపడే విధంగా మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, ఎన్ఆర్ఐ ఫౌండేషన్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి




**ప్రజాపక్షం/పాల్వంచ :** వాహన చోధకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని డిఎస్‌పి సతీష్ కుమార్ అన్నారు. పాల్వంచ డిఎస్‌పి కార్యాలయంలో పాల్వంచ పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సంధర్భంగా 200 మంది ఆటో డ్రైవర్లు, లారీ డ్రైవర్లు, ప్రజా రవాణా, వస్తు రవాణా తదితర పలు వాహన డ్రైవర్లకు ట్రాఫిక్ నిభంధనలపై అవగాహన కల్పించారు.హెల్మెట్ వినియోగం, సిటు బెల్ట్ ప్రాధాన్యత, డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాలపై వారికి వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు స్వీయ క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. దీనితో చాలా వరకు ప్రమాదాలను అరికట్టవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ. సతీష్, ఎస్ఐ. తోట నాగరాజు, కళ్యాణ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎందుకీ ఉదాసీనత..ఆధారాలున్నా మౌనమేలా?

వివిధ శాఖల్లో పెరుగుతున్న అవినీతి





**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రభుత్వ ఉద్యోగులు తమ బాధ్యతలను సరిగ్గా నిర్వర్తించనప్పుడు తాము చట్టబద్ధంగా చేయాల్సిన పనికి వ్యక్తిగత డిమాండ్లను నెరవేర్చాలని కోరినప్పుడు ప్రజల నుంచి లిఖిత పూర్వక ఆరోపణలు, మీడియాలో వార్తలు రావడం కొత్త కాదు. ఇందుకు అనుగుణంగా ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి ఆరోపణలకు ఆధారాలు ఉంటే చర్యలు తీసుకోవడం కొత్త కాదు. కానీ ఇప్పుడు ఆరోపణలు వచ్చినా ఉన్నతాధికారులు మౌనంగా ఉంటున్నారని కనీసం స్పందించడం లేదని ఇందులో కొందరు ఉన్నతాధికారులు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి మద్ధతుగా నిలుస్తున్నారన్న ఆవేదన ప్రజల నుంచి వ్యక్తమవుతుంది. పలు ఆధారాలతో కూడిన ఆరోపణలు వచ్చినప్పుడు కూడా ఉన్నతాధికారుల్లో ఉలుకూ పలుకు ఉండడం లేదు. చాలా ఆరోపణలను ఎటువంటి విచారణ లేకుండానే కొట్టి పారేస్తుండగా ఇందులో కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు, ఆర్థిక వనరులుగా మారాయి. లంచం ఇప్పటిది కాకపోయినా కొన్ని శాఖల్లో ఇది శృతిమించిందన్న ఆవేదన సర్వత్రా వ్యక్తమవుతుంది. ఉదాహరణకు ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి రెవెన్యూ అధికారులపైన కొందరు పోలీస్ అధికారులపైనా తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. చాలా మండలాల్లో అక్రమ ఇసుక తరలింపు రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందని ఇసుక రవాణాదారులు నెలవారి చెల్లింపులు చేస్తున్నారన్న ఆరోపణలకు సంబంధించి ఎటువంటి విచారణ ఇంత వరకు సాగలేదు. ఆరోపణలు చేసిన వారిని కానీ, శాఖపరమైన దర్యాప్తు కానీ జరగడం లేదు. దీనితో అధికారుల్లో మనకు ఎదురేముందిలే అన్న భావన పెరిగిపోతుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి పనికి ఒక రేటు కట్టి వసూలు చేస్తున్నారు. మధిర నియోజక వర్గంలో ఒక గిర్దావర్ ధృవపత్రాలకు కూడా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణ మండలం మొత్తం వినవస్తున్నా అది అధికారుల చెవికి తాకకపోవడం శోచనీయం. సంక్షేమ శాఖలో క్షేత్ర స్థాయి అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని సమాచారం. దీనిపై ఉన్నతాధికారులు స్పందించడం లేదు. కొన్ని శాఖల్లో ఆరోపణలు రావడం ఆర్థిక వనరుగా మారింది. ఆరోపణలు వచ్చిన వెంటనే విచారణ పేరుతో క్షేత్రస్థాయి అధికారుల నుంచి పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రక్షాళన జరగాల్సి ఉంది. ప్రతి మండలంలోనూ ఏదో ఒక శాఖలో అవినీతి అధికారులు హల్‌చల్ చేస్తున్నారు. మట్టి, ఇసుక మాఫియా విషయంలో సర్వం తామై వ్యవహరిస్తున్నారు. ఇక ఎక్సైజ్ శాఖ తీరు ఎంత చెప్పినా తక్కువే. బెల్ట్ షాపులు ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నా సిండికేట్లు మద్యం ప్రియులను దోపిడీ చేస్తున్నా స్పందించడం లేదు. పైగా బెల్ట్‌షాపులపై మీడియాలో వార్తలు వస్తే ఆయా ప్రాంతాలకు వెళ్లి హల్‌చల్ చేసి బెల్ట్ షాపుల వద్ద నుంచి వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఉన్నతాధికారులు ఆరోపణలు వచ్చిన వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకుంటే ఈ పరిస్థితి ఎదురు కాదు. అవినీతి నిరోధక శాఖాధికారులు ఇటీవల కాలంలో గణనీయంగా దాడులు చేస్తూ అవినీతి అధికారులను పట్టుకుని కేసులు నమోదు చేసి జైళ్లకు పంపుతున్నారు. 95 శాతం అవినీతి నిరోధక శాఖకు దొరికి వారిలో బాధితుల ఫిర్యాదు మేరకు దాడి చేస్తే తప్ప అవినీతి అధికారులు ఇతరత్రా దొరికిన ఘటనలు లేవు. అధిక లంచం అడిగినప్పుడు లంచం తీసుకుని కూడా మరి కొంత డబ్బు కావాలని కక్కుర్తి పడినప్పుడో బాధితులు అవినీతి నిరోధక శాఖాధికారులను ఆశ్రయిస్తున్నారు. ఆన్‌లైన్ నగదు బదిలీ వచ్చిన తర్వాత తమ స్నేహితులు, కార్యాలయాల్లో పనిచేసే ఇతర సిబ్బంది ఖాతాకు నగదును బదిలీ చేస్తున్నారు. ఎక్కడ ఎవరికి దొరకని రీతిలో లంచం పిండుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఆరోపణలు వచ్చిన వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవడం ప్రారంభిస్తే ప్రభుత్వ కార్యాలయాల్లో సామాన్యులకు ఊరట లభిస్తుంది. లేదంటే ప్రతి పనికి ఎంతో కొంత చెల్లించుకోక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పుడు కంప్యూటరీకరణ జరిగిన తర్వాత అధికారులు పని చేయకుండా తప్పించుకునేందుకు సర్వర్లు పని చేయలేదంటూ ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నారు.ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఫిర్యాదులపై స్పందిస్తే ప్రభుత్వ కార్యాలయాల నుండి ప్రజలకు వీలైనంత త్వరగా పనులు జరగడమే కాకుండా అవినీతికి ఆస్కారం లేకుండా పోతుంది. ఉలుకు పలుకు లేకపోతే క్షేత్ర స్థాయి అధికారుల్లో బరితెగింపు పెరుగుతుంది.

## ఎసిబి వరుస దాడులు.. అవినీతి అధికారుల్లో గుబులు

మొన్న వైరా.. నేడు సత్తుపల్లి




**ప్రజాపక్షం/ ఖమ్మం :** అవినీతి నిరోధక శాఖాధికారులు విస్తృతంగా దాడులు చేస్తుండడంతో అవినీతి అధికారుల్లో గుబులు మొదలైంది. సత్తుపల్లి మున్సిపాలిటీలో మంగళవారం అవినీతి నిరోధక శాఖాధికారులు దాడి చేస్తున్నారన్న సమాచారం అందిన వెంటనే చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ముఖం చాటేశారని సోషల్ మీడియా వేదికగా ప్రచారం మొదలైంది. అవినీతి నిరోధక శాఖాధికారులను ఆశ్రయించే వారి సంఖ్య పెరగడంతో పాటు వివిధ శాఖల్లో అవినీతికి పాల్పడుతున్న వారి క్రమేపి పెరుగుతుంది. గతంలో మాదిరి కాకుండా ప్రతి పనికి సంబంధించి ప్రభుత్వ కార్యాలయాల నుండి అనుమతి పొందాల్సి రావడంతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారి సంఖ్య పెరిగింది. గతంలో భూ వ్యవహారాలు గ్రామాల్లో గ్రామ రెవెన్యూ అధికారుల వద్దనే పరిష్కారమయ్యేవి. జనన, మరణ ధృవపత్రాలు ఇతరత్రా పనులు కూడా గ్రామస్థాయిలోనే జరుగుతుండేవి. భూమి మొదలు చాలా పనులకు సంబంధించి ప్రభుత్వ కార్యాలయాలను ఆశ్రయించాల్సి వస్తుంది. వీటితో పాటే రవాణా, విద్యుత్, రెవెన్యూ, ఎక్సైజ్, సంక్షేమ శాఖ, పోలీస్, వ్యవసాయ, వైద్య, విద్య, పంచాయతీరాజ్ శాఖల్లో పనులకు సంబంధించి లంచం డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పుడు కూడా సాధారణ స్థాయిలో ఎంతో కొంత ముట్టజెప్పి పనులు చేయించుకోవాలన్న ఆలోచన ఉన్న వారి సంఖ్య అధికంగా ఉంది. కాని లంచాలు తీసుకుని కూడా పనిచేయకపోవడం ఒకసారి తీసుకున్న తర్వాత మరల లంచం డిమాండ్ చేయడం పొంతన లేని సమాధానాలు ఇస్తూ ఇబ్బందులు పెడుతున్నప్పుడు మాత్రమే బాధితులు అవినీతి నిరోధక శాఖాధికారులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల్లో నీతి, నిజాయితీలతో పనిచేస్తూ అత్యుత్తమ సేవలు అందించడానికి ప్రయత్నించే వారి సంఖ్య ఇప్పటికీ గణనీయంగానే ఉంది. అటువంటి వారు ప్రతి కార్యాలయంలో ఒకరో ఇద్దరో ఉండబట్టి సామాన్య ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారన్న చర్చ మరో పక్క సాగుతుంది. ఇప్పుడు లంచం డిమాండ్ చేయడం హక్కుగా మారిందన్న భావన ఉద్యోగుల్లో ఏర్పడడం తీసుకున్న తర్వాత కూడా ఇబ్బందులు పెట్టడమే అవినీతి నిరోధక శాఖాధికారులను ఆశ్రయించేందుకు కారణమవుతుంది. కొద్ది రోజుల క్రితం వైరా రవాణా శాఖాధికారి ఘటనలో ఇదే జరిగింది. ఇటుక, మట్టి తరలిస్తున్న కొందరు క్రమం తప్పకుండా చెల్లింపులు జరుపుతున్నప్పటికీ వారిని ఇబ్బందిపెడుతున్న నేపథ్యంలోనే వారు అవినీతి నిరోధక శాఖాధికారులను ఆశ్రయించడం అధికారులు దాడులు చేసి రవాణాధికారి పై కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరిగింది. అవినీతి నిరోధక శాఖాధికారులు దాడులను మరింత విస్తృత పర్చాల్సి ఉంది. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల నుండి ఇబ్బందులు లేని పరిస్థితుల్లో నియమ నిబంధనలకు లోబడి పనులు చేయాల్సిన బాధ్యత తమపై ఉందని అధికారులు గుర్తెరిగితే దాడులు, ఆరోపణలు ఉండవు.

## సాయిరాం తండాలో దుండగుల ఘాతుకం

గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌కు నిప్పు

స్థానిక పోలీసులకు సర్పంచ్, కార్యదర్శి ఫిర్యాదు



**ప్రజాపక్షం/జూలూరుపాడు :** జూలూరుపాడు మండలం సాయిరాం తండాలో గుర్తు తెలియని దుండగులు బరితెగించారు. గ్రామంలో నిత్యం పారిశుద్ధ్య పనులకు ఉపయోగించే గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌కు అర్ధరాత్రి నిప్పు పెట్టి దహనం చేసేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనలో ట్రాక్టర్ చాలా వరకు కాలిపోయి భారీ నష్టం వాటిల్లింది. సోమవారం రోజంతా గ్రామ పారిశుద్ధ్య పనులు, ఇతర అభివృద్ధి పనుల్లో పాల్గొన్న ట్రాక్టర్‌ను సాయంత్రం పని ముగిసిన అనంతరం పంచాయతీ కార్యాలయం ఎదుట నిలిపివేసి సిబ్బంది వెళ్లారు. అయితే అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్ టైర్ వద్ద పట్టా పెట్టి నిప్పు పెట్టారు. మంటలు క్రమంగా వ్యాపించి టైర్‌తో పాటు బ్యాటరీ, ఇంజిన్ వైరింగ్ భాగం పూర్తిగా కాలిపోవడం ప్రారంభమైంది. మంటలు చెలరేగడాన్ని గమనించిన సమీప నివాసితులు వెంటనే గ్రామ సర్పంచ్, ఇతర గ్రామస్తులకు సమాచారం అందించారు. స్థానికులంతా ఏకమై నీళ్లు పోసి మంటలను ఆర్పేయడంతో ట్రాక్టర్ పూర్తిగా దగ్ధం కాకుండా బయటపడింది. అయినప్పటికీ ప్రధాన భాగాలు కాలిపోవడంతో లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాన్ని శుభ్రంగా ఉంచే వాహనంపై ఇలాంటి దాడులకు పాల్పడటంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఈ ఘటనపై సర్పంచ్ బానోత్ సుమలత, పంచాయతీ కార్యదర్శి బి.బాబులాల్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పోలీసు అధికారుల సేవలు మరువలేని

సిపి సునిల్‌దత్



**ప్రజాపక్షం/ఖమ్మంక్రైం :** వివిధ పోలీస్‌స్టేషన్లలో సుదీర్ఘకాలం బాధ్యతలు చేపటి ప్రజలకు, పోలీసుశాఖకు పోలీస్ అధికారుల సేవలు మరువలేనివని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అన్నారు. మంగళవారం స్థానిక కమిషనర్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులను ఆయన సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధ్యతాయుతమైన విధులు నిర్వహించి ఎనలేని సేవలందించారని కొనియాడారు. విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను అభినందించారు. శేషజీవితం కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో ఎస్ఐలు కె.కోడె త్రాచు, ఎస్‌కె మదార్, జి.భీమా, బి.పుల్లారావు, ఏఆర్ ఎస్ఐ బి.హరిబాబు, ఏఎస్సై వి వి చార్యులు, హెడ్ కానిస్టేబుల్ వి.బాబురెడ్డి, హోంగార్డ్ వై .జాన్ ఉన్నారు.

## మహాలక్ష్మి పథకం మహిళలకు వరం

మేయర్ పునుకొల్లు నీరజ

రద్దీకి అనుగుణంగా బస్ సర్వీసులు: ఆర్ఎం సరిరామ్




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం మహిళలకు వరమని ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. మహాలక్ష్మి పథకం ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు 290 కోట్ల ఉచిత ప్రయాణాలు చేసి రూ. 10వేల కోట్ల ప్రయాణ ఛార్జీలను ఆదా చేసుకున్న సందర్భంగా మంగళవారం ఖమ్మం నూతన బస్టాండ్‌లో ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ అధ్యక్షతన అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా అధికారంలోకి వచ్చిన వెంటనే మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించిందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహిళలకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. ప్రధానంగా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారు, చిరుద్యోగ మహిళలకు ఇది ఎంతగానో ప్రయోజనకరంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 290 కోట్ల ఉచిత ప్రయాణాలు చేసి రూ. 10వేల కోట్ల ఛార్జీలను మహిళలు ఆదా చేసుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్ మాట్లాడుతూ 290 కోట్ల ప్రయాణాలు, రూ. 10వేల కోట్ల ఛార్జీలను ఆదా చేసుకున్న సందర్భంగా వేడుకలను నిర్వహించారు. మహిళా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్ సర్వీసులను పెంచామని మహాలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్న మహిళలకు ధన్యవాదాలు తెలిపారు. ఖమ్మం రీజినల్ పరిధిలో 10,16,34,091 మంది మహిళలు ఇప్పటి వరకు ప్రయాణించారని రూ. 492.19 కోట్లు మహిళలు ఛార్జీలను ఆదా చేసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి పథకాన్ని సంపూర్ణంగా సద్వినియోగం చేసుకున్న ఐదుగురు మహిళా ప్రయాణికులను శాలువలతో సన్మానించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డిపో మేనేజర్ ఎం. శివప్రసాద్, అకౌంట్ ఆఫీసర్ జ్యోత్స్న, డిపో సిబ్బంది, మహిళా ప్రయాణికులు పాల్గొన్నారు.

## కరువు కోరల్లోకి...ఏదులాపురం చెరువు

చేపలు పట్టేందుకు తూము ఎత్తివేత

కాలనీలోకి పెద్ద ఎత్తున చేరిన వరద నీరు

ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఎర్రటి ఎండలోనూ నిండు కుండను తలపిస్తున్న ఏదులాపురం చెరువు కరువు కోరల్లోకి నెట్టివేయడుతుందా? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. చెరువులో చేపలు పట్టేందుకు కొందరు చేపడుతున్న చర్యలు స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా చెరువు తూమును ఎత్తివేయడంతో చెరువు కింద ఉన్న కాలనీల్లోకి వరద నీరు చేరిందంటే అతిశయోక్తి కాదు. అంతేకాకుండా నీరు బజార్లపై ప్రవహించి, రాకపోకలకు అంతరాయం కలిగించాయి. కేవలం చేపలు పట్టేవారి కోసం తూమును ఎత్తివేయడం వల్లనీటి వృథా పెరిగి కొరత ఏర్పడి కరువు పరిస్థితులు దాపురించే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు నీటి మట్టం తగ్గిపోతే రాబోయే రోజుల్లో తాగునీటి సమస్య మరింత తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని ఆవేదన చెందుతున్నారు. అంతేకాకుండా ఈ పోకడలతో సుమారు 35గ్రామాలకు మంచి నీరు అం దించే రక్షిత మంచినీటి పథకానికి కూడా ఆటంకం ఏర్ప డే పరిస్థితి నెలకొంది. చెరువులో నీటి నిల్వలు తగ్గిపోతే ఆ పథకం ద్వారా అందే నీటి సరఫరా నిలిచిపోయే ప్రమా దం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పొంచి ఉన్న ముప్పు...**

చెరువు నీటిని వదులుతుండటంతో 35గ్రామాలతో పాటు గ్రౌండ్ వాటర్‌కు కూడా ముప్పు పొంచి ఉన్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికే గ్రామాలకు మంచినీరు అందించే రక్షిత మంచినీటి పథకానికి నీరందడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే వి ధంగా తరచూ తూము ఎత్తివేతలు కొనసాగితే ఏదులాపురంతో పాటు వరంగల్ క్రాస్‌రోడ్డు, పెద్దతండా ప్రాం తాలు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ప్రజలు చెబుతున్నారు. అంతేకాకుండా చెరువు చుట్టూ ఉన్న కాలనీలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొకతప్పదనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అలాగే చేపలు పట్టే వారి ప్రయోజనాల కోసం ప్రజల అవసరాలను పక్కన పెట్టడం సరి అయ్యింది కాదని ప్రజలు ముక్త కంఠంతో ఖండిస్తున్నారు. తక్షణమే ఈ చర్యలను నిలిపివేసి చెరువు నీటిని సంరక్షించాలని అధికారులను కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తూము ఎత్తివేతపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**అధికారులు స్పందించాలి:**
**సిపిఐ కౌన్సిలర్, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి**




చేపలు పట్టేందుకు చెరువు తూము ఎత్తివేయడం వల్ల నీటి కటకటతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయి. కాలనీతో పాటు రోడ్లపై నీరు వృథాగా పోతుంది. తక్షణమే అధికారులు స్పందించి వెంటనే తూము మూసివేసి పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి.

**రక్షిత మంచినీటి పథకానికి ముప్పే..**
**మిషన్ భగీరథ ఎఇ భాస్కర్**



తూముల ద్వారా నీరును వదలితే ఖచ్చితంగా రక్షిత మంచినీటి పథకంపై ముప్పు ఏర్పడుతుంది. 35గ్రామాలకు ఇక్కడి నుంచి వెళ్లే మంచి నీటి సరఫరాకు ఆటంకంగా ఏర్పడి మూతపడే ప్రమాదం ఉంది. దయ చేసి తూముల ద్వారా నీరు వదిలే ప్రయత్నం చేయవద్దు.

**చట్ట పరమైన చర్యలు..**
**కమిషనర్, మున్వర్అలీ**



తూముల ద్వారా నీటిని వదిలితే కేసులు పెట్టి చర్యలు తీసుకుంటాము. నీటి విడుదల విషయం నా దృష్టికి వచ్చింది. దీనిపై సంబంధిత అధికారులకు తెలియజేశాను. పరిశీలన చేసి పోలీస్ కేసు ఫైల్ చేపించాల్సిందిగా సూచించాను.

## గ్రామ పంచాయతీ భవనం మంజూరు పట్ల హర్షం

**ప్రజాపక్షం/నెక్కొండ :** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం మడిపెల్లి గ్రామపంచాయతీకి నూతన గ్రామ పంచాయతీ భవనం మంజూరైన సందర్భంగా గ్రామంలో హర్షాతిరేక వాతావరణం నెలకొంది. ఈ భవనం మంజూరుకు స్థానిక ఎంఎల్ఎ దొంతి మాధవరెడ్డి కృషి కారణమని గ్రామ సర్పంచ్ అనూష వినోద్ లోక్ నాయక్ తెలిపారు. గ్రామాభివృద్ధికి ఎంతో ఉపయోగపడే ఈ భవనం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని ఆయన పేర్కొన్నారు. గ్రామంలో పరిపాలనా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంజూరు పత్రాన్ని వారు విలేకరులకు అందించారు. ఎంఎల్ఎ దొంతి మాధవరెడ్డి కృషిని అభినందిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, తదితరులకు తమ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి ఇలాంటి సహకారం కొనసాగాలని కోరారు.

## సిఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

**ప్రజాపక్షం/నర్సంపేట :** తెలంగాణ అసెంబ్లీలో అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ బిల్ కు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక శాసన సభ్యులు దొంతి మాధవరెడ్డిల చిత్ర పటాలకు నర్సంపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాలాభిషేకం. ఈ సందర్భంగా నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోడిదెల సంజయ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీలో అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ బిల్ ఆమోదం పొందడం ప్రతి న్యాయవాదికి గర్వకారణం. ఈ రోజు సాధించిన విజయానికి వెనుక అనేక సంవత్సరాలుగా న్యాయవాదులు చేసిన నిరంతర పోరాటం, ఉద్యమాలు, త్యాగాలు దాగి ఉన్నాయన్నారు. ప్రతి అడుగు పోరాటంతో, ప్రతి నిమిషం అంకితభావంతో ముందుకు సాగిన న్యాయవాదుల కృషి ఫలితమే ఈ చట్టమన్నారు. ఈ బిల్ ఆమోదం ద్వారా న్యాయవాదుల గౌరవం మరింత పెరిగింది, వారి భద్రతకు ఒక బలమైన హామీ లభించిందన్నారు. ఈ చట్టాన్ని ఆమోదించిన తెలంగాణ అసెంబ్లీకి నర్సంపేట బార్ అసోసియేషన్ పక్షాన హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపారు.

## భద్రకాళి దేవస్థానానికి 50 అడుగులు నూతన ధ్వజస్తంభం

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** భద్రకాళి దేవాలయానికి నూతన ధ్వజస్తంభం ఏర్పాటు చేయాలని పశ్చిమ ఎంఎల్ఎ నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈవో రామల సునీత అనుమతితో భద్రాద్రి జిల్లా పాలవంచ దగ్గర గల వెంకటాపురం ఫారెస్ట్ రేంజ్ జోన్‌లో పాల్వంచ డిఎఫ్ఒ ఆదేశాల మేరకు ఫారెస్ట్ రేంజర్ అధికారి తుల్జా నేతృత్వంలో సుమారు 50 ఫీట్ల ఎత్తుతో తెలంగాణ ప్రాంతంలో అత్యంత అరుదుగా దొరికే నార వేప కర్రతో భద్రకాళి దేవాలయానికి ధ్వజస్తంభం ఏర్పాటు చేయాలని దృఢ సంకల్పంతో భద్రకాళి వ్యవస్థాపక అర్చకులు బండారి శేషయ్యతో భద్రకాళి ట్రస్టు బోర్డు సభ్యులు గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, మోత్కూరి మయూరి రామేశ్వర్, పాలడుగుల ఆంజనేయులు, భారతి వెంకటేశ్వర్లు, పాల్గొని భద్రకాళి దేవాలయ ధ్వజస్తంభ మరో 15, 20 రోజుల్లో దేవాలయానికి చేరేలా చర్యలు తీసుకున్నారు.



## బిఎఐ జాతీయ ఉపాధ్యక్షుడిగా వేములు సత్యమూర్తి

ముంబయిలో అట్టహాసంగా బాధ్యతల స్వీకారం

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** నిర్మాణ రంగంలో తనదైన ముద్ర వేసిన ప్రముఖ పారిశ్రామికవేత్త, శ్రీ సత్యసాయి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ వేముల సత్యమూర్తి ప్రతిష్టాత్మకమైన బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బిఎఐ) జాతీయ ఉపాధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించారు. ముంబాయిలోని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(బాయ్) ప్రధాన కార్యాలయంలో మంగళవారం అట్టహాసంగా జరిగిన నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకారం కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు వేముల సత్యమూర్తి అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. 2025–2026 బాయ్ జాతీయ అధ్యక్షుడు రాజేంద్ర సింగ్ కాంబోజ్ నేతృత్వంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కార్యక్రమంలో 2026–27 సంవత్సరానికి గాను ఎన్నికైన నూతన బాయ్ జాతీయ అధ్యక్షుడు కాన్పూర్‌కు చెందిన ధర్మేష్ అశ్వస్థి, గౌరవ ప్రధాన కార్యదర్శి మొహిందర్ హెచ్. రిజ్వానీ, గౌరవ కోశాధికారి అనిరుద్ధ వి.నఖ్వా, బాయ్ పూర్వ అధ్యక్షులు నోయిడాకు చెందిన లాల్ చంద్ పాషా, తమిళనాడుకు చెందిన మోహన్, బాయ్ పూర్వ జాతీయ ఉపాధ్యక్షులు సచ్చిదానంద రెడ్డి, తెలంగాణ రాష్ట్ర బాయ్ చైర్మన్ రవిందర్ రెడ్డి, పూర్వ అధ్యక్షుడు యు.సురేందర్, దేవేందర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, కరీంనగర్‌కు చెందిన డి.వి.ఎన్.రెడ్డి, మాజీ జాతీయ అధ్యక్షుడు నిమేష్ డి పటేల్, ఈస్ట్ జాతీయ ఉపాధ్యక్షులు కౌశల్ కుమార్ సింగ్ (జమ్షెడ్ పూర్) నార్త్ జాతీయ ఉపాధ్యక్షులు రవీంద్రా త్యాగి (ఘజియాబాద్) సౌత్ వన్ జాతీయ ఉపాధ్యక్షులు వేముల సత్యమూర్తి (వరంగల్) సౌత్ టూ జాతీయ ఉపాధ్యక్షులు ఆర్ ప్రకాష్ (కాంచీపురం) వెస్ట్ జాతీయ ఉపాధ్యక్షులు మహేష్ ఎం.ముడ్డా (ముంబాయి) తదితర కార్యవర్గ సభ్యులకు పూర్వ జాతీయ అధ్యక్షులు రాజేంద్ర సింగ్ కాంబోజ్ నియామక పత్రాలను అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.



## మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**ప్రజాపక్షం/పరకాల :** మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ లభిస్తుందని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం రాష్ట్ర సామాజిక, ఆర్థిక ముఖచిత్రంలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది అని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి హర్షం వ్యక్తం అన్నారు. మంగళవారం పరకాల బస్టాండ్ ప్రాంగణం యందు మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం ద్వారా 10వేల కోట్లు ఆదా అయిన సందర్భంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మహాలక్ష్మి పథకం (ఉచిత బస్సు ప్రయాణం) ను 09 డిసెంబర్ 2023 న ప్రారంభించామని, 29 మార్చి 2026 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 290.27 కోట్ల మహిళలు ప్రయాణించారని రూ.10012.15 కోట్ల ఆదా చేసుకున్నారని తెలిపారు. అనంతరం ఆర్టీసీ ప్రయాణికులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే శాలువాతో ఘనంగా సన్మానించారు.

# వంట గ్యాస్ పక్కదారి



విచ్చలవిడిగా డొమెస్టిక్ సిలిండర్ల వినియోగం
చిరు వ్యాపారుల నుంచి
బడా హోటళ్ల వరకూ వాడకం
మిడిల్ ఈస్ట్ వార్ నేపథ్యంలో
పెరిగిన డిమాండ్
అక్రమ దందాకు కొందరు డీలర్లు,
అధికారుల అండ

**ప్రజాపక్షం/హనుమకొండ :** వంట గ్యాస్ సిలిండర్‌లు పక్కదారి పడుతున్నాయి. రోజు రోజుకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల ఆక్రమ దందా బట్టబయలవుతోంది. ఫుడ్ బిజినెస్‌లో వ్యాపారుల నుంచి స్టార్ హోటళ్ల వరకు నిబంధనలకు విరుద్ధంగా డొమెస్టిక్ సిలిండర్లను అక్రమంగా వినియోగిస్తున్నారు. ఈ దందాకు కొందరు పౌర సరఫరాల శాఖ అధికారులు, కొన్ని ఎల్పీజీ కంపెనీల డీలర్లు కారణమనే వి మర్శలున్నాయి. సాధారణ పరిస్థితుల్లో నిరాటంకంగా సాగే ఈ దందా, మిడిల్ ఈస్ట్ వార్ నేపథ్యం లోనూ కొనసాగడం విశేషం. వార్ ఎఫెక్ట్ నేపథ్యంలో కమర్షియల్ సిలిండర్ల సరఫరా క్లిష్టంగా మారింది. ప్రస్తుతం కొంత వరకు వీటి సరఫరానే నిలిచింది. దీంతో వారు ఫుడ్ స్టిక్ సిలిండర్లపై మరింతగా దృష్టి పెట్టారు. ఇదే అదునుగా ఎల్పీజీ డీలర్లు, వినియోగదారులు అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసి వక్ర మార్గంలో తరలిస్తున్నారు. డొమెస్టిక్ ఎరు పు రంగు, కమర్షియల్ సిలిండర్లు నీలి రంగులో ఉంటాయి. నిబంధనల మేరకు వ్యాపారులు కచ్చితంగా కమర్షియల్ సిలిండర్లనే వాడాలి.

**డొమెస్టిక్‌ను వినియోగంచడం నేరం**
**కదిలిన పౌర సరఫరాల శాఖ**

సంక్షోభ సమయంలో ఫిర్యాదులు రావడం, జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లడం...దీంతో కలెక్టర్ పౌర సరఫరాల శాఖను ఆదేశించడంతో ఎట్టకేలకు తప్పని సరి పరిస్థితులో తప్పడం లేదన్నట్లుగా పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ బృందాలు రంగంలోకి దిగాయి. ఈ క్రమంలో ఇటీవల హనుమకొండలో వివిధ ప్రాంతాల్లో జరిగిన దాడుల్లో వ్యాపారులు అక్ర మంగా వినియోగిస్తున్న డొమెస్టిక్ సిలిండర్లు పట్టుబడ్డాయి. అధికారులు వాటిని స్వాధీనం చేసుకొని సదరు వ్యాపారుల పై కేసులు బుక్ చేశారు.డొమెస్టిక్ సిలిండర్ల అక్రమ వాడకంలో కొందరు వినియో గదారుల దురాశ సహాయకారిగా మారింది. డబుల్ సిలిండర్ కనెక్షన్లు, కుటుంబంలో కనెక్షన్ల సంఖ్య ఎక్కువగా ఉన్న వారు వ్యాపారులకు అధిక మొత్తంలో దండుకొని ఇస్తున్నా రు. ప్రస్తుతం రూ. 964 ఉన్న ఇంటి గ్యాస్ పక్కదారి పట్టి డొమెస్టిక్ సిలిండర్ ను రూ. 2వేలు తీసుకొని వ్యాపారులకు ఇస్తున్నారు. ఇలా పలు

**దొడ్డి దారుల్లో సిలిండర్ల దందా సాగుతోంది**
**అక్రమ వినియోగంపై నగరంలో దాడులు**

డొమెస్టిక్ సిలిండర్ల అక్రమ వినియోగంపై కదిలిన జిల్లా పౌర సరఫరాల శాఖ డీటీలు భద్రునాయక్, వేణుగోపాల్, ఎస్ఐ సదానందం పలు ప్రాంతాల్లో విస్తృతంగా దాడులు జరిపారు. హనుమకొండలోని నయీంనగర్, కిషనురా, కేయూ యూనివర్సిటీ క్రాస్ రోడ్స్, బీమారం, హసన్ పర్తి, పెగడపల్లి క్రాస్ రోడ్స్, కేయు కాజీపేట వంద ఫీట్ల రహదారి, వడ్డెపల్లి చర్చి జంక్షన్, రాంనగర్, ఎక్సైజ్ కాలనీ రోడ్డు, తిరుమలబార్ జంక్షన్ నుంచి వడ్డేపల్లి జంక్షన్ వరకు రోడ్డుకు ఇరు వైపు లా ఉన్న చిరు వ్యాపారులు, హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్,బిర్యానీ సెంటర్లపై జిల్లా పౌర సరఫరాల శాఖ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. దాడుల్లో డొమెస్టిక్ సిలిండర్ల వినియోగం వెలుగు చూసింది. దీంతో అధికారులు సిలిండర్లను స్వాధీ నం చేసుకున్నారు. వ్యాపారులపై కేసులు నమో దు చేశారు. దాడులను మరింత విస్తృతం చేయ నున్నట్లు ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహిస్తూ అక్రమ వినియోగాన్ని అరికడతామని అధికారులు చెబుతున్నారు..

**అధికారులకు తెలిసిందే...**

డొమెస్టిక్ సిలిండర్ల అక్రమ వినియోగం నిరం తరాయంగా జరుగుతున్నదే. పౌర సరఫరాల శాఖ అధికారులకు ఇన్నాళ్లు ఇదేమి తెలియని విషయం కాదు. ప్రతి రోజు బాహాటంగానే వ్యాపా రులు సిలిండర్లను వినియోగిస్తున్నారు. అయితే అధికారులు, వ్యాపారులు, కొన్ని ఎల్పీజీ డీలర్లకు మధ్య ఉన్న ఆర్థిక ఒప్పందాల వల్లే ఈ దందా అప్రతిహతంగా సాగుతోంది. విషయం సీరియస్ కావడంతోనే అధికారులు కదిలారు తప్ప మరొకటి కాదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## పారాక్వాట్ గడ్డి మందు నిషేధిస్తూ అసెంబ్లీలో తీర్మానించడం అభినందనీయం

కేంద్ర ప్రభుత్వం తక్షణమే దేశవ్యాపితంగా నిషేధించాలి
బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు

**ప్రజాపక్షం/వరంగల్ :** రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఐఎంఎ లాంటి సంస్థలు, అనేక మంది మేధావులు చేసిన డిమాండ్ మేరకు రాష్ట్ర శాసనసభలో పారాక్వాట్ డైక్లోరైడ్ ప్రాణాంతక గడ్డి మందును నిషేధిస్తూ తీర్మానించడాన్ని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు అభినందించారు. అనేక రకాలైన పురుగు మందులకు విరుగుడు చికత్స ఉన్నప్పటికీ పారాక్వాట్ గడ్డి మందుకు విరుగుడు చికిత్స మాత్రం లేకపోవడం అత్యంత ప్రమాదకరంగా తయారైందన్నారు. ఈ ప్రాణాంతక గడ్డి మందును అనేక దేశాలలో ఇప్పటికే నిషేధించారని, ఈ మందును ఉత్పత్తి చేసే స్విట్జర్లాండ్‌లో కూడ దీన్ని నిషేధించారన్నారు. వ్యవసాయంలో దీనిని వినియోగిస్తూ రైతులు, వ్యవసాయ కార్మికులు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందులతో అప్పుల పాలైన రైతు కూలీలు చిరు వ్యాపారులు, చేతివృత్తుల వారు, కుటుంబ సమస్యలతో తీవ్రంగా సతమతమవుతున్న వారు, నిరాశ నిస్పృహలకు గురైన యువతీయువకులు క్షణికావేశంలో ప్రాణాంతక గడ్డి మందు తాగి వేలాదిమంది ప్రాణాలు కోల్పోయి ఆ కుటుంబాలు దిక్కులేనివై పడుతున్న బాధలు వర్ణనాతీతమన్నారు. ఆలస్యంగా నైనా రాష్ట్ర ప్రభుత్వం సమాజ హితాన్ని దృష్టిలో పెట్టుకుని మానవతా దృక్పథంతో ఈ గడ్డి మందును నిషేధించడం హర్షణీయమేనన్నారు. దేశవ్యాప్తంగా ప్రాణాలను హరిస్తున్న పారాక్వాట్‌ను నిషేధించే విధంగా కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ఒత్తిడి తేవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం కాలయాపన చేయకుండా వెంటనే ఈ పోరాక్వాట్ గడ్డి మందు ఉత్పత్తి, దిగుమతి, నిల్వ, రవాణతో పాటు విక్రయాలపై దేశవ్యాప్తంగా పూర్తిగా నిషేధం విధించాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు.

# మహాలక్ష్మి పథకం చారిత్రక మైలురాయి

నగర మేయర్ గుండు సుధారాణి
రూ.290 కోట్ల ఉచిత ప్రయాణాలతో
రూ.10వేల కోట్ల చార్జీల ఆదా
నేపథ్యంలో విజయోత్సవం




**ప్రజాపక్షం/వరంగల్ :** మహాలక్ష్మి పథకం రాష్ట్ర చరిత్రలో ఒక చారిత్రక మైలురాయిగా నిలుస్తుందని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలవుతున్న 99 రోజుల కార్యాచరణలో భాగంగా, ఈనెల 29నాటికి మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ.290కోట్ల ఉచిత బస్సు ప్రయాణాలు జరిగి సుమారు రూ.10,000 కోట్ల ప్రయాణ చార్జీలు ఆదా అయిన సందర్భంగా వరంగల్ ఆర్టీసీ ఆధ్వర్యంలో వరంగల్ బస్ స్టేషన్ ఆవరణలో విజయోత్సవ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలిసి మేయర్ హాజరైనారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ మార్చి నెల మహిళల అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణాల వల్ల మహిళలు వివిధ ప్రాంతాల్లో ఉన్న ఉపాధి అవకాశాలను సులభంగా అందిపుచ్చుకుని, తమ ఆర్థిక స్థితిని బలోపేతం చేసుకునే అవకాశం పొందుతున్నారని అన్నారు. దేశంలో ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ.10వేల కోట్ల ప్రయాణ చార్జీలు ఆదా కావడం ఒక విశేషమని అన్నారు. వరంగల్ జిల్లాలో సుమారు 6 కోట్ల ఉచిత ప్రయాణాలు నమోదై రూ.270 కోట్ల ఆదా సాధించామని తెలిపారు. ఈ పథకం పట్ల మహిళల్లో పెరుగుతున్న స్పందనను టికెట్ల వినియోగం స్పష్టంగా చూపుతోందని పేర్కొన్నారు. జిల్లా పరిధిలో గీసుగొండ, సంగెం మండలాలకు ఒక్కో ఎలక్ట్రిక్ బస్సును కేటాయించి మహిళా సంఘాల ద్వారా నిర్వహిస్తున్నామని తెలిపారు. అదనంగా రూ.200 కోట్ల వ్యయంతో ఎలక్ట్రిక్ బస్సుల కోసం ఆధునిక చార్జింగ్ కేంద్రాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. అనంతరం అత్యధికంగా బస్సు ప్రయాణాలు చేసిన వివిధ రంగాలకు చెందిన మహిళలను కలెక్టర్, మేయర్‌లు శాలువాలతో సత్కరించి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, డిఆర్ఓ విజయలక్ష్మి, డిఆర్‌డిఓ రామ్‌రెడ్డి, డిపో మేనేజర్ ధరం సింగ్, అసిస్టెంట్ మేనేజర్ నజియా సుల్తానా, తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ప్రయోజనం మహాలక్ష్మి పథకం

హనుమకొండ జిల్లా కలెక్టర్
చాహత్ బాజ్ పాయి



**ప్రజాపక్షం/హనుమకొండ :** రాష్ట్రంలోని మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా ప్రయోజనం చేకూరుతుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం డిసెంబర్ 9, 2023 నుండి విజయవంతంగా కొనసాగుతోంది. ఈ పథకం ద్వారా మహిళలు విస్తృతంగా ప్రయాణాలు చేసి ఇప్పటివరకు సుమారు 290 కోట్ల ప్రయాణాలు చేసి దాదాపు 10,000 కోట్ల మేర ఆదా చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి సంబంధించి పదివేల కోట్ల రూపాయల మేర ఆదా చేరుకోవడం పై హనుమకొండ బస్ స్టేషన్‌లో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, వరంగల్ రీజియన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలు జీరో టికెట్ ద్వారా ఉచితంగా ప్రయాణించేందుకు తోడ్పడుతుందని అన్నారు. మహాలక్ష్మి పథకాన్ని మహిళలు పెద్ద ఎత్తున వినియోగించుకొని ఆర్థికంగా లాభపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నిత్యం బస్సుల్లో ప్రయాణించే పలువురు మహిళా ప్రయాణికులను ఆర్టీసీ అధికారులు శాలువాలు, బహుమతులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రీజనల్ మేనేజర్ ఎస్ భవాని ప్రసాద్, డిప్యూటీ ఆర్ఎం (ఆపరేషన్స్) కేశరాజు భాను కిరణ్, వరంగల్ వన్ డిపో మేనేజర్ పుప్పాల అర్పిత గారు, సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.మహాలక్ష్మి పథకం ద్వారా మహిళల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.



## ప్రతీ కుటుంబం ఆర్థిక ఉన్నతే ప్రభుత్వ లక్ష్యం

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని జిఎస్ఆర్ గార్డెన్‌లో దామెర, ఆత్మకూరు మండలాలకు చెందిన లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...33 మంది లబ్ధిదారులకు 33 లక్షల 3828 విలువగల కల్యాణ లక్ష్మి చెక్కులు, అలాగే 66 మంది లబ్ధిదారులకు 24 లక్షలా 43 వేల రూపాయల విలువగల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఇప్పటివరకు పరకాల నియోజకవర్గ వ్యాప్తంగా 2797 మందికి 28 కోట్ల 24 వేల 452 రూ విలువగల కళ్యాణ లక్ష్మి, 2684 మందికి 9 కోట్ల 6 లక్షల 7వేల 500 రూ విలువగల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ నారాయణ, ఆత్మకూరు తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, దామెర తహసిల్దార్ జ్యోతి, ఆత్మకూరు సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీటీసీలు, వివిధ పదవులు ఉన్నటువంటి కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు..

## ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులపై ప్రత్యేక దృష్టి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** కమిషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక రవాణా తో పాటు, గుట్కా విక్రయాలు, రేషన్ బియ్యం, పేకాటను కట్టడి చేసేందుకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్ ఫోర్స్మెంట్ ద్వారా నియంత్రించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశాన్ని మంగళవారం కాకతీయ మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ముందుగా పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టు, ప్రస్తుతం దర్యాప్తులో వున్న కేసులు, వారెంట్లు, అధికారులు, సిబ్బంది పనితీరుపై వరంగల్ పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ నేరాల నియంత్రణకై తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేస్తూ కమిషనరేట్ పరిధిలో పేకాటరాయుళ్ళపై కఠినంగా వ్యవహరించాలని, ప్రధానంగా శివారు ప్రాంతాల్లో స్థానిక పోలీసులు నిరంతరం నిఘా పెట్టాలని,చోరీలకు పాల్పడే వారిపై హిస్టరీ షీట్లను తెరవాలని, అధికంగా చోరీలు జరిగే ప్రాంతాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని, అదే విధంగా ప్రజల భాగస్వామ్యంతో కాలనీలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు, కృషి చేయాలని, స్టేషన్ అధికారులు తమ పరిధిలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను ఎప్పటికప్పుడు జియో ట్యాగింగ్‌కు అనుసంధానం చేయాలని, గంజాయి వినియోగదారున్ని పట్టుకోవడంతో మన బాధ్యత అయిపోతుందని అనుకోకుండా గంజాయిని విక్రయించే వారి గుర్తించి అరెస్టు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిసిపిలు అంకిత్ కుమార్,రాజమహేంద్ర నాయక్,కవిత, జనగామ ఏ.ఎస్పీ చేతన్, ట్రైనీ ఐపిఎస్ మనీషా నెహ్రా, అదనపు డిసిపిలు ప్రభాకర్ , రవి,బాలస్వామి,శ్రీనివాస్ తో పాటు ఏసిపిలు, ఇన్స్పెక్టర్లు, అర్.ఐలు ఎస్.ఐలు పాల్గోన్నారు.



## బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి భరోసా

**ప్రజాపక్షం/పాలకుర్తి :** బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మండలంలోని పాలకుర్తి, తిరుమలగిరి, బమ్మెర గ్రామాలలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తల కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, ఎవరికి ఆపద వచ్చినా ముందుంటానని ఆమె తెలిపారు. ఆమె వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మార్కెట్ కమిటి చైర్ పర్సన్ మజుల భాస్కర్, సర్పంచ్‌లు రమ్య ప్రశాంత్, శ్రీనివాస్ స్వరూప, లక్ష్మి కుమారస్వామి, శ్రీనివాస్, నాయకులు పుల్లయ్య, శ్రీనివాస్, నాగయ్య, కుమార్, రాఘవరావు, యాకాంతరావు, వెంకన్న, భాస్కర్, రాజు, సురేష్, అంజీరావు, మారం శ్రీనివాస్, తదితరులున్నారు.

## మున్సిపల్ సమావేశం రసాబాస

బిఆర్ఎస్ సభ్యుల వాకౌట్
వేదికపై కుర్చీ వేయాలని డిమాండ్
రూ.32.14కోట్లతో అంచెనా బడ్జెట్ ఆమోదం

**ప్రజాపక్షం/జనగామ :** జనగామ మున్సిపల్ సమావేశం రసాబసగా జరిగింది. వేదికపై వైస్ ఛైర్మన్‌కు కుర్చీ వేయాలని బిఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. అందుకు ఛైర్ పర్సన్ కడకంచి బాలమణితో పాటు మెజార్టీ సభ్యులు నిరాకరించడంతో వారు వాకౌట్ చేశారు. దీనితో మున్సిపల్ కార్యాలయం ముందు బిఆర్ఎస్ సభ్యులు భైటాయించి నిరసన తెలిపారు. జనగామ మున్సిపల్ సర్వసభ సమావేశం మంగళవారం ఛైర్ పర్సన్ కడకంచి బాలమణ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కాంగ్రెస్, బిఆర్ఎస్, స్వతంత్ర సభ్యులు పాల్గొన్నారు. బడ్జెట్ సమావేశం ప్రారంభం కాగానే బిఆర్ఎస్ సభ్యులు మాట్లాడుతూ వైస్ ఛైర్మన్ భూస పర్వతాలుకు వేదిక పై కుర్చీ వేయాలని, గత పాలకవర్గంలోనూ వైస్ ఛైర్మన్ వేదకపైనే కూర్చున్నారని వివరించారు. దీనికి కమీషనర్ సమాదానంగా ఛైర్ పర్సన్‌కు అభ్యంతరం లేకుంటే తమకేమి అభ్యంతరం లేదని తెలపగా ఛైర్ పర్సన్ అంగీకరించలేదు. దీనితో బిఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. వాకౌట్ చేసి నిరసన తెలిపిన వారిలో బిఆర్ఎస్ సభ్యులతోల పాటు ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా వారికి మద్దతుగా నిలిచిన స్వతంత్ర సభ్యులు కూడా పాల్గొన్నారు. అయితే అంతకు ముందే సభ్యులు అందరు రిజిస్టర్‌లో సంతకాలు చేయడంతో కోరం ఉన్నట్లుగానే భావించి బిఆర్ఎస్ వాకౌట్ అనంతరం బడ్జెట్ సమావేశం నిర్వయించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు తమ వార్డుల్లోని సమస్యలను వివరించారు.

**రూ.32కోట్ల 14లక్షల 98వేలతో అంచనా బడ్జెట్**

జనగామ మున్సిపల్ అంచనా బడ్జెట్‌ను మంగళవారం జరిగిన సమావేశంలో ఆమోదించారు. నాన్ ప్లాన్ గ్రాంట్స్, ప్లాన్ గ్రాంట్స్, ఇతర గ్రాంట్స్ ద్వారా మొత్తం 32కోట్ల 14లక్షల 98వేలుగా నిర్ణయించారు. జీతభత్యాలు, ప్రజారోగ్యం, రుణాలు తిరిగి చెల్లించడం, ఇంజనీరింగ్ విభాగం ఖర్చులు, జనరల్ అడ్మినిస్టేషన్ విభాగం, పట్టణ ప్రణాళిక విభాగం, ప్రజా సౌకర్యాలు, వార్డుల వారిగా వివిధ పనులకు నిధులు చూపారు. బడ్జెట్ సమావేశంలో కమీషనర్ మహేశ్వర్‌రెడి పలు వార్డుల కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
బుధవారం
01-04-2026
www.prajapaksham.in

టాలీవుడ్ నెంబర్ వన్ నిర్మాత దిల్ రాజు బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్, వంశీ పైడిపల్లి దర్శకత్వంలో వస్తున్న సినిమాలి హీరోయిన్ ఖరారైంది. ఏప్రిల్ లో ప్రారంభం కానున్న ఈ సినిమాలో నయన తారా హీరోయిన్‌గా నటించనుంది


రీల్

# ‘23’ సినిమాకు గద్దర్ అవార్డు అభినందనీయం




మల్లేశం, మెట్రో 8ఎఎం వంటి ఆలోచనాత్మక సినిమాలను రూపందించిన దర్శకుడు రాజ్ రాచకొండ రూపొందించిన తాజా చిత్రం 23(ఇరవై మూడు). నేరస్థులలో వచ్చే పరివర్తన నేరాలను తగ్గిస్తుందనే కథ అంశంతో రూపొందిన ‘23’ సినిమా గత ఏడాది విడుదలై విమర్శకుల ప్రశంసలు అందుకోవడంతో ఇటీవల గద్దర్ స్పెషల్ జ్యూరీ అవార్డును దక్కించుకుంది. ఈ సందర్భంగా చిత్ర బృందానికి జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా సౌమ్యమిశ్రా మాట్లాడుతూ ఈ సినిమా చూసాను అది చాలా ప్రభావవంతంగా ఉంది. ఈ ప్రయత్నం చేసిన టీమ్‌ను అభినందిస్తున్నాను. నేరస్థుల పరివర్తన అనే అంశాలు కథలో బాగా పొందుపరిచారు. జైలు జీవితాలను ఇంత వాస్తవికతంగా తెరమీద ఇప్పటి వరకూ చూపలేదు. ది షాషాంక్ రిడెంప్షన్ వంటి గొప్ప చిత్రాల సరసన నిలబడే చిత్రం 23. ఈ సినిమా ఖచ్చితంగా ఖైదీలకు ప్రదర్శించేందుకు ఏర్పాటు చేస్తాం. కొందరిలో మార్పు వచ్చినా అది ఈ సినిమా సాధించిన గొప్ప విజయం. 23 చిత్రం తెలంగాణ గద్దర్ స్పెషల్ జ్యూరీ అవార్డు గెలుచుకున్నందుకు అభినందనలు అని చెప్పారు. దర్శకుడు రాజ్ మాట్లాడుతూ ఈ ప్రయాణంలో తోడు ఉన్న టీంకి కృతజ్ఞతలు. ఈ సినిమా ప్రయాణం చాలా ప్రత్యేకం. గద్దర్ అవార్డ్స్ జ్యూరీకి థాంక్స్. ఈ నిర్మించిన ప్రయోజనం నెరవేరాలంటే జైళ్లలో ఈ ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వంని కోరుకుంటున్నాను. మా భూమి సినిమా దర్శకుడు బి. నర్సింగ రావు మాట్లాడుతూ ‘23’ వంటి సినిమాలను ప్రభుత్వం ప్రోత్సహం ఇవ్వాలి. మాభూమి, దాసి వంటి వాస్తవికత దృక్పథం ఉన్న సినిమాలు తర్వాత ఆ పరంపర కొనసాగలేదు. ఇప్పుడు 23వంటి సినిమాలు వస్తునందుకు ఆనందంగా ఉంది. చిలకలూరిపేట బస్సు దహనం ఘటన ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది. ఈ కేసులో ఉన్న నిందితుల కథనే సినిమా చూపిస్తుంది. ఆ నేరం ఉద్దేశపూర్వకంగా చేయబడింది కాదు. కానీ ఉద్దేశపూర్వకంగా హత్యలు చేసిన అనేక మంది విడుదలైనప్పటికీ, ఈ కేసులో ఉన్నవారికి ఇప్పటికీ ఉపశమనం లభించ లేదు అనే కథతో తీశారు. ఈ కార్యక్రమంలో డా.బీనా చింతలపురి, నటుడు తాగుబోతు రమేష్, రచయిత భరద్వాజ్ పాల్గొన్నారు.

# ‘పట్టుకో బాబా’ పాట ఆవిష్కరణ



సీనియర్ దర్శకులు మహేష్ చంద్ర దర్శకత్వంలో రూపొందిన ‘పితాపురంలో & అలా మొదలైంది’ చిత్రం ఏప్రిల్‌లో విడుదలకు సిద్ధమవుతోంది. డాక్టర్ రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, అన్నపూర్ణమ్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా ఇందులో ప్రధాన తారాగణం. మహేష్ చంద్ర సినిమా టీం బ్యానర్ పై దుండిగళ్ళ బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్. ఎం. మురళి (గోదావరి కిట్టయ్య) ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రంలో శ్రీరామ్ తపస్వి రాసిన 'పట్టుకో బాబా' పాటను ప్రముఖ దర్శకుడు కొరటాల శివ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొరటాల శివ మాట్లాడుతూ చంద్ర మహేష్ అప్పట్లో తీసిన బ్లాక్ బస్టర్ 'ప్రేయసి రావే' కి నేను రైటింగ్ అసిస్టెంట్ గా పని చేశాను. ఆ తర్వాత ఆయన తీసిన మరికొన్ని చిత్రాలకు కూడా నేను పని చేశాను. అందుకే ఈ పాటను ఆవిష్కరిస్తున్నందుకు చాలా ఆనంద పడుతున్నాను. ఇవాల్టి యువతరం ప్రేమ విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలు, తల్లితండ్రులతో వాళ్ళకున్న కమ్యూనికేషన్ గ్యాప్‌ని చర్చిస్తూ రిలేషన్ షిప్స్, అండర్‌స్టాండింగ్స్ నేపథ్యంలో ఈ సినిమా తీయడం చాలా మంచి విషయం. ఎందుకంటే ఇలాంటి సినిమాలు ఇప్పుడు అవసరం. దర్శకుడు చంద్ర మహేష్ సెన్సిబిలిటీస్ గురించి నాకు తెలుసు.

దర్శకుడు మహేష్ చంద్ర మాట్లాడుతూ ‘ఇటీవల విడుదల చేసిన ట్రైలర్ కి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. సినిమా ఫస్ట్ కాపీ తో సహా సిద్ధమయింది. ఏప్రిల్ లో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం అని తెలిపారు. ఈ చిత్రానికి కథ: ఆకుల సురేష్ పటేల్, స్టోరీ డెవలప్మెంట్ డైలాగ్స్ : శ్రీరామ్ ఏదోటి, ఎడిటర్: సత్యనారాయణ, మ్యూజిక్ : క్రిష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అంజి సంద్రాల, నిర్మాతలు: దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, మురళీ (గోదారి కిట్టయ్య), స్క్రీన్ ప్లే డైరెక్షన్: మహేష్ చంద్ర .

# సల్మాన్‌ఖాన్ సరసన నయన తార




టాలీవుడ్ నెంబర్ వన్ నిర్మాత దిల్ రాజు బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్‌ఖాన్, వంశీ పైడిపల్లి దర్శకత్వంలో వస్తున్న సినిమాలి హీరోయిన్ ఖరారైంది. ఏప్రిల్ లో ప్రారంభం కానున్న ఈ సినిమాలో నయన తారా హీరోయిన్‌గా నటించనుంది. ఇటీవల తెలుగులో హిట్ అయిన మన శంకర వర ప్రసాద్ గారు సినిమాలో నయన తారా నటించిన విషయం తెలిసిందే. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ సినిమా నిర్మిస్తున్నారు. బిగ్ స్కేల్ ఎంటర్‌టైనర్స్‌ను ఎమోషన్స్‌తో మేళవిస్తూ చిత్రాలను రూపొందించే దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు. వంశీ పైడిపల్లి. ప్రభాస్, ఎన్టీఆర్, మహేష్ బాబు, రామ్ చరణ్, అల్లు అర్జున్, విజయ్ వంటి అగ్ర హీరోలతో పనిచేసి, విభిన్న జానర్స్‌లో తన ప్రతిభను నిరూపించుకున్నారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన ‘మహర్షి’ జాతీయ అవార్డు సాధించడం ఆయన విజన్‌కి నిదర్శనం. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై. 60కి పైగా చిత్రాలను నిర్మించిన దిల్ రాజు కంటెంట్, కమర్షియల్ విజయాలతో సక్సెస్‌ఫుల్‌గా నిర్మాతగా పేరు తెచ్చుకున్నారు. ‘మహర్షి’, ‘శతమానం భవతి’ చిత్రాలకు జాతీయ అవార్డులు అందుకోవడం ఆయన క్లారిటికి నిదర్శనం. ఈ ప్రాజెక్ట్ ద్వారా సల్మాన్ ఖాన్ తొలిసారి వంశీ పైడిపల్లి – దిల్ రాజుతో కలిసి పని చేయబోతున్నారు. ప్రతి సినిమా బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు సల్మాన్ ఖాన్ మ్యాసీవ్ స్క్రీన్ ప్రెజెన్స్, వంశీ పైడిపల్లి స్పెషల్ స్టోరీ టెల్లింగ్, దిల్ రాజు గ్రాండ్ ప్రొడక్షన్ వాల్యూస్ కలిసిన ఈ సినిమా ప్రేక్షకులకు అద్భుతమైన థియేట్రికల్ అనుభూతిని అందించనుంది.


# ‘గుర్తుందా’ సాంగ్ లాంచ్



హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా ‘కలర్ ఫోటో‘, ‘బేబి’ వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్.కె.ఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్ లో రూపొందుతున్న ‘చెన్నై లవ్ స్టోరీ‘ సినిమాకు బిజినెస్ పరంగా మంచి క్రేజ్ ఏర్పడుతోంది. ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై ఎస్ కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశలో ఉంది. మెలొడి బ్రహ్మ మణిశర్మ ‘చెన్నై లవ్ స్టోరీ‘ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సినిమా నుంచి గుర్తుందా సాంగ్ లాంచ్ ఈవెంట్ ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గేయ రచయిత అనంత శ్రీరామ్ మాట్లాడుతూ మేము చెప్పింది గొప్ప అనే అహాన్ని మరచి ప్రతి ఒక్కరూ ఈ సినిమా కోసం పనిచేశారు. ఈ సాంగ్ కోసం నేను పల్లవి రాశాక మణిశర్మ సంగీతాన్ని అందించారు, చరణం మణిశర్మ కంపోజ్ చేశాక నేను లిరిక్స్ రాశాను. ఎలాంటి ఈగో లేకుండా మేమంతా వర్క్ చేశాం అని అన్నారు. దర్శక నిర్మాత సాయి రాజేశ్ మాట్లాడుతూ బేబి మూవీ విజయం తర్వాత మేము డబ్బుల వెనక పరుగు పెట్టలేదు. ఒక మంచి కథతో మళ్లీ మూవీ చేయాలని అనుకున్నాం. నా మనసుకు నచ్చిన ఒక కథను రాసుకున్నాను అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ మణిశర్మ మాట్లాడుతూ మా సాయి రాజేశ్‌తో నాకు పరిచయం లేదు. ఆయన ఈ మూవీ కోసం వచ్చినప్పుడు బేబి డైరెక్టర్ అని తెలిసింది. నాతో ఏం పని ఉంటుందని అనుకున్నా. ఆయన కలిసి చెన్నై లవ్‌స్టోరీ మూవీకి మ్యూజిక్ చేయాలని అడిగారు. మూవీ కోసం డిస్కషన్స్ చేస్తూ బ్రహ్మాండమైన ట్యూన్స్ కుదిరాయి. పాటలు విని మీరు చెప్పాలి. కిరణ్‌తో నేను చేస్తున్న రెండో చిత్రమిదిఅన్నారు. హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ మాట్లాడుతూ గ్లింప్స్ రిలీజైనప్పటి నుంచి చెన్నై లవ్‌స్టోరీ మూవీ మీద చాలా అంచనాలు ఏర్పడుతున్నాయి. ఈ సినిమాలో కిరణ్ తో కలిసి వర్క్ చేయడం హ్యాపీగా ఉంది. ఆయన ఈ చిత్రం తర్వాత మరింత గొప్ప ఇమేజ్ తెచ్చుకుంటారు. చెన్నై లవ్‌స్టోరీ మూవీలో ఇంత బరువైన, ప్రాధాన్యత ఉన్న క్యారెక్టర్ నేను చేయగలను అని నమ్మిన దర్శక నిర్మాతలకు థ్యాంక్యూ అని అన్నారు. నిర్మాత ఎస్.కె.ఎన్ మాట్లాడుతూ సినిమాను జూన్ 26 అనుకున్నాం కానీ ఆ తేదీన రామ్ చరణ్ పెద్ది సినిమా వస్తోంది. మా సినిమా రిలీజ్ డేట్‌ను త్వరలో ప్రకటిస్తాం. అన్నారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ చెన్నై లవ్ స్టోరీ మూవీ డాల్బీలో చేస్తుండటం సంతోషంగా ఉంది. సినిమా కోసం మా టీమ్ అంతా చాలా ఎఫట్స్ పెడుతున్నారు. మణిశర్మ ఏడు పాటలు కంపోజ్ చేశారు. ఏడు పాటల్ని మీరు థియేటర్స్ లో సెలబ్రేట్ చేసుకుంటారు అని అన్నారు.

# ఏప్రిల్ 17న ‘కాలగమనం’ విడుదల

పిఆర్ ఫిలిమ్స్ పతాకంపై రాజా బిరుదుల, లావణ్య రామారావు, చిన బాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం ‘కాల గమనం’. సుధాకర్ బుర్రి దర్శకత్వం వహిస్తూ, నిర్మిస్తోన్న ఈ లవ్ అండ్ యూత్ ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ చిత్రం ఏప్రిల్ 17న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదలయ్యేందుకు ముస్తాబైంది. ఇప్పటికే నిర్మాత ఎవిఎమ్ రత్నం విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ ట్రెమండస్ రెస్పాన్స్‌ను సొంతం చేసుకుంది. ఏప్రిల్ 17న ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత సుధాకర్ బుర్రి మాట్లాడుతూ ‘‘లెజెండరీ ప్రొడ్యూసర్ ఏవిఎమ్ రత్నం మా చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆ పోస్టర్ చాలా మంచి స్పందనను రాబట్టుకుంది. ప్రస్తుతం సినిమాకు సంబంధించి అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఏప్రిల్ 17న ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం. యూత్ మెచ్చే ఓ మంచి ప్రేమకథ ఇది. అదేవిధంగా పెద్దలను పిల్లలను ఆలోచింప చేసే సందేశాత్మక చిత్రమిది. అతి త్వరలోనే టీజర్ విడుదల చేయనున్నాము అని తెలిపారు. రాజా బిరుదుల, లావణ్యరామారావు, చిన్న బాబు కల్లా, డాక్టర్ జబర్దస్త్ రాజమౌళి, అన్నె శిరీష, సతీష్ సరిపల్లి, ఆర్కే నాయుడు, బలగం రమేష్, బలగం కర్తానందం, జబర్దస్త్ శాంతి కుమార్, శివ ప్రసాద్, తిరు నాచురల్ , చిన్నారావు దొడ్ల, సీతారాం తదితరులు నటించిన ఈ చిత్రానికిమ్యూజిక్ రాజేష్ రాజ్ తేలు, డి.ఒ.పి మురళి కంకణాల, ఎడిటర్ శ్రీకృష్ణ ప్రసాద్, నిర్వహణ పిల్లెం రామారావు.



# అసెంబ్లీలో కూనంనేని 4.22 గంటల ప్రసంగం



ప్రజాపక్షం/హైదరాబాద్: సిపిఐ శాసన సభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు శాసనసభలో తనకు మాట్లాడేందుకు లభించిన సమయంలో ప్రజా సమస్యలను లేవనెత్తి పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకున్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలు మొత్తం పది రోజులలో 82.47 గంటల పాటు జరగగా 4.22 గంటల పాటు కూనంనేని సాంబశివరావు సభలో మాట్లాడారు. సభలో అత్యధికంగా శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు 6.29 గంటల పాటు మాట్లాడారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నిరవధికంగా వాయిదా వేస్తూ సభలో వివిధ పక్షాల నేతలు మాట్లాడిన సమయం వివరాలను ప్రకటించారు. ఆ వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

| మాట్లాడిన వారి పేరు | సమయం (గంటలలో ) |
|---|---|
| ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి | 4.26 |
| ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క | 4.43 |
| శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు | 6.29 |
| బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉపనాయకులు తన్నీరు హరీశ్‌రావు | 4.16 |
| బిఆర్ఎస్ ఎంఎల్‌ఎ కె.తారకరామారావు | 1.44 |
| బిఆర్ఎస్ ఎ ంఎల్‌ఎ పల్లా రాజేశ్వర్ రెడ్డి | 47 |
| బిఆర్ఎస్ ఎంఎల్ఎ వేముల ప్రశాంత్ రెడ్డి | 13 |
| బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి | 3.28 |
| ఎంఐఎం ఎంఎల్‌ఎ అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల | 1.57 |
| సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు | 4.22 |
| మొత్తం సభ కొనసాగిన సమయం | 82.47 |

# గడ్డి మందు నిషేధంపై అసెంబ్లీలో తీర్మానం భేష్

తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎ.కోదండరెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : పారక్వాట్ గడ్డి మందు నిషేదిస్తూ సోమవారం అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షనీయమని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎ.కోదండరెడ్డి అన్నారు. అత్యంత విషపూరితమైన పారక్వాట్ వల్ల వందలాది మంది తెలంగాణ రైతులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గడ్డి మందు, కలుపు మందు నిషేధించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రైతు సంఘాల నేతలు రైతు కమిషన్ దృష్టి కి తీసుకురావడం దీంతో రాష్ట్రంలో గడ్డి మం దు నిషేదించడంతో పాటు దేశంలో కూడా నిషేధించడానికి కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలని రైతు కమిషన్ కోరింది. ఈ నేపథ్యం లో రైతు కమిషన్ సూచన మేరకు అసెంబ్లీలో తీర్మానం పెట్టడం సంతోషమన్నారు. ఈ అంశంపై మంగళవారం కమిషన్ కార్యాలయం లో వ్యవసాయ అధికారులతో చర్చించారు. ఈ మందు అమెజాన్‌లో కూడా అందుబాటులో ఉండడంపై కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. అ మెజాన్‌కు లైసెన్స్ ఇవ్వడంపై, విష పూరితమైన గడ్డి మందును ఎట్లా సప్లై చేస్తుందని ప్రశ్నించా రు. అమెజాన్‌కు గడ్డి మందు విషయంపై నోటీసులు ఇవ్వాలని రైతు కమిషన్ అధికారులను ఆదేశించింది. ఇక భూసార పరీక్షా కిట్ల పనితీరుపై వ్యవసాయ అధికారులను కమిషన్ అడిగి తెలుసుకుంది. రైతుల్లో భూసార పరీక్షపై మరిం త అవగాహన కల్పించాలని నేలకు తగ్గట్టుగా రై తులు పంటలను సాగుచేసేలా చూడాలని కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి సూచించారు. పంటల మార్పిడి విధానంపై కూడా రైతుల్లో పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సభ్యులు గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, కెవిఎన్ రెడ్డి, మెంబర్ సెక్రెటరీ గోపాల్, వ్యవసాయ శాఖ అధికారులు గీతారెడ్డి, సుచరిత, శ్రీధర్ తోపాటు కమిషన్ అధికారులు సంధ్యా రాణి, హరి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ కమ్యూనిస్టు కొండిగారి రాములు

ఎంతో మందికి స్ఫూర్తి
సంస్మరణ సభలో వక్తలు



ప్రజాపక్షం/రంగారెడ్డి/ ఇబ్రహీంపట్నం: ఉత్తమ కమ్యూనిస్టుగా అనేకమందికి స్ఫూర్తిని నింపిన నాయకుడు ఇబ్రహీంపట్నం మాజీ ఎంఎల్ ఎ కొండిగారి రాములు అని సి పిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు.రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని మంచాల్ రోడ్ లో భారత్ గార్డెన్‌లో సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఇటీవల మరణించిన కొండిగారి రాములు సంస్మరణ సభ నిర్వహించడం జరిగింది. తొలుత ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కావాలి నరసింహా అధ్యక్షతన జరిగిన ఈ సభలో కూనంనేనితో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య,సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంత రావు,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య,సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్ రావు,రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, ఓరుగంటి యాదయ్య,ఫైమీద,రామకృష్ణ, రామస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ చిన్న వయసులోనే కమ్యూనిస్టు ఉద్యమం వైపు ఆకర్షితులైన కొండిగారి రాములు ఈ ప్రాంతంలో జరిగిన అనేక పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారు. పేదలకు భూములు పంపిణీ చేయటం, కూలీ రేట్లు పెంచడం,కుల వివక్షతకు వ్యతిరేకంగా జరిగిన అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది పేదలకు ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇప్పించడంలో విశేష కృషి చేశారని తెలిపారు.అంతేకాకుండా తన తుదిశ్వాస విడిచేంతవరకు కమ్యూనిస్టుగా నిరాడంబరమైన జీవితాన్ని గడిపారని కూనంనేని కొనియాడారు. కమ్యూనిస్టు విలువ బతికున్నప్పుడు తెలవదు, అతను మరణించిన తర్వాతే తెలుస్తుందన్నారు. మన తెలుగు రాష్ట్రాల్లో చూసినట్లయితే సురవరం సుధాకర్ రెడ్డి, చంద్ర రాజేశ్వరరావు, గిరి ప్రసాద్,సీతారాం, పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణరెడ్డి, ధర్మ బిక్షం, బి.ఎన్.రెడ్డి, మల్లు స్వరాజ్యం, ఇలా అనేకమందిని ఏ పదవులు అనుభవించకపోయిన మంత్రులు, ముఖ్యమంత్రుల కంటే ఎక్కువగా ప్రజలు ఆదరణ చూపిస్తారని గుర్తు చేశారు. నేడు సోషల్ మీడియా, విద్వేష పూరితమైన ప్రసంగాల పేరుతో అణచి వేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభలో విచిత్రమైన బిల్లును తీసుకువచిందన్నారు. కాంగ్రెస్ తో మనకు స్నేహం ఉన్నప్పటికీ ఈ బిల్లును మనం వ్యతిరేకించడం జరిగిందన్నారు.దీన్ని రాష్ట్రంలో బిజెపి వ్యతిరేకిస్తున్నప్పటికీ, కేంద్రంలో బిజెపి తీసుకువచ్చిన అనేక చట్టాలతో ఇప్పటికీ ఉక్కిరిబిక్కిరి అవుతుంటే, అదే మాదిరిగా కాంగ్రెస్ చేస్తే.. స్నేహం కొన్ని అంశాలకే పరిమితమవుతుందని తెలిపారు.

**మావోయిస్టులు – మా రక్తమే**

దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తామని శపథం చేసిన అమిత్ షా కేంద్ర కమిటీని అంతం చేశామని చెప్పుకోవడం జరుగుతుందని, మావోయిస్టులుగా వున్నా వారిని తాత్కాలికంగా అంతం చేయవచ్చు కానీ కమ్యూనిస్టులను చేయగలుగుతావని సాంబశివరావు ప్రశ్నించారు. మావోయిస్టుల సైతం కమ్యూనిస్టు పార్టీ నుండి పోయిన వారేని,వారు మా రక్తమేనని తెలిపారు. అంతకు ముందు కామ్రేడ్ కొండిగారి రాములు సేవలను సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు,సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య,సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి,సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య,సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పుస్తకాల నర్సింగరావు లు అయన పార్టీ కి, ఈ ప్రాంత అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి వంద సమర్పణ చేయగా కార్యక్రమంలో సిపి ఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం ప్రభు లింగం, సామిడి శేఖర్ రెడ్డి, నిలమ్మ, పబ్బతి లక్ష్మణ్, బాతురాజు నరసింహ,శీను నాయక్,పి శివకుమార్, సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి కావలి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## కోలుకున్న సోనియా...

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం స్థిరంగా ఉందని, ఎటువంటి ఆందోళన అవసరం లేదని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. దీంతో ఆమె అభిమానులు, పార్టీ నేతలు ఊపిరిపీల్చుకున్నారు.

## మూసీ పునరుజ్జీవం

(మొదటి పేజీ తరువాయి)

మూసీ పునరావాసితులతో సంప్రదింపులు, నిర్మాణ డిజైన్లు తుది దశకు తీసుకురావడం, బ్యాంకర్స్‌తో మాట్లాడటం ఇలా పనులను ఎక్కడికి అక్కడ విభజన చేసుకుని ముందుకు వెళ్లాలని అధికారులకు ఆయన సూచించారు. ‘సిఎం రేవంత్ రెడ్డి యావత్ మంత్రివర్గ సంకల్పాన్ని అర్థం చేసుకుని అధికారులు ఉత్సాహంగా ముందుకు వెళ్లాలి. మీ జీవితాల్లో ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుంది. ఎలాంటి సలహాలు, సూచనలు ఇతర ఏ అవసరాలు ఉన్నా మూసీ సబ్ కమిటీ సభ్యులు 24 గంటలూ అందుబాటులో ఉంటారు’ అని అధికారులకు డిప్యూటీ సిఎం చెప్పారు. సమావేశంలో స్పెషల్ సిఎస్ రంజన్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి ఈ.వి.నరసింహారెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, అధికారులు వినయ్ కృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి, కలెక్టర్లు హరిచందన, నారాయణరెడ్డి, మన చౌదరి, జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

## దంపతుల ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

ఉండటాన్ని గమనించింది. ఆమె పదేపదే తలుపు తట్టినా లోపల ఉన్న భర్త స్పందించలేదు. దీంతో ఆందోళన చెందిన ఆమె భద్రతా సిబ్బందిని, ఇరుగుపొరుగును అప్రమత్తం చేసింది. వారు బలవంతంగా తలుపు తెరిచి చూడగా... భాను మత దేహం కనిపించింది. కొన్ని నిమిషాల తర్వాత షాజియా అదే నివాస సముదాయంలోని 17వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. దీంతో రెండు కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. తెలంగాణలో కుటుంబ సభ్యులు దాఖలు చేసిన ఫిర్యాదుల ఆధారంగా రెండు వేర్వేరు బలవంతపు మరణాలు కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ జంట ఆత్మహత్యలకు దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## వ్యాట్ తగ్గించండి

(మొదటి పేజీ తరువాయి)

కథనాలు వెల్లడించాయి. ఏప్రిల్ 1న ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ ధరలు సవరిస్తారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ఇంధన ధరలు పెంచితే... విమాన టికెట్లపై భారం పడే అవకాశం ఉంది. అందువల్ల కేంద్ర మంత్రి ఈ అభ్యర్థనలు పంపినట్లు తెలుస్తోంది. ‘దిల్లీలో విమాన ఇంధనంపై విలువ ఆధారిత పన్ను(వ్యాట్) 25 శాతం ఉంది. మహారాష్ట్రలో 18 శాతం, తమిళనాడులో 29 శాతం వ్యాట్ అమలుచేస్తున్నారు. వీటిని తగ్గిస్తే విమాన టికెట్లపై భారం పడకుండా ఉంటుంది’ అని కేంద్ర మంత్రి తన లేఖలో పేర్కొన్నారు.

## తల్లి ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

సంతానం. కాగా, స్రవంతికి చెల్లెలి వరుసయ్యే మహేశ్వరిని ఏడాది క్రితం ప్రవీణ్ రెండో వివాహం చేసుకున్నాడు. అప్పటినుంచి దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీనిపై పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు సైతం జరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రవీణ్ భార్యతో విడిపోయి అక్కడి సమీపంలో మరో ఇంట్లో నివాసం ఉంటున్నాడు. పగలు రాత్రి తేడా లేకుండా మద్యం సేవించి స్రవంతి వద్దకు వచ్చి ప్రవీణ్ నిత్యం వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో చివరిసారిగా మూడు రోజుల క్రితం ప్రవీణ్ సొంతూరైన మాణిక్యం తండాలో మళ్లీ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ప్రవీణ్, స్రవంతిలు కలిసి ఉండాలని పెద్దలు తీర్మానించి పంపించినట్లు తెలుస్తోంది. దంపతులిద్దరూ సోమవారం నగరానికి చేరుకున్నారు. మంగళవారం ఉదయం ప్రవీణ్ పనులకు వెళ్లి మధ్యాహ్నం భోజన సమయానికి తిరిగివచ్చారు. అప్పటికే స్రవంతి తలుపు గడియ పెట్టుకుని ఎంతకీ తీయలేదు. ఇరుగుపొరుగు సహాయంతో తలుపు బద్దలు కొట్టి చూడగా భార్యతో పాటు ఇద్దరు కుమారుల మృతదేహాలు ఇంటిపై కప్పునకు వేళాడుతూ కనిపించాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com